తొలి మహామంత్రిణి

# నాయకురాలు నాగమ్మ

(చరిత్ర దాచిన పల్నాటి ప్రామాణిక దర్పణం)







- వై.హెచ్.కె. మోహన్‌రావు

## తొలి మహామంత్రిణి

# నాయకురాలు నాగమ్మ

### (చరిత్ర దాచిన పల్నాటి ప్రామాణిక దర్పణం)







- వై.హెచ్.కె. మోహన్‌రావు

**తొలి మహామంత్రిణి**
**నాయకురాలు నాగమ్మ**
(చరిత్ర దాచిన పల్నాటి ప్రామాణిక దర్పణం)

**వై.హెచ్.కె. మోహన్‌రావు**
ఫోన్ : 9440154114

@ Copyrights Reserved

*తొలిముద్రణ*
2011

వెల : రూ. 60/-

*కాపీలు : 2000*

*లభించు చోటు :*
**వై. హెచ్.కె. మోహన్ రావు**
పల్నాడు రచయితల సంఘం అధ్యక్షులు
హెచ్.నెం : 11-61/3, జె.పి.రోడ్,
పిడుగురాళ్ళ-522413
గుంటూరు జిల్లా, (ఎ.పి.)

*ముద్రణ*
**శ్రీలక్ష్మి ప్రెస్**
14/2, అరండల్‌పేట
గుంటూరు-2
ఫోన్ : 0863 - 2230643

# పసిడి పల్నాడు

ప : శ్వేత వర్ణపు గర్భ
శౌర్య కథలకు దొడ్డ
పల్లెసీమలనేలు పలనాడు
పాడిపంటల మేలు వెలనాడు

చ1 : శిరము నాగార్జునము
సిగన నందీకొండ
సిరసెత్తి ఆడితే చంద్రవంక
చినబోయి నిలిచేను నెలవంక

చ2 : ఎత్తిపోతల ఎగువ
నాగులేరే దిగువ
నాజూకు కృష్ణమ్మ నడుము సింగారమై
నడిచింది నాతల్లి కొంగు బంగారమై

చ3 : దైద శ్రీ లింగన్న
అమ్మ అంకాళమ్మ
ఆశీస్సులందించగా, చరితకే
చుక్కాని అయ్యిందిరో !

చ4: ఆర్య నాగార్జునుని
కార్య సాధనలోన
బుద్ధమే విలసిల్లెను ! ఈ నేల
గణిత జ్యోతులు వెలిగెను

చ5 : నారీలోకపు భేరి
నాయకీ నాగమ్మ
విశ్వాన తొలిమంత్రిణి ! మగువలకు
మరువని మంత్రాక్షరి

చ6 : కన్నెగంటి హనుమంతు
కదిలివచ్చే కడలి
తెల్లగుండెలు అదిరెను! ఆ తెగువ
తెల్లగుండ్లకు వొరిగెను

చ7 : స్వాతంత్ర సమరాన
దిట్ట మట్టపల్లి
పల్నాటి గాంధీ అతడే! ఈ సీమ
వెలనాటి వెలుగాయలే

చ8 : ఉమ్మడీ కమ్యూనిస్టు
ఉద్యమాలను నాటి
అరుణ కాంతులు విరియబూసింది
ఎఱ్ఱజెండనే ఎగురవేసింది

చ9 : పౌరుషాలకు కోట
ప్రేమ విరిసినతోట
ప్రాణాల నొడ్డిందిరో ! పలనాడు
త్యాగాల పుట్టిల్లురో !



# సాహసరచన


దేవి

సాంస్కృతిక కార్యకర్త

(ప్రజానాట్యమండలి పూర్వ కార్యదర్శి, అధ్యక్షురాలు)


ఈ రాణి ప్రేమ పురాణం
ఆ ముట్టడి కైన ఖర్చులూ
మతలబులు,కైఫీయతులు
ఇవి కావోయ్ చరిత్రసారంః– అంటారు. – **మహాకవి శ్రీశ్రీ**

చరిత్ర అంటే రాజుల సంగ్రామాల పట్టిక కాదంటాడు మహా చరిత్రకారుడు డి.డి.కొశాంబి. మనదేశచరిత్ర యింటా బయటా అనేక వక్రీకరణలకు గురైంది. గురవుతుంది. తమ చరిత్రను నమోదు చేయాలని మనదేశంలో రాజులు ముస్లిం పాలకుల కాలందాకా భావించ లేదు. కొన్ని శాసనాలు తప్ప పురావస్తు ఆధారాల్లేవు. పురాణాలు ప్రామాణికంగావు.లిఖిత సాహిత్యం కూడా ఇతిహాసమే తప్ప చరిత్రకాదు. వీటికి తోడు మౌఖిక సాహిత్యం ఉంది.అయినా కొశాంబి చరిత్రరచనను ఒక శాస్త్రీయతకు తెచ్చారు. పై వాటికి తోడు వివిధ సమాజాల్లో కొనసాగుతున్న మార్పుల ముద్రల్ని కూడా ఆయన ఒక ఆధారంగా విశ్లేషించారు. అయితే విశ్లేషించాల్సింది ఎంతో ఉంది. దక్కను పీఠభూమి చరిత్ర లోతుకు ఇంకా మనంచేరలేదు. ప్రాంతాల వారీగా, కాలాల వారీగా చరిత్రపై సమగ్ర పరిశోధన జరగాలి. తెలుగు గడ్డపై ఏ కాలంలో ఏ వైరుధ్యం వలన శైవ వైష్టవ ఘర్షణలు జరిగాయనేది నాకు మొదట్నించి ఆసక్తి గల అంశం.పల్నాటి సీమలో 11వ శతాబ్దం ఎట్లా గడిచింది. శైవాన్ని, వైష్ణవాన్ని ఎవరెవరు అనుసరించారు? ఎందుకని? ఏ ప్రయోజనాలు మత వైషమ్యాలుగా చిత్రితమై యుద్ధాలు జరిగాయి? ఈ వ్యవసాయ సమాజంపై రాజులు,భూకామందుల ఆధిపత్య పీడన ఏరూపంలో ఎంత మేరకు ఉండేది? అసలు కులసామరస్యం బోధించాల్సిన అవసరం ఎందుకు ఏర్పడింది? ఇంకా ఇలాంటి అనేక ప్రశ్నలకు జవాబులు వెతకాలి. 2006లో "తెలుగు వెలుగు" రాసినపుడు నాకు ఎదురైన ప్రశ్నలివి.

**అయితే ఈ పుస్తకం మాత్రం 'నాయకురాలు నాగమ్మ' గురించి మాత్రమే..**

నాయకురాలిపై నా మక్కువ రోజు రోజుకూ పెరిగింది. ఎందుకంటే 21వ శతాబ్దంలో అధికార భాగస్వామ్యం అడిగితే ఆధునిక పురుషాధిక్యత ఆంబోతు రంకెలు

వేస్తున్నది కాదా? మరి వెయ్యేళ్ళ కిందట ఒక స్త్రీ మంత్రి ఎలా అయ్యింది? ఎందుకయ్యింది.? నిలదొక్కుకుని తనను తాను ఎలా నిరూపించుకుంది.? ఏమేమి ఎదుర్కొంది? ఒక అద్భుతం... రుద్రమదేవి మహారాజు కూతురు. రాజ్యం వారసత్వం.. పాలనా సామర్థ్యం తండ్రి శిక్షణలో లభించింది. కాని వ్యవసాయ కుటుంబంలో పుట్టి వైధవ్యంలో ఉండి మంత్రి కావటం.. వ్యూహాలు..సమర్ధ పాలన.. యుద్ధ నైపుణ్యం చెక్కుచెదరని ఆత్మ విశ్వాసం.. ఆలోచిస్తే ఎంత గొప్ప మనిషై ఉండాలి నాగమ్మ?. ఎంత సామర్థ్యం,తెలివి ఉండాలి?. ఎంత శ్రమ చేసి ఉండాలి.? ఆంక్షల్ని,ఆధిపత్యాల్ని ధిక్కరించినందుకు ఆమెను నాయకురాలి పాత్ర నుండి లాగి పారేసి ప్రతినాయకురాలిగా ముద్ర వేసి కసి తీర్చుకుందా మన సమాజం? ఒక స్త్రీ సామర్థ్యాన్ని ఒప్పుకోక తప్పని స్థితి ఏర్పడితే దానికి దుష్టత్వాన్ని ఆపాదించి సంతృప్తి చెందిందా మనువు భావాల్ని పుణికి పుచ్చుకున్న పెత్తనం?

పల్నాటి చరిత్ర ప్రచారంలో నాగమ్మకు అన్యాయం జరిగిందని మోహనరావు గారు రోషించారు. ఆయనది కవి హృదయం. పీడితుల పట్ల ప్రేమ, అన్యాయం పట్ల ఆక్రోశం కవికుండాల్సిన లక్షణాలు. ధీరవనిత నాగమ్మ విజేత.. ఆమెను నేరుగా ఏ విషయంలోనూ గెలవ లేక.. దుర్మార్గురాలిగా చిత్రించిన కుట్రయిది అని ఆయన నిరూపించారు. అట్లా నిరూపించడానికి జానపద గాథలు,పాటలు, స్వదేశీ విదేశీ రచయితల పుస్తకాలు,శాసనాలు చాలా శ్రమకోర్చి సేకరించారు.

నాగమ్మ ప్రతినాయకురాలు కాదని వీటన్నింటిలో కొట్టొచ్చినట్టుగా కనపడే అంశం. అయినా దుష్ప్రచారం జరిగింది.జరుగుతోంది. ఇక బాలచంద్రుడు మనకు అభిమన్యుడని ప్రచారం,కానీ ఈ హీరో ఎన్ని దుర్లక్షణాలున్న జీరోనో ఈ పుస్తకం తేల్చింది. అలాగే బ్రహ్మనాయుడు.. కులసామరస్యానికి ప్రతీక.. గొప్పవ్యక్తి... అది నిజమా?

చరిత్ర పరిశోధన కష్టం.ప్రాంతాల చరిత్ర మరీ కష్టం. కాని చరిత్రలో నిజా నిజాలు వెలికి తీయటం చాలా అవసరం.ఆ పని చేసే వారు నిష్పక్షపాతంగా, శాస్త్రీయంగా పరిశీలించాలి.సమాజంలో బలంగా ప్రాచుర్యంలో ఉన్న వాటిని తప్పు అని చెప్పడానికి కొంత సాహసం అవసరం. అది మోహనరావు గారికి ఉంది. ఒక వక్రీకరణ పట్ల ఉండే న్యాయమైన కోపంతో ఆయన ఈ రచన చేశారు. స్త్రీగానో పురుషునిగానో వాటి తాలూకు భావజాలంతోనో కాక ఒక మనిషిగా ఆయన స్పందించారు. అది ఈ రచన విశిష్టత.

ఈ రచన చేసినందుకు వ్యక్తిగతంగానే కాక మహిళలందరి తరఫున వారికి ధన్యవాదాలు.



# ధర్మాగ్రహం

**రావూరి ప్రసాద్,** సీనియర్ జర్నలిస్టు,
(ఛీఫ్ ఎడిటోరియల్ డిపార్ట్‌మెంట్–ఈనాడు)

'ఇతిహాసపు చీకటి కోణం
అట్టడుగున పడి కన్పించని
కథలన్నీ కావాలిప్పుడు!
దాచేస్తే దాగని సత్యం – శ్రీశ్రీ

భారత ఇతిహాసంతో ఉన్న పోలికల కారణంగా 'పల్నాటి వీరచరిత్ర' – తెలుగు నాట మహాభారత గాథ స్థాయి ప్రాచుర్యం పొందిందని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. నాగమ్మ మంత్రాంగం నెరపిన నలగామరాజు పక్షాన్ని కౌరవులతో, బ్రహ్మనాయుడు మంత్రిగా ఉన్న మలిదేవాదుల పక్షాన్ని పాండవులతో పోల్చడం ఎప్పటినుంచో ఉన్నదే. పల్నాడు చీలికకు, యుద్ధానికి, పర్యవసానాలకు కారకురాలిగా నాగమ్మనే బోనెక్కించారు, ప్రతినాయకురాలిగా చిత్రించారు, దోషిగా తీర్పునిచ్చారు చరిత్రకారులు. నిజానికి–నాగమ్మ నాయకురాలని, బ్రహ్మనాయుడే ప్రతి నాయకుడని రచయిత శ్రీ వై.హెచ్.కె. మోహన్‌రావు ప్రగాఢ విశ్వాసం. అంతమాత్రాన ఆయనను నాగమ్మ పక్షపాతిగానో, చరిత్రను వక్రీకరిస్తున్న వారిగానో భావించనక్కర లేదు. దాదాపు వెయ్యేళ్ళక్రితం మహిళల్ని వంటింటికే పరిమితం చేసి, పురుషసమాజం ఆధిపత్యాన్ని, అధికారాన్ని చలాయిస్తున్న రోజుల్లోనే – తన మేధోసంపదతో, కార్యనిర్వాహణాదక్షతతో రాజాదరణను చూరగొన్న ధీశాలి ఆమె. 'మహామంత్రిణి'గా వాసికెక్కిన ఓ మహిళకు, ఓ నాయకురాలికి చరిత్రలో అన్యాయం జరిగిందన్న మోహన్‌రావుగారి ధర్మాగ్రహం అక్షరరూపం దాల్చడం ఆయన సహృదయ సంస్కారానికి నిదర్శనం. వీరపూజ, వ్యక్తి ఆరాధన, పక్షపాత పూరిత రాగద్వేషాల ప్రదర్శన – కొందరు నాయకుల్ని ఆకాశానికెత్తి నిలువెత్తున నిలబెట్టడానికి, మరికొంతమందిని అగాధాల్లోకి తోసి వ్యక్తిత్వహననానికి

ఏ విధంగా బాటలు పరచిందీ ఆయన తన రచన 'తొలి మహామంత్రిణి నాయకురాలు నాగమ్మ'లో సోదాహరణంగా వివరించారు. అనుగురాజు మరణం, అన్నదమ్ముల మధ్య రాజ్య విభాగాలు, కోడి పందాలు, అలరాజు హత్య, చాపకూడు, బ్రహ్మనాయుని ఒరుగు – ఇలా పలు ఉదంతాల్లోని చీకటి కోణాల్ని వెలుగులోకి తెచ్చారు. దేశీయ, విదేశీయ చరిత్రకారులతోపాటు, శాసనాలు, సాహిత్యం, జానపద గాథలు వంటి వాటినుంచి సమాచారాన్ని విస్తృతంగా సేకరించారు. నిష్పాక్షికంగా విశ్లేషించారు. 'దాచేస్తే దాగని సత్యాలివీ' అంటూ – తాను నమ్ముతున్న విశ్వాసాల్ని నిర్మొహమాటంగా ఆవిష్కరించారు. సమాజంలో బలంగా నాటుకుపోయిన నమ్మకాలను (ముఖ్యంగా బ్రహ్మనాయుడు, నాగమ్మ వంటి చారిత్రిక వ్యక్తుల విషయంలో) ప్రశ్నించడమంటే ఏటికి ఎదురీదడమే. ఆ సాహసానికి పూనుకున్న మిత్రులు మోహన్‌రావుగారు అభినందనీయులు. నాయకురాలి గుణగణాలను నిర్మమకారంగా, నిష్పాక్షికంగా పునర్మూల్యాంకనంచేసి, చారిత్రిక కోణంలో ఆమె వ్యక్తిత్వాన్ని, ధీరత్వాన్ని, రాజనీతి చాతుర్యాన్ని అర్థం చేసుకోవడానికి ఉపకరించే ఈ పుస్తకం అవశ్యపఠనీయం.

# ఒక మలుపు - పెను ఘర్షణ

ఏదైనా ఒక విషయాన్ని విశ్లేషించుకునే సందర్భంలో కులము, మతము, ప్రాంతము, వర్గము, వర్ణము,నమ్మకము,విశ్వాసము, భావసారూప్యత, సిద్ధాంతము ఇత్యాది విషయాలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తాయి. వీటికి అతీతంగా ఆలోచించినపుడే సత్యావిష్కరణ జరుగుతుంది. సత్యాన్వేషణతో, ప్రమాణాల ఆధారంగా శీలవంతమైన నాయకురాలి గాథను వెలుగులోకి తీసుకురాదలిచి చేసిన ప్రయత్న ఫలితమే ఇది. పల్నాడు చరిత్ర పరిరక్షణ, అభివృద్ధి కమిటీ ఏర్పడిన అనంతరం గౌరవాధ్యక్షులు అప్పటి గురజాల యమ్.యల్.ఎ జంగా కృష్ణమూర్తిగారి సారథ్యంలో కీ.శే.కన్నెగంటి రాజమల్లయాచారి సంపాదకత్వాన సావనీరు వెలువరించారు. సావనీరు కమిటీలో నేనూ సభ్యునిగా ఉన్నాను.ఈ సావనీరుకి నన్ను నాయకురాలి నాగమ్మ గురించి వ్యాసం వ్రాయమని కోరారు. కమిటీ నేతృత్వంలో నాయకురాలి విగ్రహం కూడా ఆవిష్కరించడానికి నిర్ణయమైంది. ప్రచారంలో ఉన్న గాథ ప్రకారం నాయకురాలు దుష్టచింతన గల మహిళ గదా? ప్రతినాయకురాలు కదా? కుట్రలకు ప్రతీక కదా? మరి నాయకురాలి విగ్రహం ఎందుకు ఆవిష్కరిస్తున్నట్లు? విగ్రహావిష్కరణ ఎవరికి చేస్తారు? సమాజానికి మార్గదర్శకులైన వారికే కదా విగ్రహాలను ఆవిష్కరించేది? ప్రజలకు మేలు చేసిన వారినే కదా గౌరవించేది? విగ్రహావిష్కరణ జరుగుతున్న వారి గురించి నాలుగు మంచి విషయాలు ప్రజలకు తెలియజేయాలి కదా? ఈ కోణంలో ఆలోచించినపుడు మంచి, చెడులు రెండూ లేకుండా ఎవరుంటారు? అని భావిస్తూ నాయకురాలి ప్రతిభా విశేషాల పార్శ్వాన్ని పరిశీలిస్తూ వెళ్ళాను.

ఈ సందర్భమే నాయకురాలి వ్యక్తిత్వాన్ని లోతుగా పరిశీలించడానికి నాకు దారి చూపింది. నాయకురాలిని గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించిన కొద్దీ ఆమెలో అనంతమైన వెలుతురుకోణం విస్తృతంగా కనిపిస్తూవచ్చింది. ఆమె జీవన గమనమంతా అనన్యసామాన్యమైన మేధోసంపత్తి, అపారమైన ఆలోచనా సరళి వెల్లువెత్తాయి. ఆమె మధ్యయుగాల మహిళాధిక్కార స్వరమనిపించింది. మహిళాసాధికారతకు శ్రీకారం చుట్టినట్టు ధ్రువీకరించుకున్నాను. మహిళా రాజకీయాలు ఆమెతోనే ప్రారంభమైనట్లు భావించాను. ఆమె తొలి మహిళా మంత్రిణి అని రూఢీగా చెప్పవచ్చు. ఇప్పటి వరకూ బ్రహ్మనాయుడిని అభిమానించేవారంతా ఆమెను చీకటి తెరలమాటుకు నెట్టి వేసినట్లుగా అనిపించింది. దుష్ప్రచార సంకెళ్ళతో ఆమెను బందీని చేసినట్లు ధ్రువపడింది. సావనీర్ కోసం వ్రాసిన వ్యాసంలో నాయకురాలి వెలుతురు కోణాన్ని కొంతమేరకు ఆవిష్కరించిన తదుపరి ఆమె వ్యక్తిత్వం గురించి తెలుసుకోవడానికై మరింత అధ్యయనం చేశాను.

బహుశా రెండు సంవత్సరాలుగా కృషి చేశాను. పుస్తకాల ద్వారా,పల్నాటి చరిత్ర పరిశోధన చేసిన వ్యక్తుల ద్వారా అనేక విషయాలు సేకరించి ఈ నా రచనను తీసుకువస్తున్నాను. నా విచారణలో నాయకురాలికి అనుకూలమైన ఎన్నో అంశాలు పాతి పెట్టారని, ఆమెను ధూర్తగా మలిచారని, ఆమెలో అపురూపమైన సద్గుణాలు, సచ్ఛీలతలు ఉన్నాయని తేలింది.

ముఖ్యంగా ఆమెపై ఐదు అభియోగాలు ప్రచారంలో ఉన్నాయి. (i) పల్నాడు చీలికకు ఆమె కారణమని (ii) కోడిపోరులో మోస ప్రవృత్తితో మాచర్ల రాజ్యాన్ని గెలుపొందిందని (iii) రాయబారిగా వచ్చిన అలరాజును హతమార్చిందని (iv) పల్నాటి యుద్ధం ఆమె వల్లే జరిగిందని (v) యుద్ధంలో ఆమె పరాజిత అని ప్రజల్లో ఉన్న గాధ. అయితే ఈ అభియోగాలన్నీ అసత్యాలని నా ఈ రచనలో ప్రామాణికంగా నిరూపించాను.

పల్నాటి చారిత్రక గాథను ఈ కోణంలో తీసుకువస్తున్నానని కొందరు మిత్రులతో తెలిపినపుడు ఒకరైతే తీవ్రంగా వ్యతిరేకించారు. కొందరు ప్రశ్నార్థకంగా చూశారు. మరికొందరు మధ్యస్థంగా మాట్లాడారు. ఎక్కువ మంది ప్రోత్సాహించారు. పుస్తకం చదివి స్పందించాల్సిందేనని ఇంకొందరు వ్యాఖ్యానించారు. ప్రచారంలో ఉన్న గాథకు భిన్నంగా తీసుకువస్తున్న ఈ వరవడి సాహసమని అన్నవారూ లేకపోలేదు.ఎవరు ఏమి చెప్పినా పుస్తకాన్ని పాఠకుల ముందుకు, ప్రజలముందుకు తీసుకురావాలనే నిర్ణయం మాత్రం బలపడుతూ వచ్చింది.

డి.టి.పి కాపీని ముందుగా చదివిన మిత్రులు ఆ సాంతం ఆసక్తి దాయకంగా, ప్రమాణ సహితంగా ఉందన్నారు. మిత్రులు జానపాటి నటరాజు ప్రోత్సహించారు. కవి మిత్రులు యన్.వి.రత్న శర్మ సలహాలిచ్చారు. డా.కె.వి. సుబ్బారావు, లోక్‌సత్తా నాయకులు శ్రీ.యస్.ఎ.గఫూర్, నా పెద్ద కుమార్తె చి॥ రుక్మిణి, శ్రీ కొణతం నాగేశ్వరరావు గారు, శ్రీ యస్.యమ్. సుభాని అక్షర దోషాలను తొలగించడానికి సహకరించడమేగాక అనేక అంశాలపై నాతో చర్చించారు. సంశయాలను నివృత్తి చేసే క్రమంలో అదనంగా మరో నాలుగు భాగాలను జత చేశాను. ఇందువలన పాఠకునికి సౌలభ్యం చేకూరుతుంది. మాజీ యమ్.యల్.ఎ. శ్రీ.కాయితి వెంకట నర్సి రెడ్డి, పిల్లుట్ల మాజీ సర్పంచి శ్రీ.జి.వి.జి.కె రెడ్డి, కరాలపాడు మాజీ సర్పంచి శ్రీ బుర్రి వెంగళరెడ్డి, ఆంధ్రజ్యోతి విలేఖరి శ్రీ యస్.పరమేశ్వర రావు, శ్రీ కంకర నరసింహారెడ్డి, శ్రీ మలిపెద్ది సత్యనారాయణ, శ్రీ దాదినబోయిన ఏడుకొండలు డి.టి.పి కాపీని చదివి వెన్ను తట్టారు. ప్రామాణికాలను జత చేయించి సోదరి 'దేవి' గారు రచనకు మరింత బలాన్ని

చేకూర్చారు. వ్యతిరేకించిన వారితో సహా పుస్తకంపై తమతమ అభిప్రాయాలను, సలహాలను, సహకారాన్ని అందించిన వారందరికీ కృతజ్ఞతలు. శ్రీ గుదె శివ, శ్రీ సజ్జల చంద్రయ్య, శ్రీ అలవాల కేశవరెడ్డి, శ్రీ జి.వి. సుబ్బయ్య, శ్రీ ఉగ్గు నాగేశ్వరరావు, శ్రీ ఘంటసాల హనుమకృష్ణారావు గార్లకు ధన్యవాదములు.

రచనకు కంఠాభరణాలుగా మారిన అమూల్య అభిప్రాయాలను వ్రాసి యిచ్చిన సోదరి దేవి, శ్రీ రావూరి ప్రసాద్ గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు.

నా ఈ పుస్తకం చదవడం ప్రారంభించే ముందు మీకు ఈ పాటికే తెలిసి వున్న పల్నాటి చరిత్రను దయచేసి పక్కన పెట్టండి. ఈ ప్రామాణిక గాథపై ఇప్పటికే ప్రచారంలో ఉన్న మీరెరిగిన గాథాప్రభావం పడకుండా చూసుకోండి. అప్పుడే నాయకురాలి సచ్ఛీలతను, ధర్మాధర్మ విచక్షణను, సత్పాలనను, సదాచారాన్ని అర్థం చేసుకోగలరు, అవగాహన చేసుకోగలరు.

**పాఠకులకు కలిగే సంశయాలన్నింటినీ నివృత్తి చేసేందుకు చివరిపేజీలలో శ్రీనాథుని మొదలుకొని వివిధ రచయితల రచనలలోని అంశాలను ప్రామాణికాలుగా పొందుపరిచాను.**

✸ అనిర్వచనీయ సద్గుణాలు,మహోన్నత వ్యక్తిత్వం, అగణిత పాలనాదక్షత కలిగి మహిళా మార్గదర్శి అయిన నాయకురాలు నాగమ్మను నిరంతరం స్మరించుకోవాలి. నాయకురాలిపై అలముకున్న దుష్ప్రచారాన్ని ధ్వంసం చేసి ఆమెను సరిగా ప్రజల ముందుకు తీసుకెళ్ళాలి.ఇందుకోసం నాయకురాలిపై గౌరవం కలిగి,భావసారూప్యత ఉన్నవారంతా ఒక ప్రణాలిక రూపొందించుకుని ఆమె పూజలు జరుపుకొన్న జిట్టగామాలపాడు గ్రామంలోని శివాలయాన్ని జీర్ణోద్ధరణ చేయాలి. ఆ దేవాలయం వద్ద ప్రతియేట ఉత్సవం జరపాల్సిన అవసరం ఉంది. నాయకురాలి జనన తేది, ఆమె మంత్రి పదవి స్వీకరించిన సమయం, యుద్ధంలో విజయం పొందిన కాలం ఇత్యాదులను చరిత్రకారులెవరు ఇదమిద్దంగా నిర్ధారించలేక పోయారు. **ఈ నేపథ్యంలో ఆమె కోడిపోరులో గెలుపొందిన ఆషాఢశుద్ధ తొలి ఏకాదశినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహించుకోవటం సముచితంగా ఉంటుంది. ఈ విధంగా ఉత్సవాలను ప్రతియేట నిర్వహించుకోవటం ద్వారా నాయకురాల్ని గుర్తు చేసుకొన్నవారమవుతాము**

– ఇక లోపలికి వెళ్ళండి

**రచయిత**


## "ముద్రణకు - ఆవిష్కరణకు సహకరించిన అమృత హృదయాలు"



శ్రీ జంగా కృష్ణమూర్తి, Ex,M.L.A.



శ్రీ M.V. చౌదరి



శ్రీ దేవరపల్లి కోటేశ్వరరావు



శ్రీ వల్లభనేని రాంబాబు



శ్రీ కట్టా వెంకటేశ్వరరెడ్డి




శ్రీ నంద్యాల ధనుంజయరెడ్డి



శ్రీ నందిపాటి నర్సిరెడ్డి



శ్రీ చింతారెడ్డి వెంకటరెడ్డి



శ్రీ బాదం బాలిరెడ్డి



శ్రీ సూదా బాలకోటేశ్వరరావు



శ్రీ యక్కల భాస్కరరావు



శ్రీ వై. యన్. ఆర్. (కోల్)

## "ముద్రణకు - ఆవిష్కరణకు సహకరించిన అమృత హృదయాలు"



శ్రీ కొత్త రాధాకృష్ణమూర్తి

శ్రీ కె. శ్రీనివాసరావు
శ్రీ పి. ఉపేంద్ర
శ్రీ కె. పాపారావు

సాయికృష్ణ మినరల్స్



శ్రీ జి.వి.యన్. మునేశ్వరరావు



శ్రీ వూటుకూరి కృష్ణమూర్తి



శ్రీ కొలిశెట్టి ఈశ్వరరావు



శ్రీ మలిపెద్ది సత్యన్నారాయణ



శ్రీ పసుమర్తి సుబ్రహ్మణ్యం



శ్రీ జూలకంటి సుబ్రహ్మణ్యం



శ్రీ నాళం సత్యన్నారాయణ



శ్రీ నాళం శ్రీనివాసరావు



**స్వర్గీయ గుండా వెంకట**
**సాయి కృష్ణ కిషోర్**
స్మృతిలో
శ్రీ గుండా శ్రీనివాసరావు

# విషయ సూచిక


పల్నాటి వీర గాధా చరిత్ర – కవులు 1

పల్నాటి చరిత్ర – వాస్తవ దృక్పథం 2

వెలుగు చూడని అంశాలెన్నో....! 3

పల్నాటి సామాజిక ముఖచిత్రం 5

వీర గాథలకు నిలయం పల్నాడు...! 6

సామాన్య వనిత .. అసమాన ప్రతిభ..! 7

నాయకురాలి తండ్రి రామిరెడ్డిని బలి తీసుకున్న బ్రహ్మనాయుడు 9

అనుగురాజుని, దొడ్డ నాయుని హతమార్చిన బ్రహ్మనాయుడు 9

అనుగురాజు హత్యపై అల్లిన 'అవతార' గాథ 10

బ్రహ్మన్నకు లేక లేక కలిగిన ఏకైక సంతానం బాలచంద్రుడు 11

సమర్ధతకు ప్రతిరూపం నాగమ్మ 12

పల్నాడును ముక్కలు చేసిన బ్రహ్మన్న స్వార్థ చింతన 14

ప్రచార శాఖను ఏర్పాటు చేసుకున్న బ్రహ్మన్న 15

పల్నాటి చరిత్రలో శైవ – వైష్ణవుల వైరుధ్యాలు 16

సిరాదేవితో పెదమలి దేవుని వివాహం 17

పేరిందేవితో (పేరమ్మ) అలరాజు వివాహం 18

దూబచెరువు తవ్వకాన్ని నిలిపివేసేందుకు "నాయుడి"కుట్ర 18

అలరాజు బాదరాజుల (పెదబ్రహ్మనాయుడు) యుద్ధం 19

రాజ్యాన్ని కబళించే దురాలోచనతోనే కోడిపోరు వ్యూహం 20

కోడిపోరు పరాజయానికి బ్రహ్మన్న అనాలోచిత నియంత పోకడే కారణం. 22

నాలుగేండ్లు పల్నాటి భూముల్లోని మందాది అడవుల్లోనే వనవాసం 23

మంద పోరులో ఒంటరిని చేసి పల్నీడును మట్టు పెట్టిన కన్నమ దండుబలం 24

అనుగురాజును హతమార్చిన విషయాన్ని బ్రహ్మన్నతో ప్రస్తావించిన పెదమలిదేవుడు 25

రాయబారిగా క్షత్రియుడు అలరాజు – కీడు శంకించిన కొమ్మరాజు 26

అలరాజుపై బ్రహ్మనాయుడి ద్వేషాన్ని నిరూపణ చేసే "పిచ్చిగుంటల" వారి పాట 27

కలిసిబయలుదేరిన 'కన్నమ' ఏమయ్యాడు?

'అల'హత్యాప్రణాళిక అమలుకే మార్గం తప్పించాడా? 28

తులసి మాలను తప్పించిన బాలచంద్రుడు 29

ఫలించని అలరాజు రాయబారం – వాదోపవాదాలు 30

అలరాజు మృతి – ఇరు దేశాల భిన్న విశ్వాసాలు 31

అచంచలం, అనూహ్యం నాయకురాలి మనోధైర్యం 32

నాయకురాలి చొరవతో పొసగిన సంధి – రెండు నిబంధనలకు అంగీకారం 33

వైశ్యకుల వనిత 'అన్నమ్మ' దూషణలతో కర్తవ్యాన్ని తెలుసుకున్న బాలచంద్రుడు 34

సంధిని విచ్ఛిన్నం చేసిన బాలచంద్రుని దుడుకు చేష్టలు 36

ధర్మం నాయకురాలి వైపే ఉందన్న బ్రహ్మన్న అనుచరులు"గోసంగులు" 37

ఆచంద్రతారార్కం నాయకురాలి దౌత్య సంబంధాలు 38

వ్యూహ ప్రతి వ్యూహాల్లో మేటి నాయకురాలు నాగమ్మ 38

వంశ నాశనానికి దారితీసిన నాయుడి యుద్ధోన్మాదం 39

విజయం నాయకురాలిదే! 40

'నాయకురాలి' చేతిలో 'నాయుడు' పరాజితుడా? 42

పదవిపట్ల నిర్వ్యామోహమే! 43

నలగాముడే నష్టజాతకుడు 44

"చాపకూడు" లో సత్యమెంత....? 44

# పల్నాటి వీర గాధా చరిత్ర - కవులు

సుమారు వెయ్యేళ్ళ క్రితంనాటి చారిత్రిక దర్పణం. 11 వ శతాబ్దికి చెందిన పల్నాటి వీరగాథ. పల్నాట చారిత్రిక ప్రాధాన్యత సంతరించుకున్న రాజ్యం అంతరించిన తరువాత 300 ఏళ్ళ పాటు జనవాడుకలో సాగిన యథార్థగాథ. ప్రజలు పాడుకున్న గీత మాలిక. మౌఖికంగా మూడు దశాబ్దాలు సాగిన తరువాత 15వ శతాబ్దిలో మొట్ట మొదట పలనాటి వీరచరిత్ర పేరిట కావ్యంగా వెలుగు చూసింది. శ్రీనాథ కవి సార్వభౌముడు ద్విపద ప్రక్రియలో ఈ వీర గాథను కావ్యీకరించాడు. పల్నాటి ప్రాంతమంతా పర్యటిస్తూ జన బాహుళ్యంలో వినపడుతున్న గాథను ఆలకించి, పాడించుకొని, చెప్పించుకొని, ఆయనకు అందిన సమాచారం మేరకు రూపాన్నిచ్చారు. పల్నాటి వీర చరిత్రను మరో మహా భారతమని కూడా చెప్పుకుంటారు. మహాభారతంలోని అనేక పాత్రలు పల్నాటి వీర చరిత్రలోని పాత్రలను పోలివుంటాయి. అందుకే ఈ గాథకు సారూప్య నామం వచ్చింది. శ్రీనాథుని నుండి ఇప్పటి వరకు ప్రాచీన కవులు,ఆధునిక కవులు, నవలాకారుల వరకు అనేక మంది ఈ చారిత్రక గాథను తమ తమ పరిధిలో అనేక విధాలుగా ఆవిష్కరించారు. ప్రతివారు మూల కథ ఆధారం చేసుకుని కొన్ని పాత సంగతులతో పాటు మరికొన్ని కొత్త విషయాలను చెప్పటానికి, స్పష్టతలేని సంఘటనలను పరిష్కరించటానికి కృషి చేసారు. వీటిలో కొన్ని పద్యకావ్యాలైతే,మరి కొన్ని గద్యాలు. అయితే ఎందరు ఎన్ని పర్యాయాలు ఆవిష్కరించినా ఈ పల్నాటి వీర గాథ చారిత్రిక దర్పణం కొంత మసకబారిందని చెప్పక తప్పదు. ఎందుకంటే చరిత్రను బయటకుతీసి గ్రంథస్థం చేసిన వారిలో ఎక్కువ మంది కవులు , రచయితలు, నవలాకారులు రచన ప్రారంభానికి ముందే బ్రహ్మనాయుని దృష్టితో ఆలోచించి రచనలు సాగించారు.ప్రారంభానికి ముందే బ్రహ్మన్న పక్షానికి ఒరిగి పోయినట్లు రూఢి అవుతుంది. బ్రహ్మనాయుని అవతార పురుషునిగా భావించారు. దాంతో ఆయన ఆలోచనలు, ఆచరణలన్నీ దైవాంశాలుగా మనసులో ఊహించుకుని గాథను రచించారు. అదే క్రమంలో నాయకురాలి పక్షంవహించిన వారూ లేకపోలేదు. అయితే వారి సంఖ్య వేళ్ళపై లెక్కించ దగిందే. నాయకురాలి పక్షాన రాసిన రచయితలు గాలివాటుగా, తోచిన విధంగా, మంత్రాలు మహాత్మ్యాలను జోడించి రచనలు

సాగించడానికి ప్రయత్నించ లేదు. ఆమెపై మోపిన ఆధార రహిత నిందలను తొలగించే కృషి మాత్రమే చేశారు. ఆమె పై ప్రచారంలో ఉన్న అపవాదులను రూపుమాపేందుకు సహేతుక ప్రయత్నం చేశారు. **దీనికి సామాజిక ఆధారాలు,సాక్ష్యాలు తప్పుని సరి చేసుకున్నారు. జానపదుల సాహిత్యం లోకి చేరిన ఏ యదార్థ గాథ అయినా ఇతిహాసంగా రూపాంతరం చెందుతుంది.రకరకాల కవుల రచనల్లో రకరకాల కథనాలుగా వెలికి వచ్చిన ఈ కథ ఆంధ్రదేశంలోని అద్భుత వీరగాథల్లో** (Ballads) **ఒకటి. ఎన్ని పర్యాయాలు ఆవిష్కరించినా స్పష్టతరాలేదు.** ఎందుకంటే అప్పటికే జనావళిలో ప్రాచుర్యం పొందిన కథాంశాన్ని సరిచేయాలంటే దానికి ప్రామాణికమైన ఆధారాలు, సాక్ష్యాలు అవసరం. ఆ క్రమంలో నాయకురాలి ఘనతను, బ్రహ్మనాయుని కుటిలత్వాన్ని కొంతమేర వెలికి తెచ్చారు. బ్రహ్మనాయుని పక్షాన వ్రాసిన రచయితలంత స్వేచ్ఛగా నాయకురాలి పక్షాన వ్రాయలేకపోవటానికి ఇదే కారణం. ఏది ఏమైనా నాయకురాలిపై జరిగిన, జరుగుతున్న దుష్ప్రచారప్రభంజనానికి ఎదురు నిలిచి రచనలు సాగించిన కవులది, రచయితలది ఒక సాహసమే.

## పల్నాటి చరిత్ర - వాస్తవ దృక్పథం

కత్తులు దూసుకు వచ్చినా, కుత్తుకలుత్తరించినా చెదరని స్వాభిమానం. చెరగని స్వామిభక్తి పల్నాటి వారిది. ప్రాణం కన్నా నాయకుల ఆదేశాలపట్ల ఆచరణే ముఖ్యం. భయంకరమైన బెబ్బులి, క్రూరమైన మొసలి మీదకు అమాంతం దూకి వాటిని సంహరించగల అచంచలమైన ధైర్యం, అనిర్వచనీయమైన దేహదారుఢ్యం వారి నైజం. పల్నాటి చరిత్ర వీర గాథలో అక్కడి ప్రజల నైతిక స్వభావం ఈ విధంగా కనిపిస్తుంది. అన్నీ తామై రాజ్యపాలన నడిపిన మంత్రుల మేధస్సు వారి ఘనతను చాటుతుంది. రాజుకంటే మంత్రుల మాటకే అత్యంత ప్రాధాన్యం. ఇది స్థూలంగా పల్నాటి రాజ్య స్వభావం. శత్రు రాజ్యం నుండి తన రాజ్యాన్ని రక్షించుకునే క్రమంలో రూపొందించే వ్యూహాలు, ఎత్తుగడలు శత్రురాజ్యానికి దేశద్రోహ కార్యక్రమాలుగా, స్వదేశవాసులకు దేశభక్తి చిహ్నాలుగా కనిపిస్తాయి. ఇది సహజం. నాయకురాలు నాగమ్మ విషయంలో కూడా బ్రహ్మనాయుడి వర్గ నిందా ప్రచారం ఇలాంటిదే. బ్రహ్మనాయుడు ఉత్తముడు, నాయకురాలే కుట్రదారు అనే అభిప్రాయాన్ని మనస్సుల్లో పాషాణ సదృశంగా మార్చుకున్న వారికి నా ఈ కోణం అంతగా రుచించక పోవచ్చు. అసలు నాయకురాలు రావడమే నేరం. ఆమె మంత్రిగావడమే అనర్థాలన్నింటికీ హేతువు అని నమ్మే వారికి ఈ సానుకూల దృక్పథం మింగుడు పడక పోవచ్చు. అయితే ధర్మాధర్మాల విచక్షణ,

హక్కుల తీరు,మధ్యే మార్గ దృష్టి, స్త్రీలపట్ల సానుకూల దృక్పథంతో చదువుకుంటూపోతే నా ఈ సమవాదనను అర్థం చేసుకుంటారు. నా అభిప్రాయంతో మమేకమౌతారు. బలవంతునిదే పాలన, రాజ్యమన్న నానుడి ఇప్పటిదికాదు. అనాదిగా వస్తూనే ఉంది. ఇది శతాబ్దాల తరబడి అమలవుతుందనడానికి పల్నాటి గాధలోని బ్రహ్మ నాయుని పాత్ర కూడా సాక్షిగా నిలుచుంటుంది. ఇప్పుడు కూడా ఈ సూత్రం అమలవుతుంది. బలవంతుల పన్నాగాలు, కుయుక్తులు అప్రతిహతంగా నడుస్తూనే ఉన్నాయి. తాను చెప్పిందే వేదం, తాను చేసిందే ధర్మంఅని ఇష్టమున్నా, లేకపోయినా అందరిచేత ఒప్పించడం ఒక్క బలవంతునకే సాధ్యమౌతుంది. పల్నాడు చరిత్రలో కూడా ఈ విషయం స్పష్టంగా ద్యోతకమౌతుంది. పల్నాటి వీరుల చరిత్రకు సంబంధించి వెలువడిన అనేక పుస్తకాలను చదివి ఆకళింపు చేసుకుని ప్రామాణికంగా విశ్లేషంచుకొని, పరిష్కరించుకున్న అంశాలే ఈ సంపుటిలోకి చేరాయి. ఆకాలంలో ప్రత్యర్థులపై అసత్య ప్రచారాలు చేయడం ఆనవాయితీగా కనిపిస్తుంది. పల్నాటి చరిత్రకు సంబంధించి నాయకురాలు నాగమ్మపై వచ్చిన ఆరోపణలకు సాక్ష్యాలు, రుజువులు చూపకుండానే ఆమెను ముద్దాయిని చేశారు. ఏ విధమైన విచారణ జరపకుండా ఆమెపై నేరాలను ధ్రువీకరించారు. అయితే ఇదంతా ఒక వర్గం వారి వాదన, మరియు ప్రచారం. నాయకురాలి వైరి వర్గం బ్రహ్మన్న, ఆయన అనుయాయులు పథకం ప్రకారం సాగించిన అభూత కల్పనలే ఈ ఆరోపణలు. నాయకురాలిపై మోపిన నిందలను ఆమె మంత్రిణిగా ఉన్న గురజాల రాజ్య ప్రజలు గాని, రాజు నలగామరాజు గాని విశ్వసించకపోవడంవల్లే చివరి వరకూ ఆమె మంత్రిణిగా కొనసాగింది. ఆమెపై వచ్చిన అభియోగాలను పాలక వర్గాలతోసహా ఆ దేశస్థులంతా తిప్పికొట్టడం వల్లనే ఆమె స్థానం కడవరకు పదిలంగా ఉంది. ఆమె ప్రజాభిమానం చెక్కుచెదరకుండా నిలిచిపోయింది. ప్రభువు నలగామరాజుకు, ఆయన సోదరుడు నరసింగరాజుకు ఆమె మాటపై విశ్వాసం ఏమాత్రం సడల లేదు.

## వెలుగు చూడని అంశాలెన్నో....!

పలనాటి యుద్ధానంతరం యుద్ధభూమి కార్యమపూడి (కారంపూడి) లో బ్రహ్మానాయుడి వర్గ పక్షాన ఒక పీఠమేర్పడింది. పీఠాన్ని బ్రహ్మానాయుడే వ్యవస్థీకరించాడా? లేక ఆయన అనుయాయులు స్థాపించారా? అనే విషయాన్ని పక్కన ఉంచితే పీఠం ఆనాటి నుండి ఈ నాటి వరకు కొనసాగుతూనే ఉంది. ఎంతో కాలం

నుండి పీఠం నిర్వహణకు మాన్యాలున్నాయి. మాన్యాలపై వచ్చే ఫల సాయంతో పీఠం నిర్విఘ్నంగా నడుస్తుంది. పీఠం ఆధ్వర్యంలోనే శతాబ్దాలుగా కార్యమపూడి (పలనాటి యుద్ధ భూమి) లో కొణతముల (ఆయుధాలు) ఉత్సవాలు జరుగుచున్నాయి. ఉత్సవాల ముఖ్య ఉద్దేశ్యం బ్రహ్మన్న,ఆయన వర్గీయుల ఘనతను స్మరించుకోవడమనే విషయం బహిరంగమే. ఈ ఉత్సవాల్లో వీరవిద్యావంతులు పలనాటి చరిత్రను బ్రహ్మనాయుడి వర్గ పక్షంగా గానం చేస్తారు. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో ఆనాటి చారిత్రిక సంఘటనలను వివిధ ఘట్టాలుగా వినిపిస్తారు. ఏ ఘట్టాన్ని వినిపించినా, ఏ గానం చేసినా బ్రహ్మనాయుని వ్యక్తిత్వం, ఆయన వర్గీయుల గొప్పతనం ఇనుమడింపచేసే విధంగా, నాయకురాలిని, ఆమె వర్గీయులను కురచ పరిచే విధంగా ఉంటాయి. చారిత్రికసత్యాలైనా బ్రహ్మన్న కీర్తికి మచ్చ తేచ్చే ఘటనలు వినపడవు. ఆయన, ఆయన వర్గీయుల వ్యక్తిత్వాలను పలుచపరిచే వాస్తవాలను వెల్లడించరు. పలనాటి చరిత్రలో బ్రహ్మనాయుడి హీనత్వాన్ని వెల్లడిచేసే అనేక సంఘటనలున్నాయి. ఉదాహరణకు యుద్ధరంగానికి ఇరు సైన్యాలు చేరిన తర్వాత నాయకురాలి చొరవతో సంధి కుదిరిన విషయంగానీ, బాలచంద్రుని దురుసు ప్రవర్తనతో సంధి విచ్ఛిన్నమైందని గానీ వెల్లడించరు. ఈ నేపథ్యంలో సమాంతరంగా నాయకురాలు నాగమ్మ వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ ప్రచారం చేయటానికి, నాయుడి కుట్రలను బయల్పరచటానికి ఆమె కంటూ సంస్థలు గానీ, పీఠాలుగానీ ఏర్పడలేదు. దాదాపు తొమ్మిది వందల సంవత్సరాలుగా బ్రహ్మనాయుడి వర్గీయుల ప్రచార గాథలే ప్రజల చెవి సోకుతున్నాయి. ఆ కథలనే పలనాటి చారిత్రిక వాస్తవాలని ప్రజలు నమ్ముతూ వస్తున్నారు. నాయకురాలిపై బ్రహ్మనాయుడి వర్గీయులు సాగించిన దుష్ప్రచారం ప్రజల దృష్టిలో ఆమెను ప్రతినాయకురాలిగా నిలబెట్టింది. చలనచిత్రాలు సైతం ప్రజల్లో వున్న ప్రచార గాథకు అనుగుణంగానే రూపుదిద్దుకున్నాయి. కాస్త కటువుగా చెప్పాలంటే నాయకురాలిని (ఉద్దేశ్యపూర్వకంగా) మరింత దిగజార్చాయంటే అతిశయోక్తి కాదు. కనీస పరిశీలన కొరవడిన సినిమాల రూపకర్తలు నాయకురాలిపై శక్తి మేరకు విషం చిమ్మారు. సినిమా మాధ్యమం ప్రజల్లో ఆమెపై తరగని దుష్ప్రచారానికి తావిచ్చింది. ఈ విధంగా బ్రహ్మనాయుడి వర్గీయుల ప్రతి కూల ప్రచారం యధేచ్ఛగా సాగింది, సాగుతూనే ఉంది. పర్యవసానంగా అనేక సత్యాలు ప్రజల దరి చేరకుండానే కనుమరుగయ్యాయి.

# పల్నాటి సామాజిక ముఖచిత్రం

11 వ శతాబ్ది ఉత్తర కాలంలో కొనసాగిందని నిర్ధారణ అవుతున్న పల్నాటి రాజ్య సామాజిక అంశాలను,భౌగోళిక విషయాలను విశ్లేషించుకున్నపుడు ఒక్క రాజకీయ రంగంలో మినహా దాదాపుగా అన్ని రంగాల్లో వెనుక బాటు తనమే కనిపిస్తుంది. సాగునీరు, విద్యాభివృద్ధి కోసం ఆయా రాజ్యాల పాలకులు చేసిన యత్నం శూన్యమని చెప్పవచ్చు. కేవలం తాగు నీటి కోసం మాత్రం గురజాల (క్రింది పల్నాడు) వారి పాలనలో నాయకురాలి చొరవతో గురజాలలో దూబచెరువు నిర్మిస్తే , మాచర్ల వారి ఏలుబడిలో ఉన్న తేరాలలో మహా చెరువు మరమ్మత్తులకు నోచుకుంది. దైవభక్తి, రాజభక్తి మెండు. ఇందుకు సంబందించి దేవాలయాల నిర్మాణాలు సాక్ష్యంగా నిలుస్తాయి. అంధవిశ్వాసాలు, మహాత్మ్యాలు, మాయలు, మంత్రాలు, అభూతకల్పనలపై ప్రజలలో కడువిశ్వాసం. వ్యవసాయం, పశుసంపద ముఖ్య జీవనాధారం. పండించిన పంటలో పాలకుల ఖజానాకు నాల్గోవంతు శిస్తుగా చెల్లించాలి. ఇది కాక ప్రభుత్వ భూముల్లో పశువులను మేపుకున్నందుకు పుల్లరి చెల్లించాలి. నేరం రుజువైతే శిక్షలు, జరిమానాలు ఉంటాయి. పంతాలు,పట్టింపులు, ఆవేశ కావేషాలు అధికం. జాతరలు, జంతుబలులు, క్షుద్ర విద్యలపై నమ్మకం అధికం. దేవాలయ నిర్వాహణకు మాన్యాలు,యినాములు ఇవ్వడం సర్వసాధారణం. బహు భార్యత్వం రాచరిక ఆచారమే కాని ఇతర కులాల్లో ఉన్నట్లు కనిపించదు. సతీసహగమనం ఐచ్ఛికంగా ఉంది. బ్రాహ్మణ వర్గానికి సమాజంలో ఉన్నతమైన స్థానం ఉండేది. రాజులు మంత్రులు కూడా ఆయా వర్గాలకు సమున్నత గౌరవం ఇచ్చేవారు. బ్రాహ్మణుల సలహా, సూచనలను అత్యున్నత పాలకులు సైతం పాటించే వారు. సజ్జ , జొన్న ముఖ్య పంటలుగా పండించే వారు. పూరిళ్ళు, మిద్దెలు నివాసాలుగా ఉండేవి. చింతచిగురు, బచ్చలిఆకు వంటి వాటిని కూరలకు వినియోగించేవారు. నివాసాలకు పరిసరాలలోనే పశువుల కొట్టాలు, పశువుల గ్రాసంకోసం గడ్డివాములు ఉంటాయి. చాలా లోగిళ్ళకు చుట్టూ కంచె ఉంటుంది. పల్నాటి రాజ్య పాలనలో మొత్తం 194 గ్రామాలుంటాయని చారిత్రిక పరిశోధకుల అభిప్రాయం (1). కుంటల నుండి, చెరువుల నుండి, వాగులనుండి తాగు నీటిని, ఇతర వినియోగ నీటిని తెచ్చుకుంటారు. పగ, ప్రతీకారం అధికం. కుట్రలు, కుతంత్రాలు చెప్పాల్సిన పనిలేదు. అదే క్రమంలో మాటకు కట్టుబడి ఉండటం ప్రజల నైజం. జొన్న సంకటి ముఖ్య ఆహారం. అడవులను నరికి భూమిని సాగులోకి తెచ్చుకొనేవారు. నల్లరేగడి నేలలే అధికంగా ఉండేవి. భూస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లింది.

# వీర గాథలకు నిలయం పల్నాడు...!

పల్నాటిరాజ్యానికి మూల పురుషుడు అనుగురాజు. తరతరాల వీర గాథలకు నిలయమైన పల్నాడును అనుగురాజు స్థాపించినట్లు శ్రీనాథ కావ్య ప్రమాణాలు రుజువు చేస్తున్నాయి(2). ఉత్తర హిందూ దేశంలోని పాలమాచాపురి (జబల్‌పురము / జంభనాపురము) (3) రాజధానిగా పాలిస్తున్న అనుగురాజు బ్రహ్మహత్యాపాతకం వలన ధరించిన వస్త్రాలన్నీ నీలిరంగుగా మారుతుంటాయి. ఇలవేల్పు చెన్నకేశవ స్వామిని ప్రార్థించగా తీర్థస్నానాలతో ఎప్పుడు వస్త్రాలు తెల్లబడునో అప్పుడు బ్రహ్మహత్యా పాతకం నుంచి విముక్తి పొందగలవని స్వామి స్వప్నంలో తెలిపారు. ఈ నేపథ్యంలో సోదరుడు బిరుదురాజుకు పట్టం కట్టి, పట్ట మహిషి వీరవిద్యలదేవితో చెన్నకేశవ పీఠాన్ని, మంత్రి దొడ్డ నాయుని, ఆయన కుమారులు పెదబ్రహ్మ నాయుడు, బ్రహ్మనాయుడు, సేనాని తెప్పలనీడు మరి కొంత సైన్యంతో సపరివారంగా తీర్థస్నానాలకు తరలివెళ్లారు. అనేక పుణ్య నదులలో తీర్థస్నానాలు చేస్తూ అనుగురాజు గయ క్షేత్రాన్ని సందర్శించినప్పుడు ఆ పట్టణ ప్రభువైన భీమరాజు తన పుత్రిక భూరమాదేవినిచ్చి వివాహం చేస్తాడు. ఆ క్రమంలో కృష్ణానది దాటి మోటుపల్లి వద్ద సముద్ర స్నానం చేసినప్పుడు ఆయన వస్త్రాలు తెల్లబడి బ్రహ్మహత్యాపాతకం నుంచి విముక్తి పొందుతాడు. తన కళంకాన్ని తొలగించిన మోటుపల్లి ప్రాంతమే తనకు ముక్తి క్షేత్రమని భావించి అక్కడే గుడారాలను వేసుకొని కొన్నేళ్ళపాటు కాలం గడుపుతాడు. ఈ నేపథ్యమే అనుగురాజు ఉత్తర హిందూ దేశం నుండి దక్షిణానికి వచ్చాడని తెలుపుతుంది.

ఈ సందర్భంలో పశువులు, గుర్రాలు, ఏనుగుల గ్రాసం కోసం సైనికులు, సేవకులు సమీపంలోని ఆరణగండ్లకు వెళ్లి బండ్లపై గ్రాసం తెస్తుండగా సేనాని తెప్పలనీడుకు దారిలో ఊరకోట వద్ద కనిపించిన తెల్లజొన్నచేను యజమాని అలవాల పాపిరెడ్డిని అడిగి కంకులను కొన్నింటిని తీసుకువెళ్లి అనుగురాజుకు చూపిస్తాడు. ఆ కంకులను చూసి అనుగురాజు ఆశ్చర్యంలో మునిగి పోతాడు. ముత్యాలవలే ఉన్న ఆ చేలోని మొత్తం జొన్న కంకులను కోసుకురమ్మని తెప్పలనీడుని ఆజ్ఞాపిస్తాడు. సైన్యసమేతంగా తెప్పలనీడు అడ్డు వచ్చిన పొలం యజనానిని తోసివేసి జొన్న కంకులన్నీ కోయించి బండ్లపై మోటుపల్లికి చేరుస్తాడు. ఈ సంఘటనతో క్షోభకు గురయిన పొలం యజమాని తన దేశం "ఊరకోట" పాలకుడైన పేరమారాజుకు (భీమరాజు) సదరు సంఘటనను ఫిర్యాదు చేస్తాడు. ఈ నేపథ్యంలో పేరమారాజు సకల సైన్యంతో తెప్పలనీడుతో సమరం చేస్తాడు. యుద్ధంలో తెప్పలనీడు పేరమారాజును సంహరిస్తాడు.

ఈ సంఘటన అనంతరం శరణు వేడిన పేరమరాజు పుత్రుడు ఉత్తరునికి అనుగురాజు ఆ రాజ్యాన్ని అప్పగిస్తాడు. ఈ విజయానంతరం భూమండలం లోని రాజులందరూ స్త్రీలతో సమానమని అనుగురాజు ఒక్కడే రాజనామార్థుడనే శాసనాన్ని తెప్పలనీడు ఊరకోటలో ప్రతిష్టిస్తాడు. శాసనం గురించి తెలుసుకున్న చందవోలు గొంకరాజు ఆగ్రహంతో ఆనుగురాజుపై యుద్ధం ప్రకటిస్తాడు. దొడ్డనాయుని కుమారుడు పేర్నీడు సైన్యంతో అనుగురాజు తరపున చందవోలురాజ్యాధిపతి గొంకరాజు పై దండెత్తుతాడు. ఈ యుద్ధంలో చందవోలు రాజు ఓటమి పాలవుతాడు. పేర్నీడు చందవోలు రాజును బంధిస్తాడు. చందవోలురాజు అనుగురాజుతో సంధిచేసుకుని తన కుమార్తె మైలమదేవినిచ్చి వివాహం చేస్తాడు.మైలమదేవికి తండ్రి తన రాజ్యంలోని కొంత భూభాగాన్ని అరణంగా (పసుపు,కుంకుమగా పుట్టింటి సంపద) ఇచ్చి కాపురానికి పంపుతాడు. మైలమ దేవికి పుట్టింటి ఆస్థిగా వచ్చినదే పల్నాడు. గురజాల రాజధానిగా అనుగురాజు పల్నాడు రాజ్యన్ని స్థాపించాడు. మైలమాదేవికి ఏక సంతానం నలగామ రాజు, వీరవిద్యల దేవికి పెదమలిదేవుడు,పినమలి దేవుడు, బాలమలిదేవులను ముగ్గురు, భూరమాదేవికి కామరాజు, నర్సింగరాజు,ఝుట్టిరాజు జన్మించారు(4).

## సామాన్య వనిత .. అసమాన ప్రతిభ..!

స్త్రీలు వంటింటికే పరిమితమైన కాలం. పాక్షిక సహగమనం పాటిస్తున్న తరుణం. పురుషాధిక్యత రాజ్యమేలుతున్న సందర్భం. ఇటువంటి సమయంలో సామాన్య మహిళైన నాగమ్మ నాయకురాలిగా ప్రసిద్ధి గాంచిన వైనం పల్నాడు గర్వించదగిన విషయం.(5). 11 వ శతాబ్దంలోని చారిత్రిక అంశాల ప్రకారం తొట్టతొలి మహిళా మంత్రిణిగా ఎదిగి ప్రపంచంలోనే పల్నాడుకు మాసిపోని గుర్తింపు తీసుకు వచ్చిన మేధోశిఖరం నాగమ్మ జీవన గమనాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. అందుబాటులో ఉన్న గ్రంథాల ఆధారంగా నాయకురాలు నాగమ్మ స్వస్థలం కరీంనగర్ జిల్లా, గుచ్చి మండలం, అరవెల్లి గ్రామం. తండ్రి చౌదరి రామిరెడ్డి. వ్యవసాయ నిమిత్తం పొలం వెళ్ళినపుడు రామిరెడ్డికి నాగమ్మ పొదలలో లభించిందని ఒక కథనం. ఈ సంగతి అప్రస్తుతమే. నాయకురాలి చిన్నతనంలోనే తల్లి పరమపదించింది. కరువు కాటకాలు, మశూచి వంటి భయంకర వ్యాధులు ఆ గ్రామాన్ని తరచూ చుట్టుముడుతున్న సందర్భంగా రామిరెడ్డి కుమార్తె నాగమ్మతో పల్నాడు లోని జిట్టగామాలపాడు గ్రామంలోని తన బావమరిది మేకపోతుల జగ్గారెడ్డి వద్దకు తరలి వస్తారు. ఈ క్రమంలో అక్కడే స్థలాలు, పొలాలు కొనుగోలు చేసి రామిరెడ్డి ఓ మోతుబరి రైతుగా స్థిరపడతాడు. ఈ సందర్భాన్ని

అంచనా వేసినపుడు రామిరెడ్డిది భూస్వామ్య కుటుంబమని చెప్పవచ్చు. సహజంగా దాతృత్వం పరిమళించే రామిరెడ్డి తనను ఆశ్రయించిన వారికి లేదనకుండా సహాయం చేస్తూ పేరు ప్రఖ్యాతులు పొందాడు. ఆ ప్రాంతంలో రామిరెడ్డి పెద్దదిక్కుగా ప్రజాభిమానం గడించాడు. గోపన్న మంత్రి పర్యవేక్షణలో నాయకురాలు చదువుతో పాటు సాముగరిడీలు, ధనుర్విద్య, అశ్వ శిక్షణలో అనుపమాన ప్రావీణ్యం పొందింది. సంస్కృతాంధ్ర, కన్నడ, తమిళ భాషలలో పాండిత్యం సాధించింది. తత్వశాస్త్రం, రాజనీతి అంశాలు క్షుణ్ణంగా నేర్చింది(6). గోపన్న శివ భక్తుడగుటచే నాయకురాలు కూడా ఆయనను అనుసరించి శివభక్తురాలై శివారాధనలో నిమగ్నమయ్యేది. ఆమె కోసం ప్రత్యేకించి జిట్టగామాలపాడులో ఓ శివాలయం కూడా నిర్మాణం చేసుకుంది. ఈ నేపథ్యంలో రామిరెడ్డి మేనల్లుడైన సింగారెడ్డితో నాగమ్మ వివాహం జరిపించారు. వివాహమై మూడురోజులు నిండక ముందే సింగారెడ్డి అకాలమృత్యువు పాలయ్యాడు. తన పొలంలో ఊట చెరువు తవ్వించటానికి దొడ్డనాయుడు చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్న సందర్భంగా రామిరెడ్డి, తన బావమరిది జగ్గారెడ్డి మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో విధవ అయిన నాగమ్మే కుటుంబ భారాన్ని, ఆస్తి పాస్తుల పర్యవేక్షణను మోయాల్సి వచ్చింది. ప్రజాసంబంధాలలో గొప్ప వ్యక్తిత్వం కలిగిన మహిళగా ఎదిగింది(7). గ్రామంలోనే కాక ఇతర గ్రామాలలోని అనేక ప్రజా సమస్యలను తన మేధస్సుతో పరిష్కరించే స్థాయికి చేరుకుంది. మధ్యవర్తిగా, పెద్ద మనిషిగా పేరు తెచ్చుకుంది. దాన ధర్మాలతో ప్రజల తలలో నాలుకలా మెలిగింది(8). చెరువు స్థల వివాదంతో సంఘర్షణ పడుతూన్న క్రమంలోనే ప్రజలకు జరుగుతున్న నష్టాలను కూడా గమనించి ఆమె మంత్రి పదవిని ఆశించింది. ఈ సమయంలో తీవ్రమైన గ్రీష్మఋతువులో వేట కోసం జిట్టగామాలపాడు అవతలనున్న నల్లమల అడవులకు వెళ్ళి తిరుగు ప్రయాణంలో ఉన్న అనుగురాజుకు, ఆయన సైన్యం,పరివారాలకు సేద తీర్చుకోవటానికై తన గ్రామ పొలిమేరలలో నాగమ్మ చలువ పందిళ్ళు వేసి తాగునీటి వసతి, భోజన సదుపాయాలు ఏర్పాటు చేసింది. నాగమ్మ ఇచ్చిన ఆతిథ్యానికి ఆనంద పరవశుడైన అనుగురాజు వరం అడగమని కోరతాడు. అనుగురాజు ఇచ్చిన అవకాశానికి సంతసించి ఏడు ఘడియలు రాజాస్థానంలో మంత్రిగా పదవిని ఇప్పించ వలసిందిగా నాగమ్మ కోరుకుంటుంది. ఆమె కోరికకు సమ్మతించిన అనుగురాజు ఇష్టం వచ్చిన సమయంలో ఏడు ఘడియలు మంత్రి పదవిని స్వీకరించ వచ్చునని నాగమ్మకు రాజపత్రం వ్రాసి ఇస్తాడు. ఈ రాజపత్రం తదనంతర కాలంలో నాగమ్మకు మంత్రి పదవి స్వీకరించటానికి, నాయకురాలు కావటానికి రాజమార్గమైంది(9).

## నాయకురాలి తండ్రి రామిరెడ్డిని బలితీసుకున్న బ్రహ్మనాయుడు

అనుగురాజు తాగునీటి వనరు కోసం జిట్టగామాలపాడులో చెరువు త్రవ్వించే ప్రయత్నం చేస్తాడు. చెరువు తవ్వకానికి సరైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని మంత్రి దొడ్డనాయుడిని ఆదేశిస్తాడు. ఈ నేపథ్యంలో దొడ్డ నాయుడు నాయకురాలు నాగమ్మ తండ్రి రామిరెడ్డికి చెందిన సాగు (వ్యవసాయ) భూమిని ఎంపిక చేస్తాడు. అయితే రామిరెడ్డి ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడంతో చెరువు తవ్వకం నిలిచిపోతుంది. అప్పుడు జరిగిన ఘర్షణలో నాయకురాలిమామ జగ్గారెడ్డి ప్రాణాలుకోల్పోతాడు. చెరువు కోసం భూమిని ఇవ్వటానికి నిరాకరించిన రామిరెడ్డి నిర్ణయాన్ని బ్రహ్మనాయుడు ధిక్కారంగా భావించి ఉగ్రరూపమెత్తుతాడు. ఆవేశంగా బ్రహ్మనాయుడు అవాంఛనీయమైన ఆలోచనకు రూపమిస్తాడు. ఏ విధమైన ముందు చూపు లేకుండా, ఒక అపరాత్రి జిట్టగామాలపాడు వచ్చి ఎవరూ కానకుండా సరాసరి నాయకురాలి గృహంలో ప్రవేశిస్తాడు. నిద్రలో ఉన్న నాయకురాలి తండ్రి రామిరెడ్డిని ఉన్న పళంగా తాళ్ళతో మంచానికి కట్టివేసి అడ్డు వచ్చిన నాగమ్మను తోసివేసి మంచంతో సహా పొందుగుల అడవుల్లోకి తీసుకెళ్ళి దుర్మార్గంగా చెట్టుకు ఉరివేసి హత్యగావిస్తాడు(10). భర్త సింగారెడ్డి అకాలమృతితో వితంతు జీవితం గడుపుతున్న నాయకురాలు నాగమ్మ తిరిగి లౌకిక వ్యవహారాల్లోకి మళ్ళడానికి ఈ సంఘటనే ముఖ్య కారణం అని చరిత్రకారుల ప్రగాఢ విశ్వాసం. ఈ సంఘటన విశేషాలను పల్నాటి చరిత్ర కథాగానంలో ఒక రాత్రి కథగా కథకులు చెబుతుంటారు.

## అనుగురాజుని, దొడ్డ నాయుని హతమార్చిన బ్రహ్మనాయుడు

అనుగురాజుకు చాలాకాలం సంతానం కలుగలేదు. దాంతో మంత్రి దొడ్డనాయుని పెద్ద కుమార్డు, బ్రహ్మనాయుని అన్న పెద బ్రహ్మనాయుని అనుగురాజు దత్తత చేసుకుని తన అనంతరం పల్నాడు రాజ్యానికి ప్రభువుని చేస్తానని మాట ఇచ్చాడు. పెద బ్రహ్మనాయుని దత్తత తీసుకున్న అనుగురాజు అతని పేరుని బాదరాజుగా మారుస్తాడు. అయితే అనంతర కాలంలో అనుగురాజుకు వరుసగా ఏడుగురు పుత్ర సంతానం కలిగింది. అనుగురాజు తనకు పుత్రసంతానం కలగడంతో బాదరాజును రాజ్యానికి వారసుని చేసే ఆలోచనకు స్వస్తి పలకడం సహజమైంది. అయితే అనుగురాజు మాట ప్రకారం తన అన్నకు రాజ్యం కట్టబెట్టలేదని బ్రహ్మనాయుడు ఆయనపై ద్వేషాన్ని

పెంచుకున్నాడు. సంతానం మొత్తం లోకం తెలియని వయసులో ఉన్నకాలాన్ని ఆసరా చేసుకుని పకడ్బందీ ప్రణాళిక వేసి బయటి ప్రపంచానికి ఏమాత్రం పొక్కకుండా అనుగురాజును మట్టుబెట్టిన బ్రహ్మనాయుడు అడ్డుకున్న తండ్రి దొడ్డనాయుడిని కూడా అంతం జేసాడని రాబర్ట్ సీవెల్ అనే చరిత్ర కారుడు పల్నాటి చరిత్రపై వెలువరించిన తన పరిశోధనాత్మక గ్రంధంలో వెల్లడించాడు(11). అనుగురాజును, తండ్రిని వధించిన బ్రహ్మనాయుడు పల్నాటికి తననే ప్రభువుగా ప్రకటించుకోవాలని చేసిన దురాలోచనను నివురు గప్పిన నిప్పులా ఉన్న ప్రజాగ్రహ వెల్లువతో విరమించుకున్నాడు. ఈ క్రమంలో అనుగురాజు సంతానంలో పెద్దవాడైన మైలమాదేవి కుమారుడు నలగామరాజుకు సింహాసనం అప్పగించి ఉప్పెనగా మారనున్న ప్రజా వ్యతిరేకతకు తలవంచాడు. ఈ హత్యలు ఎంత రహస్యంగా చేసినా రాజధానిలోని ప్రజలు పసిగట్టారు. ఇది బ్రహ్మనాయుని దుష్ట పన్నాగమేనని నమ్మిన ప్రజలు బ్రహ్మన్నకు సహకరించిన ఆయన బంధు వర్గానికి చెందిన కొన్ని గృహాలను దహనం చేశారు. రాజధాని పరిధిలోని ఏడు గడ్డివాములు బూడిదయ్యాయి. వెల్లు వెత్తిన ప్రజలకోపాగ్ని మరింత ఉధృతమై ఉప్పెనగా మారకముందే తేరుకుని నలగాముని రాజుగా, తనను మంత్రిగా ప్రకటించుకుని ఉగ్రరూపం తీసుకోనున్న ప్రజా తిరుగుబాటును శాంతింపజేశాడు. సింహాసనం ఎక్కేనాటికి నలగామ రాజు వయస్సు 13 సంవత్సరాలు. నలగామునికి పరిపాలనా అనుభవం, రాజకీయ పరిజ్ఞానం కొరవడిన పరిస్థితుల్లో నాయకురాలు మంత్రిగా వచ్చే వరకు బ్రహ్మనాయుడే యథేచ్ఛగా పల్నాటి రాజ్యపాలన సాగించాడు.

## అనుగురాజు హత్యపై అల్లిన 'అవతార' గాథ

యువకుడైన బ్రహ్మనాయుడు తనను గౌరవించడం లేదనే విషయం అనుగురాజు గమనిస్తాడు. అంతఃపురానికి వచ్చినా, నిండు సభకు విచ్చేసినా బ్రహ్మనాయుడు అనుగురాజు పట్ల అదే వైఖరి అవలంబిస్తాడు. తన పట్ల అమర్యాదగా ప్రవర్తించడాన్ని జీర్ణించుకోలేని అనుగురాజు ఒక నాడు మంత్రి దొడ్డనాయుని దృష్టకి తీసుకువస్తాడు. ఈ విషయం గురించి దొడ్డనాయుడు పుత్రుడైన బ్రహ్మనాయుని మందలిస్తాడు. మందలింపును ఆసరాచేసుకుని నిండు సభలో ప్రవేశించిన బ్రహ్మనాయుడు అనుగురాజుతో ఈ విధంగా చెపుతాడు. తాను అవతార పురుషుడనని, శ్రీమహావిష్ణువు అంశ అని, ఎంతటివారైనా తన నమస్కారాన్ని తట్టుకోలేరని వెల్లడిస్తాడు. సమాధానంగా

అనుగురాజు బ్రహ్మనాయుని నమస్కార పర్యవసానాన్ని పరీక్షించ గోరుతాడు. ఈ నేపథ్యంలో అనుగురాజును సింహాసనం నుండి పక్కకు తప్పుకోమనిచెప్పి ఆయన సింహాసనం నుండి లేచివెళ్ళగానే బ్రహ్మనాయుడు సింహాసనానికి నమస్కరిస్తాడు. ఈ సందర్భంగా సింహాసనం బద్దలై శకలాలుగా చిందరవందరైంది. ఈ క్రమంలో ఒక శకలం దూసుకు వచ్చి అనుగురాజు వెన్నులో దిగబడుతుంది. ఈ గాయంతో అనుగురాజు మరణించాడని, మరణిస్తూ అనుగురాజు తనకు తోడుగా ఎవరినైనా పంపమని కోరిన మేరకు, బ్రహ్మన్న తండ్రి దొడ్డనాయుని పంపాడని ఒక ప్రచార గాథ. అయితే ఈ గాథలోని సత్యాసత్యాలను పరిశోధించిన చరిత్రకారుడు 'స్వ్యాయల్' తన పల్నాటి చరిత్రలో ఈ ప్రచార గాథను కొట్టివేస్తూ అనుగురాజు, దొడ్డనాయుని బ్రహ్మనాయుడే హతమార్చాడని వెల్లడించారు. హత్యలనుండి ప్రజల ఆలోచనను మళ్ళించటానికే అవతార గాథను అల్లి ప్రచారం చేసుకున్నాడని తెలిపాడు. అయితే కథ ఏదైనా ఒక విషయం మాత్రం సుస్పష్టం అనుగురాజు, దొడ్డనాయుడు బ్రహ్మన్న వల్లే మృత్యుపాలయ్యారన్న విషయం. కాగా బ్రహ్మన్న అవతారమనే గాథను, నమస్కార పర్యవసానంలోని నిజానిజాలను నిర్ధారణ చేసుకునే విషయం విజ్ఞులైన పాఠకులకే విడిచి పెడుతున్నాను.

## బ్రహ్మన్నకు లేక లేక కలిగిన ఏకైక సంతానం బాలచంద్రుడు

బ్రహ్మన్న, ఐతమ్మల ఏక సంతానం బాలచంద్రుడు. సంతాన లేమితో చాలా కాలం అనేక పూజలు, పురస్కారాలు, వ్రతాలు ఆచరించిన మీదట లేక లేక కలిగిన సంతానమే బాలచంద్రుడు. పుట్టిన ఘడియలను బట్టి బాలచంద్రుని వలన రక్తపాతం జరుగుతుందని, యుద్ధానికి మూలమవుతాడని జ్యోతిష్య పండితులు చెప్పారు. తుదకు అదే జరిగింది. చిట్ట చివరికి కార్యమపూడిలో జరిగిన పల్నాటి యుద్ధానికి, రక్తపుటేరులకు అతనే కీలకమయ్యాడు. ఎంతో కాలానికి కలిగిన సంతానం కావడం, ఒక్కడే అవడం మూలంగా అతిగారాబంగా, ఆడిందే ఆటగా, పాడిందే పాటగా, ఆకతాయిగా, తుంటరిగా పెరిగిన బాలచంద్రుడు తుది వరకూ బాధ్యతలను ఎరిగినట్లు కనిపించడు. యుక్త వయసు వచ్చే వరకు ఆ తదుపరి కూడా బొంగరాల ఆటలో మునిగితేలుతూ తోటి మిత్రులతో జల్సాలు చేస్తుండే వాడు. ఇతనితో పాటు ఇతని ఆరుగురు స్నేహితులు కూడా రూప సారూప్యత కలిగి ఉండేవారని పల్నాటి చరిత్రను

పరిశోధించి పరిష్కరించిన గ్రంథం ఎపిక్ ఆఫ్ పల్నాడులో అమెరికా రచయిత రోఘర్ స్పష్టం చేశాడు(12). అదే విధంగా తన సరదాలకు సంతోషాలకు ఇతరులను ఆటపట్టించడం ఇతనికి రివాజు. సాయంకాలం పశువుల మేతతో, పంట బరువులతో తిరిగి ఇళ్ళకు చేరే బండ్ల చక్రాలకున్న సీలలు లాగి స్నేహితులతో ఆనందించేవాడు. ఈ సందర్భంగా చక్రాలు వూడిపోయి బండ్లు క్రింద పడిపోగా, బండిలాగే ఎద్దులపై అమిత బరువు పడి అవి హాహాకారాలు చేస్తుంటే మిత్రబృందంతో బాల చంద్రుడు కేరింతలు కొట్టేవాడు(13). బ్రహ్మన్న బావమరిది కూతురు మాంచాలతో బాలచంద్రునికి మేనరిక వివాహమైంది. వివాహం అయితే అయింది కానీ, వివాహం అయినది మొదలు మరణించే వరకు ఆమెతో కాపురం చేసిన దాఖలాలు కనిపించవు. యుద్ధరంగంలో తనువు చాలించే వరకు 'సబ్బాయనే' కులకాంతతో శృంగార కార్యక్రమాలలో మునిగితేలే వాడు(14). మాంచాల ఆ విధంగా భర్త బాలచంద్రుని విస్మరణకు గురికావడం చారిత్రక సత్యం. అంతే కాక బాలచంద్రుడు అత్యంత దూకుడుగా(15), ముందూ వెనుక ఆలోచించని వ్యక్తిగా అనుచిత నిర్ణయాలు స్వీకరించేవాడని, విధ్వంసానికి హేతువని చెప్పటానికి పల్నాటి చరిత్రలో చెదిరిన సంధి, తదనంతర యుద్ధం సాక్షీభూతాలుగా నిలుస్తాయి.

## సమర్ధతకు ప్రతిరూపం నాగమ్మ

రాత్రికి రాత్రే అందరూ అన్నీ చేయలేరంటారు. కొందరు కొన్నే చేస్తారంటారు. వేళ్ళమీద లేక్కించదగిన వారు మాత్రమే అద్భుతాలు చేస్తారని నానుడి. అలాంటి వారిలో పల్నాడుకు మంత్రిగా ఉన్న నాయకురాలు నాగమ్మ అగ్రగణ్యురాలు. ఏడు ఘడియల అవకాశాన్ని వినియోగించుకుని ఆ కొద్ది సమయంలో అంతఃపుర చోరుల ఆటకట్టించి మంత్రి పదవిని సుస్థిరం చేసుకుంది నాయకురాలు నాగమ్మ. రాజబొక్కసానికి గండికొడుతున్న దొంగలను పట్టుకుని సొత్తునంతా తిరిగి ఖజానాకు చేర్చి రాజు నలగాముని అభినందనలతో పాటు మంత్రి స్థానాన్ని శాశ్వతం చేసుకొన్న విషయం నాయకురాలి ప్రతిభా, కార్యదీక్షలకు ఓ మచ్చుతునక. నలగాముడు రాజుగా బ్రహ్మనాయుడు మంత్రిగా పాలన సాగుతున్న సమయంలో ఒకానొక రోజు నాగమ్మ అనుగురాజు ఇచ్చిన రాజపత్రంతో రాజాస్థానం చేరి నలగామునికి చూపింది. రాజపత్రానుసారంగా బ్రహ్మనాయుడిని ఒప్పించి తండ్రి ఇచ్చిన మాటను అమలు

పరిచేందుకు  ఆమెను ఏడు ఘడియలు (ఘడియ కాలం 24 నిమిషాలు) మంత్రిగా నియమిస్తారు. మంత్రిగా రాకముందే నాగమ్మ నెరపిన అంతఃపుర రాకపోకలతో గ్రహించిన రాచకార్యాల అనుభవంతో ఏడు ఘడియల పాలనలో అంతఃపుర చోరుల ఆటకట్టించి అద్భుతాలు సృష్టించింది. రాజబొక్కసాన్ని దోచుకున్న  దొంగలను పట్టుకుని నేలమాళిగలలో దాచిన సొత్తునంతా తిరిగి ఖజానాకు చేర్చి రాజు నలగాముని అభినందనలు అందుకుంది. కాగా అంతఃపుర దొంగలంతా బ్రహ్మనాయుని బంధువులు, అనుయాయులు అవటం విశేషం. తనకు పాలనానుభవము లేకపోవటం వల్లనే ఈ విధంగా ఖజానా సొత్తు దోపిడీకి గురైందని నలగాముడు విశ్వసించాడు. వీరందరికీ నాయకుడైన బ్రహ్మనాయుని ఆమోదంతోనే అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చాడు. ఇంత పెద్ద ఎత్తున కోశాగారం చోరీకి గురవుతుంటే బ్రహ్మనాయుడు చేష్టలుడిగిన వాడిగా ఉండిపోవటం నలగామునికి సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలి పోయింది. అప్పటికే తన తండ్రి అనుగురాజు  మరణంలో బ్రహ్మనాయుని పాత్ర ఉందని (16) **("I bid-see" sewell)** అంతర్లీనంగా మనసులో గూడు కట్టుకుని ఉన్న నమ్మకానికి ఈ ఖజానా దోపిడీ వైనం(17), బ్రహ్మనాయునిపై నలగామునికి ఉన్న అనుమానాలను బలపరిచింది. ఈ నేపథ్యంలో బ్రహ్మనాయుని పట్ల నమ్మకం సడలిపోయింది. అచంచలమైన రాజభక్తి, కార్యదీక్ష, మేధస్సుతో రాజసంపదను తిరిగిరాబట్టి అంతఃపురానికి చేర్చిన ధైర్యశాలి నాయకురాలిపై ప్రగాఢ విశ్వాసం ఏర్పడింది. ఈ విశ్వాసంతో నాయకురాలిని శాశ్వత మంత్రిగా ఉండిపొమ్మని నలగాముడు కోరతాడు. రాజు ఆదేశాన్ని పాటించి తన స్థానాన్ని పదిలపరచుకున్న తీరు నాయకురాలి ప్రతిభ, కార్యదీక్షకు ఓ గీటురాయి. ఈ సంఘటనే పల్నాడు చరిత్రను మలుపు తిప్పింది. నాయకురాలు మంత్రిగా పల్నాడు పాలన అజేయంగా సాగుతున్న నేపథ్యంలో అనేక దేశాలతో అత్యున్నతమైన దౌత్య సంబంధాలు ఏర్పడినట్లు శ్రీనాథ కవి సార్వభౌముని పలనాటి వీర చరిత్ర ద్వారా తెలుసుకుంటాము.

అత్యంత సాహసోపేతమైన చర్యలతో , ప్రజారంజకమైన పాలనతో , అపార మేధాశక్తితో నాగమ్మ నాయకురాలిగా పేరు గాంచింది(18).

## పల్నాడును ముక్కలు చేసిన బ్రహ్మన్న స్వార్థ చింతన

వీరవిద్యలదేవి ప్రాంతీయాభిమానం, పూర్వం నుండీ ఉన్న కుటుంబ అనుబంధం బ్రహ్మనాయునికి కలసి వచ్చాయి. తన మంత్రి పీఠాన్ని తిరిగి దక్కించుకునేందుకు ఈమెను పాచికగా ఉపయోగించుకున్నాడు. కండబలం మెండుగా ఉన్న నాయుడిని ధర్మాధర్మాలు, సాంప్రదాయాలు, నీతి నియమాలు అడ్డుకోలేక పోయాయి. దండుబలం కూడా తోడు కావడంతో అతని అనుచిత ఆగడాలు ఎదుర్కొనే వారు లేక పోయారు. బ్రహ్మన్న కుటిలత్వం ముందు రాచరిక వంశానుకరణలు తలవంచడంతో పల్నాడు ముక్కలైంది. రాచరిక నేపథ్యంతో విశ్లేషించుకుంటే రాజకుటుంబంలో పెద్దవాడే యువరాజు. అతడే దాయాది హక్కులు పొందుతాడు. ఈ సంస్కృతిని కాలరాచి పల్నాడు బీటలకు నాయుడు నాంది పలికాడు. పల్నాడు చీలికకు కన్నమదాసు వంటి మానసపుత్రుల అండ బ్రహ్మన్నకు తోడుగానిలిచింది. ఈ సందర్భంలో పల్నాడు ముక్కలవటానికి బ్రహ్మన్న చేసిన పసలేని వాదన వితండంగా తోస్తుంది. అనుగురాజు మరణ సమయంలో లోకం తెలియని విద్యలదేవి సంతానం బాగోగులు తనను చూసుకోమని కోరాడనే ఒకే ఒక సాకుతో నాయుడు నానాయాగి సృష్టించి వారికి రాజ్యభాగం కావాలని వత్తిడి చేస్తాడు. అందుకు తగు ఆధారమేమి ఆయన వద్ద లేదు. కేవలం నోటిమాటగా అనుగురాజు తనకు చెప్పాడనే కల్పనో, నిజమో తెలియని వాదనతో ముందుకొచ్చాడు. నలగాముని కొలువులో మంత్రిగా కార్యకలాపాలు వెలగబెట్టినంత కాలం గుర్తుకురాని అనుగురాజు మాటలు పదవి ఊడిపోగానే గుర్తుకు రావటంలోనే అసలు కిటుకంతా గోచరిస్తుంది. నాయకురాలికి ఏడు ఘడియల మంత్రి పదవి గురించి వ్రాసి ఇచ్చిన విధంగా రాజ పత్రం లాంటిది నాయుడి వద్ద లేక పోవడం వలన ఈ వాదన నిజానిజాల మధ్య తెల్లబోతుంది. అది నిజమైనా మైలమ దేనికి పుట్టింటి అరణంగా (పసుపు కుంకుమ) వచ్చిన ఆస్థిపై ఆమె సంతానానికి హక్కు ఉంటుందేకాని, సవతుల సంతానానికి ఎట్లా ఉంటుందనే విజ్ఞత కూడా నాయుడు పాటించ లేదని చెప్పవచ్చు. అయినా అప్పటికి చిన్న పిల్లలైన (మైనర్లు) పెదమలిదేవుడు, చినమలిదేవుడు తరపున తల్లి వీరవిద్యలదేవికి అడిగే హక్కు, అధికారం ఉండగా, ఈయన కేమిటి బాధ. ఆమెకురాని ఆలోచన ఈయనకెందుకు వస్తుంది. బాధంతా తను కోల్పోయిన మంత్రి పదవి గురించే. దుర్బుద్ధితో తెరచాటు బలప్రదర్శన నెరపి పల్నాడును రెండు భూభాగాలుగా చేసిన బ్రహ్మన్న మాచర్ల రాజ్యాన్ని మైనర్ల తరపున

తనే 15 సంవత్సరాలు పాలించడాన్ని బట్టి ఆయన స్వార్థ చింతనను మనం అర్థం చేసుకోవచ్చు. (20) రాజ్యాన్ని పంపకాలు చేయవలసిన పరిస్థితే ఉత్పన్నమైతే అనుగురాజుకు ముగ్గురు భార్యలు అయినందున మూడుభాగాలు చేయవలసి ఉంటుంది.

## ప్రచార శాఖను ఏర్పాటు చేసుకున్న బ్రహ్మన్న

తను చేసిన ప్రతి కార్యక్రమం గొప్పదిగా, ఇతరులు సత్కార్యాలు తలపెట్టినా అవి హీనమైనవిగా ప్రచారం చేయటం బ్రహ్మనాయుడికి పుట్టుకతో ఏర్పడిన నైజం. తన ఆలోచనలు, ఆచరణలన్నీ ప్రజోపయోగకరమైనవని, ముఖ్యంగా తనంటే గిట్టని వారు దుష్టులని, వైరుల ప్రజాహితాలన్నీ దుర్మార్గమైనవిగా ప్రజల్లో నాటే ప్రయత్నం చేయడం, కొందరిని నమ్మించడం ఆయన ఎంచుకున్న మార్గం. ప్రధానంగా తాను వ్యతిరేకిస్తున్న గురజాల రాజ్యాధిపతి నలగామరాజు, మంత్రిణి నాయకురాలు నాగమ్మపై సాగించే దుష్ప్రచారానికి అంతే ఉండదు. ఈ నేపద్యంలోనే బ్రహ్మన్న తన రాజ్యంలో ప్రచారం నిమిత్తం ఒక శాఖను ఏర్పాటు చేసుకున్నాడు. ఇప్పటి ప్రభుత్వాలు తమ తమ అభివృద్ధి కార్యక్రమాలను, విధివిధానాలను ప్రజలకు తెలియపరచేందుకు ఏర్పాటు చేసుకున్న సమాచారశాఖ మాదిరిగా బ్రహ్మన్న వీరవిద్యావంతులు అనే ఒక వర్గాన్ని నియమించుకున్నాడు. మన ప్రభుత్వాలు తమతమ పార్టీ అధినేతల పేరుతో ప్రాజెక్టులు, పథకాలు ఏర్పరచుకున్నట్లు బ్రహ్మన్న కూడా అనుగురాజు పెద్ద భార్య వీరవిద్యలదేవి పేరుతో వీరవిద్యావంతుల శాఖను రూపొందించాడు(20). ఈ నాటి రాజకీయ నాయకులు అధిష్టానం మెప్పు పొందేందుకు చేసే ప్రక్రియనే వెయ్యేళ్ళ క్రితమే బ్రహ్మన్న కూడా రాజమాతను తదనంతరం ఆమె తనయులు రాజు పెదమలి దేవాదులను వశపరచుకునేందుకు ఇటు వంటి ఆకర్షక పథకం పెట్టి ఉంటాడు. వీరవిద్యావంతులు జీతాలు తీసుకుని బ్రహ్మన్న దైవాంశ సంభూతుడని, నేరుగా ఆయనే దేవుని అవతారమని వారి దేశంలో, పరాయి రాజ్యాల్లో చెప్పుకు పోతుంటారు. ఆయన చేసే ప్రతిపని అద్భుతమని, ప్రజాహితంకోసమేనని ప్రచారం చేస్తుంటారు. బ్రహ్మన్న వద్ద అనేక మహిమలు, మహత్మ్యాలు ఉన్నాయని వివరిస్తుంటారు. ఈయన కార్యక్రమాలన్నింటికీ కల్పనలను జత చేసి గానం చేస్తుంటారు. తన అనుయాయులైన మాల కులస్థులలో కొందరిని విడదీసి వారికి వీరవిద్యావంతులుగా నామకరణం చేశాడు. వంశ పారంపర్యంగా వీరి కుటుంబీకులైన వంశస్థులు ఇప్పటికీ బ్రహ్మన్న వర్గానికి అనుకూలంగా గాథలను గానం ద్వారా వినిపిస్తారు. కారంపూడిలో ప్రతియేటా జరిగే

కొణతముల ఉత్సవాల్లో వీరు పాల్గొని ఐదురోజులపాటు కథాగానం చేస్తారు. తిమ్మిని బమ్మిని చేయడంలో మసిపూసి మారేడు కాయగా మార్చడంలో బ్రహ్మన్న సిద్ధ హస్తుడని ముందుచూపుతోనే వీరవిద్యావంతులను ఏర్పాటుచేసుకున్న వైనం వల్ల తెలుస్తుంది.

## పల్నాటి చరిత్రలో శైవ - వైష్ణవుల వైరుధ్యాలు

11 వ శతాబ్దిలో పల్నాడు చారిత్రక నేపథ్యాన్ని పరిశీలించినపుడు శైవ వైష్ణవ మతాల మధ్య వైరుధ్యాలు అంటకాగుతుండేవని తెలుస్తుంది. అప్పటికింకా దక్షిణభారత దేశంలో ఇస్లాం, క్రీస్తు మతాలు విస్తృత ప్రచారంలో లేవు. ఈ మతాలు రాకముందు హిందూ మతంలో దేశ వ్యాప్తంగా వివిధ ఉపమతాలున్నట్లు బోధపడుతుంది. బ్రహ్మనాయుడు వైష్ణవ మతస్తుడు. ఈయన మాచర్లలో, కారంపూడిలో విష్ణు ప్రతిరూపమైన చెన్న కేశవ స్వామి దేవాలయాలను నిర్మించారు. నాయకురాలు నాగమ్మ శైవ మతస్థురాలు. ఈమె జిట్టగామాలపాడులో శివాలయాన్ని నిర్మించింది. అదే విధంగా గురజాలలోని పార్వతి ప్రతి రూపమైన పాతపాటేశ్వరి ఈమె ఆరాధ్య దైవం. శైవ వైష్ణవుల మధ్య వైషమ్యాలు మానవ సంబంధాలను కూడా దెబ్బతీసే విధంగా కనిపిస్తాయి. కళ్యాణపట్టణ రాజైన వీరసోముడు శైవ మతస్తుడు. వీరసోముని కుమార్తె సిరాదేవి. మాచర్ల రాజైన పెదమలిదేవునకి వివాహం చేయదలచి బ్రహ్మనాయుడు వీరసోముని సంప్రదిస్తాడు. పెదమలిదేవునికి సిరాదేవినిచ్చి వివాహం చేయవలసిందిగా కోరతాడు. అయితే వీరసోముడు ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తాడు. పెదమలిదేవుడు వైష్ణవ మతస్థుడు కావటం వల్లనే వీర సోముడు తిరస్కరించినట్లుగా చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. వాస్తవానికి క్షత్రియుని వివాహానికి కులం, మతం అడ్డురావు. అయితే వీరసోముడు మలిదేవునితో వియ్యాన్ని వ్యతిరేకించటం ఆ నాటి శైవ – వైష్ణవుల వైషమ్యాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తున్నాయి. కాగా వీరసోముని తమ్ముడు నంది సోముని పుత్రిక నాగుల దేవి తన మేనత్త కుమారుడైన శివసింగుని ప్రేమించింది. (21) ఈ నేపథ్యంలో వారిరువురు వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. రెండు కుటుంబాల మధ్య ఉన్న పూర్వ కక్షల వలన వారిరువురి వివాహాన్ని వీరసోముడు, నందిసోముడు తిరస్కరిస్తారు. శివసింగు నాగులదేవిని, వీరసోముని కుల దైవం మహంకాళి పీఠాన్ని తన రాజధాని శివనందుల కోటకు రహస్యంగా తీసుకెళ్ళి అక్కడ పరిణయం చేసుకుంటాడు. ఆ సమాచారాన్ని తెలుసుకున్న వీరసోముడు సోదరునితో

సహా సర్వసైన్యాన్ని సమకూర్చుకుని శివనండ్ల కోటను ముట్టడిస్తాడు. ఏళ్ళతరబడి యుద్ధం చేసినా కోట స్వాధీనం చేసుకోవటంలో వీరసోముడు విఫలమౌతాడు. ఈ సందర్భంగా తనకు యుద్ధంలో సహాయ పడాల్సిందిగా బ్రహ్మనాయుడిని కోరతాడు. వీరసోముని అభ్యర్థన మేరకు బ్రహ్మనాయుడు తన సైన్యంతో శివనండ్ల కోటపై దండెత్తి జయిస్తాడు. శివసింగు, నాగులదేవి శత్రువులకు పట్టుపడటం ఇష్టం లేక విషం మింగి ఆత్మహత్య చేసుకుంటారు. ఈ యుద్ధంలో బ్రహ్మనాయుడు, మలిదేవాదులు చేసిన సహాయానికి కృతజ్ఞతగా వీరసోముడు తన కుమార్తె సిరాదేవిని పెద మలిదేవునికిచ్చి వివాహం చేస్తాడు. అదే విధంగా వీరసోముని సోదరుల పుత్రికలు పెదమలిదేవుని సోదరులను వివాహమాడతారు. ఈ నేపథ్యాన్ని అధ్యయనం చేసినపుడు పల్నాటి యుద్ధంలో శైవ – వైష్ణవ మతాల విభేదాల భూమిక ప్రముఖంగా కనిపిస్తుంది. వీరి వివాహాల అనంతరం పశ్చిమ చాళుక్యుల సామంతం కొనసాగించటం కష్టమైన నేపథ్యంలో సిరాదేవి సోదరుడు కొమ్మరాజు, భార్య చెల్లమదేవి,కుమారుడు అలరాజుతో కలసి సోదరి సిరాదేవి రాజ్యానికి వలస వచ్చి మాచర్లలో నివాసం ఏర్పరచుకుంటారు. కొమ్మరాజు సోదరులు తలోదిక్కు వెళతారు. అయితే నాయకురాలు కానీ,బ్రహ్మనాయుడు కానీ మత ద్వేషాన్ని ప్రదర్శించ లేదు. బ్రహ్మనాయుడు శివారాధన కూడా చేస్తే నాయకురాలు దాచేపల్లిలో రంగనాయక స్వామి దేవాలయం నిర్మించింది.

## సిరాదేవితో పెదమలి దేవుని వివాహం

వీరసోముడు మాచర్ల రాజ్యాన్ని సహాయం కోరిన పరిణామం బ్రహ్మన్నకు బాగా ఉపకరించింది. యుద్ధంలో సాయపడటానికి పెదమలిదేవునితో సిరాదేవినిచ్చి వివాహం చేయాలనే నిబంధన విధిస్తాడు. బ్రహ్మన్న సాయంతో వీరసోముడు విజయం పొందుతాడు. ఈ విధంగా పెదమలిదేవునితో సిరాదేవి వివాహం జరుగుతుంది. వివాహానంతరం కాపురానికి వస్తున్న సిరాదేవితో అరణంగా వెయ్యిగోవుల్ని, వెయ్యి గొర్రెల్ని, ఆ మందలను కాసే గొల్లబంట్లనూ తోడ్కొని తెమ్మని బ్రహ్మన్న చేసిన వత్తిడికి ఆమె, ఆమె తండ్రి తలొగ్గక తప్పలేదు. గొల్ల బంట్లలో చెవుల గోపన్న ఒకడు. ఎలాంటి అరమరికలు లేకుండా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో బ్రహ్మన్న ఆలోచన పదును తేలి ఉంటుందని ఈ సంఘటనల వల్ల బోధ పడుతుంది. అదే విధంగా మనుషులను ఉపయోగ పెట్టుకోవడంలో కూడా ఆయనది అందె వేసిన చేయి. తన బలానికి తోడు వీరసోముని కలయికతో బ్రహ్మన్న బలం మరింత పెరిగింది.

## పేరిందేవితో (పేరమ్మ) అలరాజు వివాహం

పెదమలిదేవుని భార్య సిరాదేవి. సిరాదేవి అన్న కొమ్మరాజు. కొమ్మరాజు భార్య చెల్లమదేవి, కుమార్డు అలరాజు తో మాచర్లలో స్థిరపడడానికి వచ్చిన విషయం ముందుగా చెప్పుకున్నాము. సిరాదేవికి ఏ విధంగా అలరాజు మేనల్లుడౌతాడో బంధుత్వాలను వల్లె వేసుకుంటే మలిదేవుని సవతి తల్లి కుమారుడైన నలగామరాజుకు కూడా అల్లుడు వరుసని తెలుస్తుంది. ఈ బంధుత్వం నలగాముడు ఒక్కగానొక్క కుమార్తె పేరిందేవినిచ్చి (పేరమ్మ) వివాహం జరిపించడంతో అల్లుడుగా మరింత చిక్కనయ్యింది. అయితే పల్నాటి యుద్ధాన్ని నివారించేందుకు సంధి కోసం దూతగా వెళ్ళి మరణించే వరకూ, అలరాజు నలగాముని గడప తొక్కింది లేదు. పేరమ్మతో సంసారజీవనం గడిపిందీ లేదు. వీరిద్దరూ కలవక పోవడం వెనుక బ్రహ్మన్న తంత్రం ఉందని అనుకుంటూ ఉంటారు(22). చారిత్రక నేపథ్యాన్ని గమనిస్తే నలగాముని కుటుంబానికి, కొమ్మరాజు కుటుంబానికి మధ్య గొడవలున్న సంఘటనలు కనిపించవు. చాణక్యనీతిని ప్రదర్శించడంలో నేర్పరైన బ్రహ్మన్న రెండు కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలు పెనవేసుకుంటే రెండు రాజ్యాల వారు ఒకటై ఎక్కడ తన మనుగడ పలుచనౌతుందోనన్న దురాలోచనతో రెండు రాజ్యాల మధ్య దూరం పెరిగే కుట్రలు చేసినట్లు చరిత్ర కారుల నమ్మకం.కాగా అలరాజు అత్యంత బలశాలి, యుద్ధనేర్పరి, ధర్మాధర్మ విచక్షణా పరుడు(23). నూరుగురు రాజులను జయించి అలరాజు 'రాచమల్లు' అనుబిరుదును పొందాడు.

## దూబచెరువు తవ్వకాన్ని నిలిపి వేసేందుకు"నాయుడి"కుట్ర

మంచి పనులను అడ్డుకోవడం వేయేండ్ల క్రితమే ఉంది. తమకు గిట్టని రాజ్యాధినేతలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటారు.ఏదో విధంగా నిలిపి వేసేందుకు కసరత్తు చేస్తారని నాయకురాలు చేపట్టిన దూపచెరువు తవ్వకం సందర్భంలో చోటు చేసుకున్న సంఘటన రుజువుగా నిలుస్తుంది. మంచి కార్యక్రమాల ద్వారా తమతో పొసగని వారికి ప్రజాభిమానం పెరిగి ఎక్కడ మంచిపేరు వస్తుందోనని మాయోపాయంతో అవి ముందుకు సాగకుండా ఆటంకాలు కలిగిస్తారు. ఇక్కడ కూడా ఇదే జరిగింది. గురజాలలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు నలగాముని ఆమోదంతో నాయకురాలు నాగమ్మ చెరువు త్రవ్వించేందుకు ప్రణాళిక సిద్ధంచేసింది. ఆ ప్రకారం పనులు ప్రారంభమై సాగుతున్న క్రమంలో విషయం

ఆనోటా ఈ నోటాపడి బ్రహ్మన్న చెవికి చేరింది. అట్లు కాకపోయినా వేగులతో సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించటం కూడా రాచరికాల్లో రివాజు. చెరువు పూర్తి అయి తాగునీటితో గురజాల ప్రజలు సంతృప్తి చెందితే నాయకురాలు ప్రతిష్ట పెరగడం ఖాయమని బ్రహ్మనాయుడు భావించాడు. ఎట్లాగైనా చెరువు త్రవ్వకాన్ని ఆపివేయించాలని కుటిలమైన ఆలోచన చేశాడు. ఇందుకు ఒక దుష్ట ప్రణాళిక సిద్ధం చేశాడు(24). మహిమలు,మంత్రాలు, తంత్రాలు, శక్తులు, క్షుద్రవిద్యలు నమ్మే ప్రజల్లో అలాంటి ఎత్తుగడతోనే నమ్మకం కలిగించి చెరువు తవ్వకానికి స్వస్తి పలికించాలని భావించాడు.ప్రణాళిక అమలుకై తనకు నమ్మకస్తులైన ఇరువురిని పంపి చెరువు తవ్వే కూలీలను హతమార్చి చెరువు నరబలి కోరుతుందని, చెరువు తవ్వకం ఆపకపోతే మరింత జన నష్టం జరుగుతుందని ప్రచారం చేయమని ఆజ్ఞాపించాడు. ప్రణాళిక క్రియారూపంలోకి తెచ్చేందుకు బ్రహ్మన్న కీలు బొమ్మలు బయలుదేరారని వేగుల ద్వారా బ్రహ్మన్న దుష్టపన్నాగమంతా తెలుసుకున్న నాయకురాలు గుట్టు చప్పుడు కాకుండా తనవారితో బ్రహ్మన్న పంపిన దుండగులను మట్టుబెట్టించి ఆ చెరువు కట్టకింద పెట్టించి నిరాటంకంగా చెరువు తవ్వకాన్ని పూర్తిగావించింది. ఇప్పటికి కూడా గురజాలలో ఈ చెరువుకు అదే నామం వాడుకలో ఉంది. బ్రహ్మనాయుడు పంపిన జత్తింద మల్లరాజు, గట్టింద మల్లరాజు కళ్యాణపురి పట్టణం నుండి కొమ్మరాజుతో మాచర్లకు వచ్చిన యోధులు. కొమ్మరాజు, నలగామరాజు కుటుంబాల మధ్య పగపెంచేందుకు బ్రహ్మన్న వీరి మరణాలను కూడా వినియోగించుకొన్నాడు.

## అలరాజు బాదరాజు (పెదబ్రహ్మనాయుడు) ల యుద్ధం

గురజాల, మాచర్ల రాజ్యాలుగా పలనాడు విడిపోయిన పిదప మాచర్ల రాజ్యంలో బ్రహ్మన్న మంత్రిగా, కన్నమదాసు సర్వసైన్యాధ్యక్షుడిగా పెదమలిదేవుడి పాలన సాగుతుంది. పెదమలిదేవుడు మైనరు, పేరుకే ఆయన రాజు. పాలనంతా బ్రహ్మనాయుడి కనుసన్నలలోనే నడుస్తుంది. కొమ్మరాజు ఆలుబిడ్డలతో మాచర్ల తరలి వచ్చాడని క్రితమే చెప్పుకున్నాము. ఈ నేపథ్యంలోఒకనాడు చంద్రవంక ఒడ్డున అలరాజు, బ్రహ్మనాయుని అన్న బాదరాజు (పెద బ్రహ్మనాయుడు) ల అశ్వాలు మేత మేస్తుండగా అశ్వపాలకులు అశ్వాల శక్తి సామర్థ్యాలపై వాదనకు దిగుతారు.ఈ రగడ ముదిరి అలరాజు, బాదరాజుల మధ్య యుద్ధానికి దారి తీస్తుంది. ఇరువురు ఖడ్గాలతో తలపడి వీరోచితంగా పోరాడుతుంటారు. ఈ విషయం తెలుసుకున్న బ్రహ్మనాయుడు ఆందోళనతో హుటాహుటిన చంద్రవంక ఒడ్డుకు చేరాడు. అప్పటికే యుద్ధం ఒకరినొకరు

కడతేర్చుకునే ఉచ్ఛస్థితికి చేరుకుంటుంది. ఈ సందర్భంలో బ్రహ్మానాయుడు ఇద్దరి మధ్య సయోధ్యకుదిర్చే యత్నం చేసి తన అన్న బాదరాజును నిలువరించినా అలరాజును శాంతింప చేయలేక పోతాడు.యుద్ధ విరమణకు అలరాజు సమ్మతించలేదు. ఎంత నచ్చ చెప్పినా ససేమిరా అన్నాడు. వరలో నుండి బయటకు వచ్చిన తన ఖడ్గం రక్తం రుచి చూడకుండా సమ్మతించదని చెప్పాడు. ఈ క్రమంలో బ్రహ్మానాయుడు ప్రత్యామ్నాయంగా ఏడు దున్నపోతులు, ఏడు బద్దెగొర్లు, ఏడు గాణిక్యణిజులు అలరాజు ఖడ్గం సూర్యబేతాళానికి  బలి ఇవ్వటం ద్వారా అతనిని శాంత పరుస్తాడు(25). ఈ సంఘటనానంతరం తనతో యుద్ధానికి వెనుకంజ వేశాడని బాదరాజు చిత్రంతో ఒక ఇత్తడి తొడుగును చేయించి తన అశ్వం వెనుక ఎడమ కాలికి తగిలించి చాలాకాలం పాటు అలరాజు బ్రహ్మన్న కుటుంబాన్ని అవమానించాడు. ఈ సంఘటన బాదరాజుతో పాటు బ్రహ్మన్ననూ కుంగతీసింది. అలరాజు పట్ల ఈ విషయం బ్రహ్మన్న మదిలో క్రోధాన్ని, ద్వేషాన్ని రగిలించింది. అయితే కాగల కార్యాలన్నీ బయటకు పొక్కకుండా చల్లగా చక్కదిద్దుకునే నైజాన్ని అలవరచుకున్న బ్రహ్మన్న విషయాన్ని కడుపులోనే దాచుకున్నాడు. మహావీరుడు కావటం, తన అన్నను అవమానపరచటం, తన మాటలను పెడచెవిన పెట్టడం వంటి విషయాలు అలరాజుపై బ్రహ్మన్న మదిలో కక్షను పురికొల్పాయి. వీటన్నింటి పర్యవసానమే అలరాజు రాయబార సందర్భంలో బ్రహ్మానాయునితో జరిపిన సంభాషణలో అలరాజు తల్లి కఠినంగా మాట్లాడుతుంది. ఎలాంటి దాపరికం లేకుండా తన హృదయంలో  గూడు కట్టుకున్న అనుమానపు ఛాయలకు, అపనమ్మకాలకు, బ్రహ్మన్నపై తనకు గల విశ్వాసరాహిత్యానికి తెరతీస్తుంది. చెల్లమ్మ ఊహించిన విధంగానే రాయబారిగా వెళ్ళిన అలరాజును బ్రహ్మన్న ద్వేషం చడీచప్పుడు లేకుండా మట్టుపెడుతుంది. వైరి రాజ్యంలో జరిగిన అలరాజు హత్యను తెలివిగా నాయకురాలు, నరసింగరాజుల పైకి నెట్టాడు. పిచ్చిగుంటల వారు వినిపించే వీరకథాచక్రం చారిత్రిక గాథల్లోని పల్నాటి వీరచరిత్ర గానంలో ఈ విషయమంతా పూసగుచ్చినట్లు స్పష్టమౌతుంది(26).

## రాజ్యాన్ని కబళించే దురాలోచనతోనే కోడిపోరు వ్యూహం

సిరాదేవి,పెదమలిదేవుని వివాహానికి సగౌరవ ఆహ్వానం అందని కారణంగా నలగామ రాజు తరపున ఎవరూ వెళ్ళరు. ఈ సందర్భంగా వివాహానంతరం మలిదేవుని వివాహ కానుకలను  నలగామునికి అందజేయటానికి బ్రహ్మన్న గురజాల

బయలుదేరుతాడు. ఈ క్రమంలో గురజాల సమీపంలో సరదాగా జరుగుతున్న కోడి పందాన్ని  కొంతసేపు వీక్షించాడు. కోడి పందాన్ని ఆసక్తిగా చూస్తూ ఆనందంలో మునిగిన బ్రహ్మన్నకు అక్కడే ఒక మెరుపులాంటి ఆలోచన తట్టింది. ఇదే కోడిపందెంతో నలగాముని ఓడించి గురజాలను కైవశం చేసుకోవడం ద్వారా పల్నాడు మొత్తాన్ని ఏకచక్రంగా మునుపటిలాగే ఏలుకోవచ్చనే దురాలోచన ఉద్భవించింది. ఇంతలోనే అక్కడ వేడుకగా జరుగుతున్న పందెంలో ఒక పుంజు పారిపోగా, పారిపోతున్న పుంజు బ్రహ్మనాయుడిదని బిగ్గరగా హేళనగా అరచిన (బ్రహ్మన్న అక్కడే ఉన్నాడని గమనించక) ఆకతాయి కేకలతో బ్రహ్మన్న ఉక్రోషంతో ఊగిపోయాడు. కోపాన్ని తమాయించుకొని అభిమానాన్ని ఒలకబోస్తూ వెళ్ళి నలగామునికి పెండ్లి కానుకలు అందించాడు. విందు భోజనాలనంతరం తిరిగి ప్రయాణమైన సందర్భంలో కోడి పందెం సందర్భంగా వీక్షకుల ప్రేలాపన గుర్తుకొచ్చి ఉడికిపోయిన బ్రహ్మన్న సూటిపోటి మాటలతో నలగాముని, వాడి వేడి మాటలతో నాయకురాలిని దెప్పిపొడిచాడు. ఈ విధంగా వారిని రెచ్చగొట్టి రాబోవు ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశినాడు ఇరుపక్షాల మధ్య కోడిపందెం జరిగే విధంగా వారిని ఒప్పించాడు(27). ఓడిన వారు రాజ్యాన్ని వదలి ఏడేండ్లు వలస వెళ్ళి అరణ్యవాసం చేయాలని నిబంధన పెట్టుకున్నారు. మాచర్ల చేరిన బ్రహ్మన్న కోడిపోరు గురించి మలిదేవునికి తెలుపగా అయిష్టంగా అంగీకరించాడు. ఇక్కడే మనం ఒక విషయం గమనించాలి. కోడిపోరును ప్రతిపాదించింది బ్రహ్మన్న అని. పందెంలో నిబంధనలు పెట్టిందీ అతగాడేనని నలగాముడు రాజ్యాభిషిక్తుడైన సమయం నుండి నాయకురాలు మంత్రిగా వచ్చే వరకూ తనే మంత్రిగా ఉండి మొత్తం పాలన సాగించాడు. తదనంతరం పల్నాడును  చీల్చి మాచర్లను పాలిస్తూ వచ్చాడు. అదే క్రమంలో మళ్ళీ మొత్తాన్ని తన ఆధిపత్యంలోనికి తీసుకోవాలనే తపనతో కోడిపోరుతో కుట్రపన్నాడు. రాజ్యాన్ని ఏలే ప్రభువుకు తెలియకుండా కోడిపోరేమిటి? తనది కాని రాజ్యాన్ని పణంగా పెట్టడం ఏమిటి? దీన్ని బట్టి అక్కడ ఎవరి పెత్తనం, ఆధిపత్యం నడుస్తుందో అర్థం చేసుకో వచ్చు. బ్రహ్మన్న మంత్రిగా వుంటే రాజు అక్కడ నామమాత్రుడేనన్నమాట నిజమని ద్యోతకమౌతుంది.

## కోడిపోరు పరాజయానికి
## బ్రహ్మన్న అనాలోచిత నియంత పోకడే కారణం.

ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి రానే వచ్చింది. నల్లగొండ సమీపంలోని పానగల్లులో మంచి పందెపు కోడిపుంజు (చిట్టి మల్లు) ఉందని సమాచారం అందుకున్న బ్రహ్మన్న సిరాదేవితో అరణంగా వచ్చిన గౌర్రెలకాపరుల్లో ఒకడైన వీరపడాలును పుంజును తీసుకువచ్చే పనికి పురమాయించాడు. బ్రహ్మన్న ఆజ్ఞ పాలనకై హుటాహుటిన పానగల్లు చేరిన పడాలు అక్రమంగా పుంజుని తెచ్చే సందర్భంలో కొందరు మాష్టీలతో పోరాడి అనేక బరిసె గాయాలతో కృష్ణమ్మను దాటి మాచర్ల చంద్రవంక ఒడ్డున ప్రాణాలు విడిచాడు. ఆ సమయాన చంద్రవంక నుండి నీళ్ళు తెచ్చే మాచర్ల మల్లారెడ్డి కోడళ్ళు ఈ దృశ్యాన్ని చూసి సమాచారాన్ని బ్రహ్మన్నకు చేరవేశారు. బ్రహ్మన్న పుంజుని తెచ్చుకుని పడాలు పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశాడు. గురజాల కోడిపై పందెం వేసే బాధ్యతను చెవుల గోపన్నకు అప్పగించాడు. ఇతను పడాలుకు సోదరుడు. బలశాలి, స్వాభిమాని. ఇక నాయకురాలు నాగమ్మ నల్లమల్లు అనే కోడిపుంజును పోరుకు సిద్ధం చేసింది. మాచర్ల , గురజాల మధ్యలో గోలివాగు సమీపంలో పోరుకు రంగం సిద్ధం చేశారు. రెండు రాజ్యాలకు చెందిన వేలాది మంది ప్రజలు కోడిపోరు తిలకించటానికి వచ్చారు. ఇందరి సమక్షంలో బ్రహ్మన్న తరపున గోపన్న, నాయకురాలి తరపున చింతపల్లిరెడ్డి కోడిని పట్టి గరిడీలోనికి దిగారు. సరదాగా వేసిన తొలి పందెంలో నాయకురాలి పుంజు నల్లమల్లు ఓటమిపాలై మరణించింది. విజయం బ్రహ్మన్నదే. ఇప్పుడే అసలు పందెం మొదలైంది. మలిపందెంలో ఎవరు ఓడినా ధన ధాన్య వస్తువాహనాలు, మణిమయకేశిక మందిరాలు ,అంతఃపురాలు, నివాస సౌధాలు విడిచి యేలేశ్వరం రేవుద్వారా కృష్ణానదిని దాటి ఏడేండ్లు పరాయి ప్రాంతంలో వన్య జీవనం సాగించాలని నిబంధనలు పెట్టుకున్నారు. రెండు రాజ్యాలకు కావలసిన వాడైన అలరాజును కోడిపోరుకు న్యాయనిర్ణేతగా ఎంచుకున్నారు(28). అయితే ఈ దఫా పందెంలో కూడా బ్రహ్మన్న తొలిపోరులో గెలిచిన చిట్టి మల్లునే ప్రయోగించడానికి సిద్ధమయ్యాడు. మొదటి పోరులో తన నల్లమల్లు మృతి చెందడంతో నాయకురాలు సివంగిడేగ అనే పుంజును  సిద్ధం చేసింది. బ్రహ్మన్న కోడిపట్టే వానిగా తిరిగి గోపన్నే ఎంపిక కాగా, పందాలలో, కోడి ప్రయోగంలో ఆరితేరిన మువ్వల భీముడిని నాయకురాలు గరిడీలోకి దింపింది. ఈ సందర్భంలో చెవుల గోపన్న తెలిపిన కోడిపోరు

సాంప్రదాయాలను బ్రహ్మన్న పెడ చెవిన పెట్టడమే ఓటమికి మూలం. ఒకమారు పందెంలో పోరిన పుంజును వెంటనే జరిగే పోరుకు దింపకూడదన్న ఆచారాన్ని వల్లెవేస్తూ గోపన్న ఎంత ప్రాధేయపడినా బ్రహ్మన్న వినక పోవడం వల్లనే పరాజయాన్ని మూటగట్టుకో వలసి వచ్చింది. తొలిపోరులో పోరి అలసిన బ్రహ్మన్న పుంజును కొత్తగా ఉత్సాహంగా దిగిన నాయకురాలి పుంజు ఓడించడం విజ్ఞులెవరికైనా అతిశయోక్తి అనిపించదు. ఈ సందర్భంలో నాయకురాలు మంత్రాక్షితలు చల్లించిందని, పుంజుకు చేత బడి చేయించిందని ఓటమిని జీర్ణించుకోలేని బ్రహ్మన్న , కన్నమదాసు ఆరోపణలు చేశారు. గొడవ ముదిరి యుద్ధానికి దారితీసింది. మధ్యవర్తిగా యుద్ధాన్ని వారించిన అలరాజు గురజాల వారిదే విజయమని ప్రకటించాడు. పోరు మధ్యలో చిట్టిమల్లు గరడీ నుండి పారిపోయే ప్రయత్నం చేసినపుడు ఖడ్గంతో కోడిని గరిడీలోకి అదిలించి అనుచితంగా ప్రవర్తించిన కన్నమదాసును అలరాజు మందలించడం బ్రహ్మన్న వర్గం వారి విచ్చలవిడి తనానికి నిదర్శనం. తాము విజయం సాధిస్తే న్యాయమని, వైరి వర్గాలు గెలిస్తే అక్రమంగా గెలిచారని గొంతెత్తడం బ్రహ్మనాదులకు అలవాటని ఈ సంఘటన తేటతెల్లం చేస్తుంది. అవమానాన్ని తట్టుకోలేని గోపన్న ఆరెజోగన్నను తనను చంపమని ప్రాథేయపడి అతని చేతిలో మరణం పొందుతాడు.

## నాలుగేండ్లు
## పల్నాటి భూముల్లోని మండాది అడవుల్లోనే వనవాసం

కోడి పోరులో రాజ్యాన్ని కోల్పోయిన బ్రహ్మనాదులు నాలుగేండ్ల పాటు మండాది అడవుల్లోనే కాలం గడిపారు. పల్నాడులోనే ఉంటున్నందుకు నలగామ రాజుకు రోజు 50 (యాభై) కావిళ్ళ పాలు, పెరుగు కప్పంగా చెల్లించారు. తాము కోల్పోయిన భూముల్లో పశువులను, గేదెలను మేపుతున్నందుకు పుల్లరిగా దీనిని పాటించారు. ప్రతి రోజు మండాది అడవుల నుండి పాలు,పెరుగు గురజాలకు చేరేవి. వనవాసానంతరం రాయబారానికి వచ్చిన అలరాజుకు, నలగాముడు, నాయకురాలికి మధ్య జరిగిన సంభాషణల్లో మండాదిలో గడిపిన నాలుగేళ్ళ కాలం ముఖ్య భూమిక అవుతుంది. పశువులను మళ్ళించిన సందర్భంగా జరిగిన యుద్ధానంతరం మలిదేవాదులు, బ్రహ్మన్న రాజ్యాన్ని వదలి కృష్ణానది దాటి వనవాసానికి వెళతారు. ఈ సందర్భాన్ని బేరీజు వేసి చూసినపుడు బ్రహ్మన్నలో పెద్దరికం ప్రశ్నార్థకంగా గోచరిస్తుంది. కోడిపోరు ప్రతిపాదన

తనే చేశాడు. పందెంలో పోరిన కోడినే తిరిగి పందెంలో ప్రయోగించమంటాడు. ఓటమి చవి చూసిన తర్వాత మంత్రాలు, మాయలు, చేతబడులు, అక్షింతలంటూ నానా యాగీ చేస్తాడు. తీరా మధ్యవర్తి తనవాడు, బలాఢ్యుడైన అలరాజు, అవసరం అయితే తనపైనే తిరగబడతాడని భావించి అతని తీర్పుని అనుసరించి అపజయాన్ని అంగీకరిస్తాడు. పందెం నిబంధనల అమల్లో కూడా బ్రహ్మన్న మాటపై నిలబడలేదని గ్రహించవచ్చు. పందెం ప్రారంభంలోనే స్పష్టంగా ఓడిన వారు రాజ్యాన్ని వదిలి యేలేశ్వరం రేవు ద్వారా కృష్ణానది దాటి ఏడేండ్లు వనవాసం చేయాలని ఇరుదేశాల రాజులు చేసుకున్న ఒప్పందాన్ని తుంగలో తొక్కి నాలుగేళ్ళ పాటు మండాది అడవుల్లోనే తలదాచుకోవడం బ్రహ్మన్న బాస తప్పిన వైనాన్ని వెల్లడిస్తుంది. అదేమంటే పుల్లరి కట్టామంటారు. ఇదెట్లా వనవాసం అవుతుందని నలగాముడు, నాయకురాలితో పాటు చరిత్రకారులు కూడా ప్రశ్నించారు.

## మంద పోరులో ఒంటరిని చేసి పల్నీడును మట్టు పెట్టిన కన్నమ దండుబలం

క్రమం తప్పకుండా కొంత కాలం చెల్లించిన పుల్లరిని తదుపరి కట్టడం మానివేశారు. పుల్లరికోసం నలగాముని నుండి సమాచారం అందుకొని కూడా విస్మరించారు. ఈ సందర్భంగా నలగామరాజు మంత్రి నాయకురాలితో సంప్రదించి బ్రహ్మనాయుని పశువులను,గొఱ్ఱెలను మళ్ళించాలనే నిర్ణయానికొస్తారు. ఈ పనిని అత్యంత బలశాలి,పరాక్రముడు వీధుల పల్నీడుకు అప్పగిస్తారు. పల్నీడు ఒంటరిగా బయలుదేరి మండాది అడవులకు చేరి మేతలో ఉన్న పశువులను మళ్ళించే ప్రయత్నం చేస్తాడు. పశువుల మందకు కాపలాగా ఉన్న బ్రహ్మనాయుని అనుచరుడు లంకన్నకు పల్నీడు విషయమంతా వివరించినా ససేమిరా అంటూ తిరస్కరిస్తాడు. ఈ క్రమంలో పల్నీడు ప్రయత్నం బలప్రయోగంగా మారుతుంది. పల్నీడుపై తిరగబడ్డ లంకన్న ప్రాణాలు పోగొట్టుకుంటాడు. అడ్డు వచ్చిన లంకన్నను హతమార్చి మందను తోలుకుని చంద్రవంక దాటి ఆవలి ఒడ్డునగల గురజాల రాజ్యంలోకి చేరాడు. పల్నీడు పశువుల మంద మళ్ళించుకు పోతున్నాడన్న వార్త తెలుసుకున్న బ్రహ్మనాయుడు పురమాయించిన మేరకు కన్నమదాసు బలగాలతో వచ్చి పల్నీడును ఎదుర్కొంటాడు. ఒంటరి వాడైన

పల్నీడుపై దండుపోరు జరిపి కన్నమ అతనిని వధిస్తాడు. యుద్ధ ధర్మం కాలరాచి మహాభారత గాథలో పద్మవ్యూహం ఏర్పాటు చేసి కౌరవులు అభిమన్యుని మట్టుబెట్టినట్లు కన్నమ నాయకత్వంలో అనేక మంది జట్టుగా పల్నీడుపై మూకుమ్మడిగా తలపడి హతమార్చుతారు. ఈ సంఘటన బ్రహ్మనాయుడు, కన్నమ దాసుల కుటిల యుద్ధనీతికి నిదర్శనంగా నిలిచిపోయింది. ఈ గోవుల మళ్ళింపు సంఘటనను మందపోరుగా పేర్కొంటారు.

## అనుగురాజును హతమార్చిన విషయాన్ని బ్రహ్మన్నతో ప్రస్తావించిన పెదమలిదేవుడు

మందపోరు జరిగిన అనంతరం కోపోద్రిక్తుడైన బ్రహ్మనాయుడు గురజాలను భస్మీపటలం చేస్తానని ఒంటరిగా బయలు దేరుతాడు. ఇదే విషయాన్ని పెదమలిదేవునికి చెపుతాడు. ఈ సందర్భంలో పెదమలిదేవుడు తీవ్ర మనస్తాపానికి లోనవుతాడు. ఉద్విగ్నతకు గురైన పెదమలిదేవుడు బ్రహ్మన్నతో తన మనోగతంలో ఉన్న గతాన్ని ఏకరువు పెడతాడు. మనోవేదనంతా విప్పి చెపుతాడు(29). ఓ బ్రహ్మనాయుడా నీ చేత అలనాడు నా తండ్రి చనిపోయాడు. నీటముంచినా,పాలముంచినా నీదే భారం అంటాడు. దీనిని బట్టి అనుగురాజును బ్రహ్మన్నే హతమార్చాడన్న విషయాన్ని పెదమలిదేవాదులు కూడా నమ్ముతున్నట్లు విశదమవుతుంది. అదే విధంగా వీర విద్యలదేవికూడా గురజాలపై దండయాత్ర సాగించవద్దని బ్రహ్మన్నను అనునయిస్తుంది. ఒకరకంగా ప్రాధేయపడుతుంది. “ అందరూ అనుగురాజు సంతానమే. నీవు అందరిని సమానంగా చూడాలి. ఒకరు ఎక్కువ,మరొకరు తక్కువ కాదు. ఎవరికి కష్టం కలిగినా అనుగురాజు ఆత్మ శోకిస్తుంది”. అని వీరవిద్యలదేవి ఈ సందర్భంలో బ్రహ్మనాయుడితో అంటుంది. పై సంగతులను విశ్లేషించుకుంటే గురజాల,మాచర్ల రాజుల మధ్య అంతర్లీనంగా ఒకరిపై ఒకరికి ప్రేమలు బలంగా పెనవేసుకున్నట్లు తెలుసుకుంటాము. యుద్ధం జరుగుతున్న సందర్భంలో తన పిన్నమ్మ కుమారుడు నరసింగరాజు శిరస్సును బాలచంద్రుడు తెచ్చినప్పుడు ఆ సంఘటనకు కలత చెంది పెదమలిదేవుడు ఆత్మహత్యచేసుకున్న వైనం కూడా పైన చెప్పుకున్న అన్నదమ్ముల మధ్య గల ప్రేమానురాగాలను బలపరుస్తుంది.

## రాయబారిగా క్షత్రియుడు అలరాజు -
## కీడు శంకించిన కొమ్మరాజు

పశువుల మంద మళ్ళింపు సందర్భంగా జరిగిన యుద్ధానంతరం బ్రహ్మనాదులు యేలేశ్వరం వద్ద  కృష్ణానది  రేవు దాటి వనవాసాలకు పయనమయ్యారు. కృష్ణా నది దాటుతున్న సమయంలో పడవలో ఉన్న బ్రహ్మన్న కాలును మొసలి పడుతుంది. ఈ తరుణంలో అలరాజు నదిలోకి దూకి తన ఖడ్గంతో మొసలిని సంహరించి బ్రహ్మన్నను రక్షిస్తాడు. కృష్ణానది దాటి వనాలకేగిన బ్రహ్మనాదులు శ్రీశైలం అడవుల్లో మూడేళ్ళ పాటు నివాసం చేశారు. అనంతరం కోల్పోయిన రాజ్యంకోసం ముందుగా రాయబారం నడపాలని బ్రహ్మన్న ఆలోచన. రాయబారానికి సాంప్రదాయానుసారం బ్రాహ్మణుడినో, భట్రాజునో మాత్రమే పంపాలి. ఈ సాంప్రదాయానికి భిన్నంగా వ్యూహమో,కుట్రో అర్థంకాని రీతిలో రాయబారిగా అలరాజును ఎంపిక చేస్తాడు. తన పుర్రెలో పుట్టిన సరికొత్త ఆచారాన్ని అలరాజు తండ్రి కొమ్మరాజు చెవిలో వేస్తే ఆయన ఆ ప్రణాళికకు బిత్తరపోతాడు. కొమ్మరాజు కూడా సహజ సాంప్రదాయాలను బ్రహ్మన్న ఎదుట ఏకరువు పెట్టి క్షత్రియరాయబారం సాంప్రదాయ వ్యతిరేకమని వెల్లడిస్తాడు.  ఈ సందర్భంలో బ్రహ్మనాయుడు ముందుగా అల్లుకున్న తన వాదనను కొమ్మరాజుకు వినిపిస్తాడు. ఇరురాజ్యాల వారికి అలరాజు రాయబారం సమ్మతంగా ఉంటుందని, నలగామునికి అల్లుడు, మనపక్షానికి ఆప్తుడు ఐన సందర్భంగా ఆయన్ను దూతగా పంపితే ఫలితం లభిస్తుందని నచ్చజెబుతాడు. కాగా బ్రహ్మన్న వ్యూహాన్ని అనంగీకారంగానే తను ఆందోళన చెందుతున్నట్లుగా కొమ్మరాజు చెప్తాడు.ఒక్కగానొక్క కుమారుడు, ఆవేశపరుడు,మాటకు కట్టుబడే వ్యక్తి,పౌరుషం మూర్తీభవించిన యువకుడు రాయబారంలో మాటా మాటా పెరిగి యుద్ధానికి దారి తీస్తుందేమోనని కొమ్మరాజు భయాన్ని వ్యక్తం చేస్తాడు.ఇందుకు బ్రహ్మనాయుడు కొమ్మరాజును అనునయిస్తూ నీ కుమారుడు అలరాజుకు ఏ ఆపద జరగినా, నాకుమారుడు బాలచంద్రుడికి జరిగినట్లేనని చెపుతూ, బాలచంద్రుని నీకుమారుడిగా భావించాలని బుజ్జగించి అలరాజును రాయబారిగా పంపించటానికి ఒప్పిస్తాడు.అలరాజుకు రక్షణగా తన మానస పుత్రుడు కన్నమ దాసును పంపుతానని ధైర్యం చెప్పి కొమ్మ రాజును కుదుట పరుస్తాడు.

## అలరాజుపై బ్రహ్మనాయుడి ద్వేషాన్ని నిరూపణ చేసే "పిచ్చిగుంటల" వారి పాట

వీర గాథల గానమే వృత్తిగా జీవనం సాగించే వర్ణం పిచ్చిగుంటల వారు. వీరు తెలుగు నేలకు చెందిన వీరగాథలను గానం చేస్తారు. సైరా! చిన్నపరెడ్డి,ఉయ్యాలవాడ నరసింహరెడ్డి,గుర్రాల గోపిరెడ్డి,కాటమరాజు,సర్వాయి పాపడు,పల్నాటి వీరచరిత్రతో పాటు అనేక చారిత్రిక వీరగాథలను గానం చేస్తూ పొట్టపోసుకుంటారు.రాయబారానికి అలరాజును పంపుతున్నానని చెప్పి సమ్మతి కోరేందుకు వచ్చిన బ్రహ్మనాయుడితో అలరాజు తల్లి చెల్లమదేవి జరిపిన సంభాషణను పిచ్చిగుంటల వారు తమ గానంలో ఈ విధంగా వినిపిస్తారు. ఈ వాక్యాల ఆధారంగా భావాన్ని అర్థం చేసుకుంటే అలరాజు పట్ల బ్రహ్మన్న ద్వేషంతో ఉన్నాడని వెల్లడవుతుంది(30). లోతుగా పరిశీలన జరిపితే బ్రహ్మన్నే అలరాజును కుట్రతో కడతేర్చాడని రూఢి పరుచుంటాము. ఇదే విషయాన్ని 1862లో ముదిగొండ వీరభద్రకవి తన "వీరభాగవతము" లో బయల్పరిచారు.

*పిచ్చిగుంటలవారు పాడే పాట ఈ విధంగా ఉంటుంది.*

**చెల్లమ్మ:** *ఓయన్న ! నాయుడా ! ఓ నీలివర్ణ*
*కపట నాటక సూత్రధారీ ! ఓ కార్యవేది*
*కపట బుద్ధులు నీకు ఏల ! నాయుడా బ్రహ్మ*
*నీవు పొమ్మన్న వారికి పోకడే నిజము*
*నీవు రమ్మన్న వారికి రాకడే నిజము*
*నీ కుమారుని పోయి రమ్మంటివి ! నాయుడా*
*నా కుమారుని పోమ్మంటివి ! ఓ బ్రహ్మనా*
*నాకుమారుని చంప న్యాయమా ! నాయుడా బ్రహ్మ*

బ్రహ్మన్న,చెల్లమ్మతో సంభాషిస్తున్న సమయంలోనే అలరాజు,కన్నమదాసు అక్కడకు ప్రవేశిస్తారు. ఈ సందర్భంలో బ్రహ్మన్న కన్నమదాసు పోయిరమ్మన్న సమయంలోనే అలరాజుని వెళ్ళమని చెబుతాడు. ఈ మాటల మర్మాన్ని చెల్లమ్మ ఈ పాట ద్వారా విప్పిచెబుతుంది. అలరాజు పట్ల బ్రహ్మనాయుని వైఖరిని చెల్లమ్మ ఆందోళనతో పై విధందా వెల్లడిస్తుంది. నెల్లూరు జిల్లాలో లభించిన **"అలరాజమల్లు గురజాల రాయబారము"** అనే గ్రంథం కూడా అలరాజును బ్రహ్మనాయుడే కుట్రతో

హతమార్చాడని స్పష్టం చేస్తుంది. పిచ్చిగుంటలవారి వీరగాథాగానం నేటికీ వంశ పారంపర్యంగా కొనసాగుతునే ఉంది.

## కలిసిబయలుదేరిన 'కన్నమ' ఏమయ్యాడు? 'అల'హత్యాప్రణాళిక అమలుకే మార్గం తప్పించాడా?

రాయబారిగా అలరాజును పంపేందుకు అతని తల్లి చెల్లమ్మను, తండ్రి కొమ్మరాజును ఒప్పించాడు బ్రహ్మనాయుడు. ఈ అంశాన్ని నడిచిన కథలో చెప్పుకున్నాము. వారి సందేహ విచారాలకు సంతృప్తికర సమాధానాలు చెప్పి, బుజ్జగించి మొత్తం మీద వారి భయానికి తెరదించి నమ్మించగలిగాడు. అలరాజుకు రక్షణగా తను పుత్రుడుగా భావిస్తున్న కన్నమదాసును తోడుగా పంపుతానన్న బ్రహ్మనాయుడి వాగ్దానం మేరకు అలరాజు, కన్నమదాసు మేడపి నుండి గురజాలకు బయలుదేరారు. మేడపి నుండి బయలుదేరిన కన్నమదాసు నడవడిపై అనుమానపు ఛాయలు కమ్ముకుంటాయి. కన్నమదాసు దారితప్పడం అలరాజు హత్యకు బ్రహ్మనాయుడి కుట్రను బలపరుస్తుంది. పల్నాడు చరిత్రపై కలం పట్టిన ఏ రచయిత, కవీ అలరాజుతో కలిసి బయలుదేరిన కన్నమ గురజాల వరకు ప్రయాణించినట్లు చెప్పలేదు. గురజాల మార్గంలో ఉధృతి తగ్గిన పిదప వెళదామని లేడివాగు వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అలరాజును బాలచంద్రుడు వచ్చి కలుస్తాడు. ఈ సందర్భంలో కన్నమదాసు ఎక్కడ వున్నాడో, ఏమైనాడో ఎవరూ పొందుపరచలేదు. అప్పుడే కదా! పందెంలో అలరాజు వద్ద నున్న తులసిమాలను (వనమాల) బాలచంద్రుడు గెలిచి తీసుకెళ్ళింది. కన్నమదాసు అలరాజును విడిచి వెళ్ళడానికి సహేతుక కారణం లేకపోవడాన్ని కుట్రకు భూమికగా చెప్పవచ్చు. తులసిమాల ఉదంతం ఈ అనుమానాలను మరింత దృఢపరుస్తుంది. మేడపినుండి బయలుదేరిన కన్నమదాసు మధ్యలో మాయమై అలరాజు గురజాల చేరుకునేసరికి అక్కడకు చేరుతాడు. ఈ మధ్యకాలమంతా కన్నమ వెలగబెట్టిన రాచకార్యం ఏమిటో? లోతుగా అన్వేషిస్తే హత్యకు పథకం సిద్ధం చేసి వచ్చాడని ఖచ్చితమైన అభిప్రాయం కులుగుతుంది. పథకం నిర్ధారించేందుకు తదుపరి జరిగిన పరిణామాలు కూడా ఉపకరిస్తాయి. ఏ పుష్పగుచ్ఛాన్నైతే వాసన చూసి అలరాజు మరణించాడో దానిని తీసుకువచ్చి అలరాజుకిచ్చింది కన్నమదాసు కావడం విశేషం. ఈ పుష్పగుచ్ఛాన్ని తంబళ్ళపెద్ది తనకిచ్చాడని కన్నమ చెప్పాడు. అలరాజు మృతి అనంతరం తంబళ్ళ

పెద్దుకూడా మరణించాడని కథనం. అయితే తంబళ్ళ పెద్దుని ఎవరు చంపారు? సాక్ష్యాన్ని ఎవరు పాతిపెట్టారు? ఎవరు మాఫీ చేశారు? ఆ అవసరం ఎవరికి ఉందో ఆలోచిద్దాం? అంచనాకడదాం? పుష్పగుచ్ఛం తెచ్చి యిచ్చింది కన్నమదాసు, పెద్దు దగ్గర తెచ్చానని చెప్పాడు. తంబళ్ళపెద్దు బ్రతికి ఉంటే నిజం వెలుగులోకి వస్తుంది. అందుకే సాక్ష్యం మరణం మాటున కప్పి పెట్టాడు. పెద్దు బ్రతికి ఉంటే అతని సాక్ష్యంతో కన్నమ దోషిగా నిలబడతాడు. అతని కుటిలత్వం వెలుగులోకి వసుస్తుంది. తనను చుట్టు ముట్టే ఈ హత్యను నాయకురాలు, నరసింగరాజు మీదకు మళ్ళించేందుకు తంబళ్ళ పెద్దును మట్టుపెట్టి తన కేమీ తెలియనట్లు, తనేమీ ఎరగనట్లు గురజాల వచ్చి నాయకురాలు, నరసింగరాజు కలసి అలరాజును హతమార్చారని అమాయకురాలైన పెరిందేవితో చెప్పి నమ్మించి ఆమెను భర్త అలరాజు వద్దకు తీసుకెళ్ళాడు. అయితే గురజాల రాజ్యంలో మరొకరు నమ్మకపోవడం కన్నమదాసు ఆరోపణల్లో నిజంలేదని తేట తెల్లమౌతుంది. అలరాజును బ్రహ్మనాయుడే కుట్రతో అంతంజేశాడని ప్రమాణాలు బలపరుస్తున్నాయి.

## తులసి మాలను తప్పించిన బాలచంద్రుడు

అలరాజు రాయబారిగా వెళ్ళడం గురించి తండ్రి కొమ్మరాజుతో పాటు తల్లి చెల్లమ్మకూడా ఆందోళనపడింది. బ్రహ్మనాయునితో అలరాజుకున్న పాత పగలు ఆమె వల్లెవేసుకుని ఇదో కుట్రగా భావించింది. బ్రహ్మనాయునితో బయటకు వెల్లడించ కుండానే లోలోన తీవ్ర ఆందోళన చెందింది.అయితే చెల్లమ్మకు కూడా నమ్మదగిన మాటలు చెప్పిన బ్రహ్మన్న, మహత్తు కలిగినదంటూ ఒక తులసి మాలను తెచ్చి అలరాజు మెడలో వేసి ఈ మాల అలరాజుతో ఉన్నంత కాలం అలరాజుకేమీ కాదని నమ్మబలికాడు. అంతే గాక అలరాజుకు తోడుగా తను పెద్దకుమారుడుగా భావిస్తున్న కన్నమదాసును రక్షణగా పంపుతున్నట్లు ఆమెకు ధైర్యం చెప్పాడు. నమ్మకాలు, మహాత్మ్యాలను మిక్కుటంగా నమ్మే చెల్లమ్మ అనుమానిస్తూనే అలరాజును రాయబారిగా అంగీకరించింది. రాయబారానంతరం ఆతిథ్యం స్వీకరించకుండా గురజాల నుండి రావాలనే బ్రహ్మనాయుడి ఆజ్ఞ మేరకు చర్ల గుడిపాడులో విడిది చేయాలి. అయితే విడిది ఏర్పాట్లనే నెపంతో కన్నమదాసు ముందుగానే చర్లగుడిపాడు చేరి ఏ ఏర్పాట్లు చేశాడో ఏమో? అలరాజు గురజాల చేరే సమయానికి అక్కడ ప్రత్యక్ష మౌతాడు. ఈ

లోగా పెద్ద తతంగమే జరుగుతుంది. అలరాజు గురజాల వచ్చే మార్గంలో ఉన్న లేడివాగు దాటాలి. ఆ వాగు పొంగిపొరలుతున్న సందర్భంగా తన అశ్వాన్ని అక్కడే నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ లోగా బ్రహ్మనాయుని సూచన మేరకు వచ్చిన బాలచంద్రుడు అలరాజుతో సరదా సంభాషణ ప్రారంభించి అశ్వాలతో వాగును దూకే పందెమునకు ఉసిగొల్పాడు. (31) ఓడిన వారు వంటిపై ఉన్న నగలన్నీ ఒలిచి ఇవ్వాలి అనే నిబంధన పెట్టాడు. పౌరుషానికి మారుపేరైన అలరాజు పందెమునకు అంగీకరించి మొదటగా తనే గుఱ్ఱాన్ని దూకించగా గుఱ్ఱం వేనుక కాళ్ళు నీళ్ళలో నిలిచాయి. బాలచంద్రుని గుఱ్ఱం ఆవలి ఒడ్డుకు దూకగా అలరాజు తన ఓటమిని అంగీకరించి ఒంటిపై ఉన్న నగలన్నీ బాలచంద్రునికి ఇచ్చాడు.ఇందులో మహత్తు గలిగినదని చెప్పుకుంటున్న తులసి మాలను తప్పించిన బాలచంద్రుడు సరదాకి ఆడిన పందెంగా చెబుతూ అనుమానం రాకుండా మిగిలిన నగలన్నీ అలరాజుకు ఇచ్చివేస్తాడు. ఈ మాలను తీసుకువెళ్ళి బ్రహ్మనాయునికివ్వగా బ్రహ్మన్న మిక్కిలి సంతోషిస్తాడు. లోలోపల ఆనందిస్తాడు. అనంతరం అలరాజు గురజాల చేరి రాయబారిగా మలిదేవాదుల రాజ్యాన్ని తిరిగి ఇవ్వమని కోరతాడు.

## ఫలించని అలరాజు రాయబారం - వాదోపవాదాలు

మలిదేవాదుల దూతగా, బ్రహ్మనాయుడు పంపగా వచ్చిన అలరాజు అల్లుని మర్యాదలు కూడా స్వీకరించకుండా సూటిగా సంధి నిబంధనలను వల్లెవేశాడు. కోడిపోరు నిబంధనల ప్రకారం మలిదేవాదులు ఏడు సంవత్సరాల పాటు రాజ్యాన్ని వదలి వనవాసం పూర్తిచేసినందున వారి రాజ్యభాగాన్ని వారికే ఇచ్చి వేయాలని కోరాడు. నిండుకొలువులో అలరాజు దౌత్యాన్ని ఆలకించిన నలగాముడు సమాధానమిస్తూ వారి రాజ్యమనే విషయాన్ని అంగీకరించలేదు. మలిదేవాదులది దాయభాగం కాదు దయాభాగమని తెలిపాడు. ఈ సందర్భంగా నాయకురాలు నాగమ్మ జోక్యంచేసుకుంటూ పల్నాడు మైలమదేవికి తండ్రి అరణంగా ఇచ్చిన పుట్టింటి ఆస్తి అని, మైలమదేవి పుట్టింటి ఆస్తిపై ఆమె సంతానానికి మాత్రమే హక్కు అన్న విషయం దూత ఐన అలరాజును పంపిన పెద్దమనిషి బ్రహ్మన్నకు తెలియనిది కాదని చెప్పింది. అంతేగాక కోడిపోరు నిబంధనలను తుంగలో తొక్కి ఏడేళ్ళ వనవాసానికిగాను నాలుగేళ్ళ పాటు పల్నాడులోని మండాది అడవుల్లో తలదాచుకున్న సంగతి గుర్తు చేసింది. నాలుగేళ్ళు

పల్నాడులోనే ఉండి పశువులను ,గొఱ్ఱెలను మేపుకున్నందుకు పుల్లరిగా రోజుకు యాభై కావిళ్ళ పాలు ,పెరుగు పంపిన సంగతిని గుర్తుచేస్తూ ఏడేళ్ళు వనవాసం చేసే పద్ధతి ఇదేనా అని ప్రశ్నించింది. మరో నాలుగేళ్ళు వనవాసం పూర్తి చేయాల్సి ఉందని స్పష్టం చేసింది. ఈ చర్చకు సమాధాన మిస్తూ ఏదో ఒక విధంగా పూర్తిచేశారు గదా? వాళ్ళ రాజ్యం వారికి ఇవ్వాల్సిందేనని అలరాజు నొక్కి చెప్పాడు. నలగాముడు జోక్యం చేసుకుని ఆనాడు అంతర్గత యుద్ధాన్ని నిలువరించేందుకే మాకు పూర్తి హక్కు గల పల్నాడులో సవతి తల్లి సంతానానికి దయా భాగాన్ని ఇచ్చామని తెలుపుతూ, నిబంధనల ప్రకారం వనవాసం పూర్తిచేస్తేనే వారి రాజ్యం వారికి ఇస్తామని తేల్చి చెప్పాడు. ఈ సమాధానానికి ఆగ్రహించిన అలరాజు ఆవేశకావేషాలతో ఇక యుద్ధం తప్పదని ప్రకటించాడు. నలగాముడు, నాయకురాలు కూడా యుద్ధానికి వేనుకాడేది లేదని బదులిచ్చారు. ఈ సందర్భంగా అక్కడే కొలువులో ఖడ్గాన్ని ఎత్తి రణరంగాన్ని సృష్టించబోయిన అలరాజును ఆస్థానంలోని పెద్దలు, పండితులు బుజ్జగించి, నచ్చచెప్పి పంపుతారు. అక్కడి నుండి కన్నమదాసు తోడుగా బయలుదేరి ఆ రాత్రికి బస చేసేందుకు చెర్లగుడిపాడు గ్రామ సరిహద్దుల్లోని విడిది గృహానికి చేరుకుంటారు.

## అలరాజు మృతి - ఇరు దేశాల భిన్న విశ్వాసాలు

సంధి వైఫల్యం తరువాత బ్రహ్మనాయుని ఆజ్ఞమేరకు కన్నమతో కలసి విడిదికై చెర్లగుడిపాడు అతిథి గృహాన్ని చేరతాడు. ఈ సందర్భంలో ఇష్టకామేశ్వరి దేవాలయ పూజారి తంబళ్ళ పెద్దు ఇచ్చినట్లుగా చెబుతున్న ఒక పుష్పగుచ్ఛాన్ని కన్నమదాసు తెచ్చి పరిమళాన్ని ఆస్వాదించవలసిందిగా అలరాజుకిస్తాడు. ఈ పుష్పగుచ్ఛాన్ని ఆఘ్రాణించి మైకం కమ్మి పడిపోతాడు. విషపూరితమైన పుష్పగుచ్ఛ ఆస్వాదన వల్లే తనకు ఈ విధంగా జరిగిందని, తను మరణానికి చేరువయ్యానని గ్రహించిన అలరాజు గురజాల వెళ్ళి భార్య పేరమ్మను తోడ్కొని రావాలని కన్నమదాసును కోరతాడు. ఈ మేరకు కన్నమ దాసు గురజాల వెళ్ళి అలరాజు స్థితి గురించి తెలిపి, నాయకురాలు, నలగామరాజు సోదరుడైన నరసింగ రాజుపై నేరంమోపి, వారిని తూలనాడి, పేరమ్మను తీసుకుని చెర్లగుడిపాడు తిరిగి వస్తాడు. ఈ లోగా ఏమి జరిగిందో ఏమో తంబళ్ళపెద్దు విడిది గృహానికి కొద్ది దూరంలో పడి మరణించి ఉన్నాడు. పేరమ్మకు ఆఖరి చూపులిచ్చి అలరాజు మృతిచెందగా శవాన్ని, పేరమ్మను తీసుకుని కన్నమదాసు బ్రహ్మనాయుడున్న

మేడపి గ్రామానికి చేరతాడు. నాయకురాలి వ్యూహంతో నరసింగరాజు ఈ దారుణానికి ఒడిగట్టాడని కన్నమాదులు మేడపిలో ప్రచారం చేసి అక్కడి ప్రజలను నమ్మించగా, బ్రహ్మనాయుడే పథకం ప్రకారం అలరాజును హత్యచేయించాడని గురజాల రాజ్యంలో విశ్వసించారు. అలరాజుకు బ్రహ్మన్న అన్న బాదరాజుతో పూర్వం ఉన్న గొడవ సందర్భంగా తన మాట వినలేదనే కక్షతో బ్రహ్మన్న అలరాజును చడీ చప్పుడు లేకుండా హతమార్చి నాయకురాలు, నరసింగరాజులపై మోపాడని గురజాల ప్రజలు నమ్మారు. నిరూపణకు గానీ, నిజనిర్ధారణకు గానీ, విచారణకు గానీ సమయమివ్వకుండా, నిజానిజాలు పరిశీలన జరిగితే వాస్తవం ఎక్కడ బయట పడుతుందోనని ఆందోళనకు గురైన బ్రహ్మనాయుడు ఉన్నపళంగా అలరాజు మృతదేహానికి అంత్యక్రియలు జరిపించి క్షణమాగకుండా యుద్ధ ప్రకటన చేశాడు. అలరాజుతో పాటు చితిలో పేరమ్మ సహగమనం చేసింది. కాగా ఎంత గగ్గోలు పెట్టి, ఎంత దుష్ప్రచారం చేసినా బ్రహ్మనాదులు అలరాజు మరణానికి నాయకురాలు, నరసింగరాజే కారణమని నలగామరాజును నమ్మించ లేక పోవడంతో నిజమేమిటో బోధపడుతుంది(32).

## అచంచలం, అనూహ్యం నాయకురాలి మనో ధైర్యం

నాయకురాలు మేధస్సులో, వ్యూహంలోనే గాక మనోధైర్యంలో కూడా మేరునగమే. కొండలను పిండిచేయగల ఆత్మవిశ్వాసం. అనేక సంక్షుభిత సందర్భాలను ఆమె మొక్కవోని సాహసంతో ఎదుర్కొన్న తీరు అనూహ్యం అని పిస్తుంది. రాజ ప్రసాదంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పరచుకున్న బ్రహ్మనాయుడి 12 మంది బంధుగణం అక్రమంగా దాచిన రాజసంపదను మంత్రి పదవి చేపట్టిన కొన్ని ఘడియల్లోనే తిరిగి ఖజానాకు చేర్చిన సాహసోపేత చర్య నాయకురాలి గుండె బలాన్ని తెలుపుతుంది. రాచమల్లు అలరాజు రాయబార సందర్భంలో బ్రహ్మనాదులు రాజ్యాన్ని విడిచి చేసిన వనవాసంలోని లోటుపాట్లను వెల్లడించి ప్రభుభక్తిని చాటుకునే క్రమం అనిర్వచనీయం. రాయబారం విఫలమైతే సంభవించే పరిణామాలను తేలికగా తీసుకుని ఆమె చేసిన నిస్సంకోచ వాదన ఆమె ఆత్మ విశ్వాసాన్ని ప్రదర్శిస్తుంది. అలరాజు రాయబారం వైఫల్యంతో అన్నదమ్ముల మధ్య సంభవించే యుద్ధాన్ని తలచుకుని మొత్తం కుటుంబానికే పెద్దన్నగా నలగాముడు విచారంలో తలమునకలైనపుడు నాయకురాలు పలికిన ధైర్య వచనాలు పరిణతి చెందిన ఆమె ఆత్మ విశ్వాసానికి తార్కాణం. శ్రీనాధుని పల్నాటి వీర చరిత్రలోని ఈ ద్విపదల వల్ల పైవిషయాలు బోధపడతాయి.

నీ బలిమి కలుములు నీ వెరుగలేవు – ఇంద్రుడైనను నిన్ను ఎదిరించగలడె?
నీవు రాబని లేదు నిఖిలేశ ఇపుడు – నన్ను బలము పంపు నాయుని గెలిచి
మలిదేవరాజును మరల మేడపిన – పరువిడ చేత నా పంతంబుజూడ.

అంతే కాక కార్యమపూడి యుద్ధరంగంలో బ్రహ్మనాయుడిపైనే కాలు దువ్విన తీరు కూడా ఎనలేని ఆమె ధైర్య సాహసాలను వెల్లడిస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రణభూమిలోనే ఉంటూ ఎప్పటికప్పుడు వ్యూహాన్ని మార్చుకుంటూ బ్రహ్మన్న సైన్యాన్ని, వీరులను మట్టుపెట్టి విజయాన్ని సొంతం చేసుకున్న ధీరోదాత్త నాయకురాలు నాగమ్మ.

## నాయకురాలి చొరవతో పొసగిన సంధి - రెండు నిబంధనలకు అంగీకారం

అలరాజు రాయబారం విఫలమైన అనంతరం బ్రహ్మనాయుడి యుద్ధ ప్రకంపనలతో నాయకురాలికి కూడా పోరుకు తలపడ వలసిన అగత్యమేర్పడింది. వనవాసం నుండి అత్తగారి గ్రామమైన మేడపి చేరిన బ్రహ్మనాదులు యుద్ధానికి అన్ని ప్రయత్నాలు చేసుకుంటున్నారు. కదన రంగానికి వేదికగా నాగులేరు ఒడ్డున గల కార్యమపూడి(కారంపూడి) గ్రామాన్ని ఎంచుకున్నారు. నాయకురాలు కూడా తనతో దౌత్యసంబంధాలు ఉన్న సరిహద్దు రాజులు, ఇతర స్నేహసంబంధాలు గల రాజులకు యుద్ధంలో తమకు సాయం రావాలని, సైన్య సహకారం కావాలని వర్తమానాలు పంపింది(33). శ్రీనాథుని పలనాటి వీర చరిత్ర ద్విపద కావ్యానుసారం నాయకురాలికి అనేక మంది రాజులు సర్వ సైన్యంతో సహకరించి నట్లు బోధపడుతుంది. కాగా ఇరు రాజ్యాల రాజులు నలగాముడు, మలిదేవుడు సైన్య సమేతంగా రణస్థలి కార్యమపూడికి తరలివచ్చారు. నలగాముడు సైన్యాన్ని కొదమగుండ్లలో గుడారాలు వేయించి నిలిపాడు. బ్రహ్మన్న, మలిదేవాదులు యుద్ధభూమికి వస్తూనే పెదమలిదేవుని మైనర్ కుమారుడు బిరుదురాజును రాజుగా, మంత్రిగా బాలచంద్రుడిని నియమించి బయలు దేరారు. కాగా రణరంగానికి ఇరుసైన్యాలు చేరి మోహరించిన సమయంలో వ్యక్తిగతంగా చొరవతీసుకుని నాయకురాలు సంధికి రాయబారం పంపింది. సంధిచేసుకొని రక్తపాతాన్ని నివారించాలనే ఒకే ఒక సంకల్పంతో నాయకురాలు ఈ ఆలోచనకు వచ్చింది. వచ్చిందే తడవుగా నలగాముని వద్ద తన ప్రతిపాదనను పెట్టి ఆయనచే

ఆమోదముద్ర వేయించుకుంది. చింతపల్లికి చెందిన భూస్వామి మేడిగం కోటిరెడ్డి, మాడుగుల వీరారెడ్డి ,ధరణికోట కేతరాజులతో సమరనివారణకు సంధి ప్రయత్నం చేసింది(34). సంధికి వెళ్ళిన రాయబారులతో మాచర్ల వారి రాజ్యం మాచర్ల వారికి ఇవ్వజూపింది. అయితే దూతల ప్రతిపాదనను బ్రహ్మన్న వర్గం తిరస్కరించింది. రాజ్యంతోపాటు, అలరాజును హతమార్చాడని నమ్ముతున్న మేరకు నరసింగరాజును కూడా అప్పగించాలని బ్రహ్మన్న వర్గం అసాధారణ కోరికను కోరింది. ఈ అనూహ్య కోర్కెతో తలతిరిగిన మధ్య వర్తులు తిరిగి నాయకురాలి వద్దకు చేరి బ్రహ్మన్న తరపువారి విడ్డూరమైన కోర్కెను వెల్లడించారు. అయితే అందరి మాదిరి అధైర్యపడకుండా రెండు నిబంధనలకు సమ్మతి తెలపాలని నాయకురాలు నలగామురి కోరింది. కాగా తమ్ముడు నరసింగరాజును అప్పగించడానికి నలగాముడు ససేమిరా అంగీకరించలేదు. కావాలంటే వారికి తాను వశమౌతానని స్పష్టంచేశాడు. ఈ మీమాంసలో నాయకురాలు జోక్యంచేసుకుని లొంగి పోయిన వారిని హతమార్చే హీనులు ఈ లోకంలోనే ఉండరని నరసింగుని ప్రాణానికి తన ప్రాణం అడ్డని ధైర్యం చెప్పి నలగాముని ఒప్పించడంతో పాటు నరసింగరాజు అంగీకారం కూడా తీసుకుంది. బ్రహ్మనాదుల రెండు షరతులను నాయకురాలి వర్గం ఆమోదించడంతో సమర భూమిలో సంధికి మార్గం సుగమమై శాంతి కపోతం రెక్కలు విప్పింది(35).

## వైశ్యకుల వనిత 'అన్నమ్మ' దూషణలతో కర్తవ్యాన్ని తెలుసుకున్న బాలచంద్రుడు

పుత్రప్రేమ బ్రహ్మనాయుడు,ఐతమ్మల వ్యక్తిత్వాలను మరింత కురచపరిచింది. బాల చంద్రునిపై పెంచుకున్న మమకారం దుర్నీతిని బయట పెట్టింది. కారంపూడిలో జరుగుతున్న యుద్ధానికి బాలచంద్రుడు రాకుండా అతనిని మేడపిలో అంతఃపుర రక్షణ సాకుతో ఉంచాడు. ముఖ్యులందరికీ యుద్ధం సంగతిని బాలచంద్రునికి తెలియనీయవద్దని చెప్పుకున్నాడు(36). సైన్యంతో బ్రహ్మన్న మలిదేవాదులతో కూడి కారంపూడికి చేరుకున్నారు. అక్కడ యుద్ధోన్మాదం. మోగటానికి సిద్ధంగా ఉన్న సమర భేరీలు. ఇక్కడ మేడపిలో బాలచంద్రుడు స్నేహితులతో ఆటపాటల్లో, సంతోష సంబరాల్లో నడుస్తున్న రోజులు. ఈ నేపథ్యంలోనే ఒక నాడు స్నేహితులతో కూడి బాల చంద్రుడు పొన్ను బొంగరాల ఆట ఆడుతున్నాడు. అదే సమయంలో కొందరు మహిళలు నీటి

కోసం కడవలతో బావి వద్దకు వచ్చారు. బాల చంద్రుడు విసిరిన బొంగరం అన్నమ్మ అనే వైశ్య స్త్రీకి తగిలి పాదం పైనుండి క్రిందికి దిగబడుతుంది. బొంగరం మేకు దిగబడిన బాధకు ఆమె తల్లడిల్లి పోయింది. అక్కడ రక్తం మడుగు కట్టింది. ఈ సంఘటనకు ఆగ్రహం చెందిన అన్నమ్మ ఉగ్ర రూపం దాల్చి బాలచంద్రునిపై దూషణలకు దిగింది(37). "పందెపు గిత్త మాదిరిగా తెగదిని బలిసి ఉచ్చ నీచాలు మరిచి ప్రవర్తిస్తున్నావు. మాచర్ల రాజులు కానకుండా నీ తండ్రి బ్రహ్మనాయుడు తీసుకొచ్చి ఇక్కడ మేడపిలో దాచే సొమ్ముతో కన్నుమిన్ను కానక పోతున్నావు. నీ తండ్రి, నీ బంధువులు, నీ తోటి వారంతా కారంపూడి యుద్ధానికేగితే, పొగరుబోతువై మేడపిలో రెచ్చిపోతున్నావు. నీవు కూడా వెళ్ళి యుద్ధం చేయి పో" అంటూ అన్నమ్మ తీవ్రంగా మందలించింది. అనూహ్య పదజాలాన్ని ప్రయోగించిన అన్నమ్మ భాషణతో బాల చంద్రుడికి దిమ్మ తిరిగింది. కారంపూడిలో జరుగుతున్న యుద్ధానికి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు ఆటలాపి స్నేహితులతో కలసి యుద్ధభూమికి చేరేందుకు బయలు దేరాడు. ముందుగా తల్లి ఐతమ్మ ఆశీర్వాదం తీసుకోవాలని ఆమెవద్దకు వెళ్ళాడు. "వివాహం అయింది మొదలు ఇంత వరకు మాంచాల మొహం చూడలేదు, ఒక మారు మాంచాల వద్దకు వెళ్ళమని" చెప్పిన తల్లి మాటల మేరకు భార్య వద్దకు చేరాడు. వివాహానికి ముందు తదుపరి కూడా వేశ్య సబ్బాయితోనే గడిపాడు బాలచంద్రుడు. మేడపి నుండి మిత్రబృందంతో యుద్ధానికి బయలు దేరిన బాలచంద్రుని స్నేహితులలో అనపోతు అనే బ్రాహ్మణ యువకుడు కూడా ఉన్నాడు. బ్రాహ్మణుడు యుద్ధంలో మరణిస్తే తనను బ్రహ్మహత్యాపాతకం వేధిస్తుందని భయం చెందిన బాల చంద్రుడు అతనిని ఏ విధంగానైనా యుద్ధానికి రాకుండా నిలువరించాలనుకున్నాడు. మార్గమధ్యంలో త్రిపురాంతకం వద్ద విశ్రాంతికోసం ఆగి అనపోతుతో బాల చద్రుడు తన భార్య మాంచాల వద్ద ముద్దుటుంగరము, ముత్యాల హారము మరచి వచ్చానని అవి తనకు అత్యంత శుభ ప్రదమైనవని మేడపి వెళ్ళి వాటిని తీసుకురావలసిందిగా కోరాడు. అనపోతు వచ్చే వరకు త్రిపురాంతకం వద్ద వేచి ఉంటామని చెప్పాడు. అయితే మేడపి వెళ్ళి మాంచాలను కలిసి విషయం తెలుసుకున్న అనపోతు తిరిగి యుద్ధ భూమికి ప్రయాణమై త్రిపురాంతకం వద్ద స్నేహితులు లేకపోవటం గమనించాడు. అక్కడే బాలచంద్రుడు రావిచెట్టుకు కట్టిన లేఖను చదువుకుని స్థాణువవుతాడు. అందులో అనపోతును యుద్ధానికి రావద్దని వ్రాసి ఉంటుంది. ఇదే సమయంలో యుద్ధ వీరులకు

తినుబండారాలను తెచ్చే మాడచి అనే మహిళ అక్కడకు వచ్చింది. అనపోతు ఈ విషయాన్నంతా వివరించి గురుతులుగా జందెము, కాలిబిరుదము ఆమెకిచ్చి బాలచంద్రునికి అప్పగించమన్నాడు. తనను యుద్ధానికి రావద్దన్న విషయాన్ని తట్టుకోలేని అనపోతు ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. మాడచి కారంపూడి చేరి బాలచంద్రునికి మొత్తం విషయాన్నంతా పూసగుచ్చినట్లు తెలిపింది. అనపోతు జందెము, కాలిబిరుదు బాల చంద్రునికిచ్చింది.

## సంధిని విచ్ఛిన్నం చేసిన బాలచంద్రుని దుడుకు చేష్టలు

నాయకురాలి ప్రయత్నం ఫలించింది. మలిదేవులకు మాచర్ల రాజ్యాన్ని, నరసింగరాజును అప్పగించటానికి అంగీకరించటంతో సంధి కొలిక్కి వచ్చింది. యుద్ధరంగంలో సంధి పొసగితే శత్రు సైన్యాలు సహపంక్తి భోజనాలు చేయటం ఆచారం. రణభూమి కారంపూడిలో అదే జరుగుతుంది. ఇరుసైన్యాలు సహపంక్తికి సిద్ధమయ్యాయి. అప్పుడొచ్చాడు బాలచంద్రుడు. ఈ సందర్భంలో మలిదేవరాజు శిబిరంవద్ద సంధికుదిరిందన్న ఆనందంతో సహపంక్తి భోజనాలు ప్రారంభయ్యాయి. సహపంక్తిలో బాలచంద్రుడు కూడా పాల్గొన్నాడు. పంక్తులుగా విస్తళ్ళలో భోజనాలు వడ్డించారు, నెయ్యి వడ్డన జరుగుతుంది. అప్పుడు వచ్చిన మాడచి అనపోతు ఆత్మహత్య విషయం చెప్పగా ఒక్క సారిగా బాల చంద్రుడు రెచ్చిపోతాడు. అనపోతు జందెము, కాలిబిరుదు చూసి తోకతొక్కిన విషసర్పంలా లేచాడు. మృగతత్వం ఒక్క సారిగా వేయి తలల సరీసృపమైంది. పెద్ద పెద్దగా కేకలు వేస్తూ నాయకురాలిని, నలగామునిని, నరసింగరాజునూ దుషిస్తూ సంధిలేదు గిందిలేదు అంటూ పంక్తిలోని విస్తళ్ళను లాగిపారేశాడు. కొంత మంది ముందున్న విస్తళ్ళను కాళ్ళతో తొక్కివేశాడు. మీరు సంధిచేసుకున్నాసరే శత్రు సైన్యాలపైపడి అందరినీ హతమారుస్తాను. నరసింగరాజు తల నరుక్కొచ్చి కొమ్మరాజుకు కానుకగా ఇస్తాను అంటూ తనకు వడ్డించిన అన్నాన్ని విస్తరితోసహా తీసుకెళ్ళి నాగులేటిలో కలిపి గంగధారి మడుగులో చేతులు శుభ్రపరచుకున్నాడు. ఈ విపరీత పరిణామాలకు రాయబారులతో సహా నాయకురాలి వర్గ వీరులు, సైన్యం విస్తుపోయారు. నాయకురాలిని, నలగాముని దూషించటం సహించ లేక పోయారు. వారు కూడా విస్తళ్ళను తీసుకు వెళ్ళి నాగులేటిలో కలిపారు. యుద్ధానికి సిద్ధమన్నారు. ఈ విధంగా యుద్ధ భూమి కారంపూడిలో పొసగిన సంధి బాలచంద్రుని దుశ్చేష్టలతో విచ్ఛిన్నమైంది(38).

# ధర్మం నాయకురాలి వైపే ఉందన్న బ్రహ్మన్న అనుచరులు"గోసంగులు"

బాలచంద్రుని విపరీత ప్రవర్తనతో సంధి విఫలమైంది. యుద్ధానికి తెర లేచింది. ఇరు సైన్యాలను ఉత్తేజితులను చేస్తున్నారు. ఉత్సాహ భరితమైన ప్రసంగాలతో సైన్య శ్రేణులు ఊగిపోతున్నాయి. విజయమో, వీరస్వర్గమోనంటూ వీరులంతా సన్నద్ధమౌతున్నారు. ఆయుధాలు పదునెక్కుతున్నాయి. వీరుల వరల్లో కత్తులు, ఖడ్గాలు మేల్కొంటున్నాయి. భేరీలు మోగటానికి సిద్ధమయ్యాయి. ఈ సమయంలో బ్రహ్మన్నను పిడుగులాంటి వార్త వచ్చి తాకింది. తనతో పాటు ఉత్తరాది నుండి వచ్చిన అనుచరులు, అనుయాయులైన గోసంగుల(మాదిగలు) నుండి సమాచారం. తాము యుద్ధానికి రావడం లేదన్న వార్త విని బ్రహ్మన్న హతాశుడయ్యాడు. గోసంగులకు కబురు పంపాడు. బ్రహ్మన్న కబురందుకున్న గోసంగులు ఆయన్ను కలిసేందుకు ఇష్టపడలేదు. మహా బలశాలురు, యుద్ధనైపుణ్యం గలవారు వీరోచితంగా ముందుండి పోరాడేవారు, తన బలగాలకు ఆయువు పట్టుగా ఉన్న గోసంగులు తనను కలిసి మాట్లాడటానికి కూడా రాకపోవడం బ్రహ్మన్నను కలచివేసింది. తనే స్వయంగా ప్రయాణమై వారి వద్దకు చేరి వారి యుద్ధ విరమణకు, వ్యతిరేకతకు గల కారణాన్ని వాకబుచేశాడు. దీనిపై గోసంగులు వివరణ ఇస్తూ "ధర్మం నాయకురాలి పక్షానే ఉంది(39). స్వతంత్రించి ఆమే సంధికి ముందుకు వచ్చింది. మాచర్ల రాజ్యమివ్వటమేకాక, మన అనుచిత కోర్కె నరసింగరాజును కూడా మనకు అప్పగించటానికి సిద్ధమైంది. సంధి కుదిరింది. శాంతి నెలకొంది. ఇప్పుడు ఆమె ఏమి ఉల్లంఘించిందని మేము ఆమెపై, ఆమె సైన్యంపై యుద్ధం చేయాలి? అకారణంగా ఎవరి తలలు నరకాలి?" అంటూ గోసంగులు విసిరిన ప్రశ్నలకు బ్రహ్మన్న నోట మాటరాలేదు. వారి మాటల ఈటెలకు తట్టుకోలేక పోయాడు. సమాధానం దొరకలేదు. అయితే యుద్ధానికి రావాలని గోసంగుల వద్ద ప్రాధేయపడ్డాడు. దీనిపై వారు తిరిగి మాట్లాడుతూ "న్యాయంగా, ధర్మంగానైతే సంధికి ముందుకొచ్చిన నాయకురాలి పక్షానే మేము నిలిచిపోరాడాలి, ఇంత కాలం మీ ఆశ్రయంలో ఉన్నందున ఆ స్వామిభక్తి మా చేతులు కట్టివేస్తుంది"అంటూ నిరసన వ్యక్తం చేశారు. చేసేది లేక తిరుగు ముఖం పట్టిన బ్రహ్మన్న యుద్ధం జరిగిన రోజుల్లో ,తన బలగాలు సన్నగిల్లిన సందర్భాల్లో రెండు పర్యాయాలు వేడుకోలుగా "గోసంగులకు" సమాచారం పంపినా వారు విముఖతనే వ్యక్తం చేయడం దళితులైన గోసంగులు ధర్మాధర్మ విచక్షణ గలిగిన వీరులుగా చరిత్రలో నిలిచిపోయారు.

## ఆచంద్రతారార్కం నాయకురాలి దౌత్య సంబంధాలు

రాజ్య పరిపాలనా క్రమంలో పరాయి రాజులతో, సరిహద్దు రాజ్యాలతో ఏర్పడే దౌత్య సంబంధాలు అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంటాయి. దౌత్య సంబంధాలు ఏర్పరచుకునే విషయంలో నాయకురాలి ఆలోచన, ఆచరణ ఆచంద్రతారార్కం అని చెప్పుకోవచ్చు.నాయకురాలి రాజ్యంతో దాయాది మాచర్ల రాజ్యం మినహా ఏ ఇతర రాజ్యంతోనూ, పాలకునితోనూ ఎటువంటి విభేదాలు లేవు. శతృత్వం లేదు. ఎప్పుడూ ఏ రాజు దండెత్తిన దాఖలాలు లేవు. అంతేగాక కార్యమపూడిలో జరిగిన పల్నాటి యుద్ధానికి అనేక మంది రాజులు తమ సైన్యాలతో నాయకురాలికి మద్దతుగా యుద్ధం చేసిన వైనం, తోటిరాజులతో ఆమె సాగించిన స్నేహ సంబంధాలు అబ్బురపరుస్తాయి. శ్రీనాధుని పల్నాటి వీర చరిత్ర గ్రంధ ప్రామాణికంగా కార్యమపూడి యుద్ధంలో నాయకురాలికి సహాయంగా వీరభళ్యాణి, పొన్నాడ భూపతి, మాళపతి, ప్రతాప రుద్రుడు, బాచిదేవుడు, బంగాళవిభుడు,బలదేవుడు,ధనరాశుడు,మహాదేవుడు,ఆరణగండ్ల అధిపతి ఉత్తరుడు, ద్రావిడ, కేరళరాజులు తమ వేలాది కాల్బలాన్ని, అశ్వ ,ఒంటె సైన్యాలతో తరలి వచ్చి యుద్ధంలో పాల్గొన్నట్లు తెలుస్తుంది.ఇది ఇలా ఉండగా రణవ్యూహాల్లో నాయకురాలు అందెవేసిన చేయి. సైన్యాన్ని విభజించి రణభూమికి సమీపంలోని 12 గ్రామాల్లో సిద్ధం చేసిన సంగతి ఆమె వ్యూహాలకు తార్కాణం(40). నాగులేరు పొడవునా అశ్వకదళాలను ఉంచి వచ్చే శత్రుసైన్యాలను ఎక్కడికక్కడే మట్టుపెట్టే యుద్ధ ప్రణాళిక ఆమె నైపుణ్యానికి మచ్చు తునక. ఇందరు రాజ్యాధిపతులు నాయకురాలికి సహాయపడటం బేరీజువేసి నపుడు ఆమె మిత్ర వైఖరికి జేజేలు చెప్పాల్సిందే!

## వ్యూహ ప్రతి వ్యూహాల్లో మేటి నాయకురాలు నాగమ్మ

చిన్నతనం నుండి అస్త్ర, శస్త్ర,విద్యల్లో రాణించిన నాయకురాలు తన గురువు వద్ద రణవ్యూహాలను కూడా ఆకళింపు చేసుకున్నట్లు పల్నాటి యుద్ధ సమయంలో ఆమె రచించిన ప్రణాళికలను బట్టి తెలుస్తుంది. బాలచంద్రుడు మరణించిన వార్తను బ్రహ్మనాయుడికి చేరవేసే సందర్భంలో తాము తీవ్రంగా ద్వేషిస్తున్న నాయకురాలి రణవ్యూహాన్ని కన్నమ దాసు ప్రస్తుతించడం, అభినందించడం వంటి విషయాలు పై సంగతులకు అద్దం పడుతున్నాయి. సైన్యం మొత్తాన్ని ఒక్క కారంపూడికే పరిమితం చేయకుండా ఒప్పిచర్ల, సన్నెగండ్ల, చింతపల్లి వంటి 12 గ్రామాల్లో ఉంచడం

నాయకురాలి సునిశిత వ్యూహాన్ని తెలుపుతుంది. బ్రహ్మనాయుడి సైన్యంలో వీరులు, శూరులంటూ నాయుడి వర్గీయులతో పొగడ్తలందుకునే వారంతా నాయకురాలి బలగాల చేతిలో నిహతులయ్యారంటే ఆమె కూడా దీటైన యోధులను సమకూర్చుకుందనేది సుస్పష్టం. అదే విధంగా కన్నమదాసు మాటల్లో చెప్పాలంటే ఎన్నివేల సైన్యాన్ని సమకూర్చుకుందో ఘడియకొకమారు దండుపై దండు వచ్చి పడుతుందని చెప్తాడు. నాయకురాలి దుర్భేద్యమైన సమర వ్యూహాల్లో తమ వర్గంలోని మహా యోధులంతా ఒరిగి పోయారని కన్నమ బ్రహ్మన్నతో చెపుతాడు. నల్లగొండ నుండి మేళ్ళవాగు కనుమ వరకు నాగులేటి పొడవునా ఆరువేల అశ్వదళాలను, మూడువేల కాల్బలాన్ని సన్నద్ధం చేసిందని కన్నమ చెపుతూ నాయకురాలి రణప్రణాళికా ప్రతిభను కొనియాడడం చూస్తే శత్రువు కూడా మెచ్చుకునే సమర వ్యూహరూపశిల్పి నాయకురాలని మనం అర్థం చేసుకోవచ్చు. యుద్ధం జరుగుతున్న క్రమంలో నలగామరాజును కొదమగుండ్లలో ఉంచి పారిపోయాడనే ప్రచారం చేయించి ఆ మత్తులో ఉన్న శత్రుసైన్యంపై మెరుపు దాడి చేయించిన వైనాన్ని, తనను ఎదుర్కొన వచ్చిన నాయకురాలితో బ్రహ్మన్న ప్రస్తావించడం ఆమె యుద్ధ తంత్రానికి అద్దంపడుతుంది.

## వంశ నాశనానికి దారితీసిన నాయుడి యుద్ధోన్మాదం

బ్రహ్మనాయుని యుద్ధకాంక్ష పల్నాడును పీనుగుల గుట్టగా మార్చడమేకాక తన వంశ నాశనానికి కూడా హేతువయ్యింది. దొడ్డ నాయుడు, శీలమ్మలకు బ్రహ్మనాయుడి సహా ఐదుగురు మగసంతానం. ఈ ఐదు కుటుంబాలకు వంశాకురం ఒకే ఒక్కడు బాలచంద్రుడు. పల్నాటి యుద్ధంలో నాయకురాలి బలగాల చేతిలో బ్రహ్మన్న మినహా మిగిలిన నలుగురు సోదరులు, వీరందరి వారసుడు బాలచంద్రుడు మరణిస్తారు. ఈ మొత్తం విషాదానికి బ్రహ్మనాయుడే కారకుడని ఆనాటి సంఘటనలు స్పష్టం చేస్తాయి. యుద్ధానికి సిద్ధమౌతున్న తరుణంలో గురజాల రాజ్య మంత్రిణి నాయకురాలు నాగమ్మ స్వతంత్రంగా ముందుకొచ్చి మధ్యవర్తుల ద్వారా సంధి రాయబారం పంపింది. మాచర్ల వారి రాజ్యం వారికి ఇచ్చేస్తామని దూతలతో చెప్పి పంపింది. అలరాజు రాయబారంలో మాచర్ల వారి కోరిక కూడా ఇదేనన్నది మనకు తెలిసిన విషయమే. అయితే నాయకురాలు పంపిన సంధి రాయబారాన్ని అవకాశంగా తీసుకున్న బ్రహ్మనాయుడు వర్గం అలరాజు మృతికి నరసింగరాజే కారకుడని తాము నమ్ముతున్నందు వల్ల అతనిని

కూడా తమకు అప్పగించాలని విధించిన షరతుక్కూడా నాయకురాలి వర్గం అంగీకరించింది. ఇక బ్రహ్మన్న వర్గానికి కావలసిందేమిటి ? అయితే సంధి వైఫల్యానికి కారణం ఏమిటి? బాలచంద్రుని అనాలోచిత ఆవేశం, బ్రహ్మన్న యుద్ధకాంక్ష, రాజ్య ప్రీతి అని చెప్పక తప్పదు. బాలచంద్రుడు యువకుడు, వయసులో చిన్నవాడు. ఆ వయసులో ఉడుకు నెత్తురు, కట్టలు తెగే ఆవేశం ఉండడం సహజం. అయితే మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వానిగా, విశాల హృదయుడిగా ముద్ర వేయించుకున్న బ్రహ్మనాయుడి బుద్ధికుశలత ఏమైంది? బాలచంద్రుని వీరావేశాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఇతరులకు లేకపోయినా ఆయనకు లేదా? నయానో ,భయానో అతని దూకుడుకు కట్టలు వేయాల్సిన అవసరం లేదా? పల్నాడులో యుద్ధ నివారణ, శాంతి నెలకొల్పే ధోరణే బ్రహ్మనాయుడికి ఉంటే అవసరమైతే "తనను ఓడించి శత్రుసైన్యాల వైపు వెళ్ళాలని" ఆయనే బాలచంద్రునితో తలపడి అతనిని కట్టడి చేయాల్సిన పని లేదా? అనే ప్రశ్నలు మనం వేసుకుంటే బ్రహ్మన్న ఆసలు రంగు బయట పడుతుంది. సంధి జరిగి శాంతి నెలకొంటే తనకేం లాభం? సమరం కొనసాగితేనే ఆయనకు ప్రయోజనం. యుద్ధంలో ఎలాగు నలగాముని ఓడిస్తామనే ప్రగాఢనమ్మకంతో ఉన్న బ్రహ్మన్న తదనంతరం మొత్తం పల్నాడును తనే ఏలుకోవచ్చనే దుర్బుద్ధితోనే బాలచంద్రుని అనుచిత ఆవేశాన్ని నిలువరించలేక పోయాడని బోధ పడుతుంది. ఈ కుటిలత్వమే ఆయనను నిర్వంశుణ్ణి చేసింది. ఎలాంటి శ్రమ లేకుండా నరసింగరాజును కూడా బ్రహ్మన్న వర్గం చేతికి అప్పగించుచున్నారు. అలరాజు మృతి సందర్భంలో అలరాజు తండ్రి కొమ్మరాజుకు నరసింగరాజు శిరస్సు తెచ్చి ఇస్తానన్న బాలచంద్రుని ప్రతిజ్ఞ నెరవేరడానికి కూడ మార్గం సుగమమైంది. మరి యుద్ధం ఎందుకు జరిగినట్లు? కారకులెవరో మనకు ఇట్టే అర్థమౌతుంది.

## విజయం నాయకురాలిదే!

రాజ్యాధి నేత మరణంతో రాజ్యం అంతరిస్తుంది. యుద్ధరంగానికి చేరిన తరువాత మృతి చెందితే వారి రాజ్యం వైరి పక్షానిది అవుతుంది.రాజు మరణంతో యుద్ధం పరిసమాప్తం అవుతుంది. అందుకే రాచరిక సమరాలన్నింటిలో రాజు ప్రవేశం కడపటిది అవుతుంది. సైన్యం ఇతరత్రా వివిధ శ్రేణుల వీరులు, నాయకులు, కుటుంబ సభ్యుల వీరమరణం తరువాతనే రాజు యుద్ధ రంగంలోకి అడుగిడుతాడు. పైన చెప్పిన విషయానికి ఈ సాంప్రదాయాలు సరిగ్గా సరిపోతాయి.యుద్ధ ప్రారంభంలోనే రాజు

సమరాంగణంలో చొరబడి అపజయం పాలైతే మిగిలిన బలగాలన్నీ వృధాగా ఎదుటి వారి వశమౌతాయి. అందుకే ఏ రాజు అయినా ముందుగా తన శ్రేణులను రంగంలోకి దించుతాడు. సేనాని నేతృత్వంలో ఇదంతా జరుగుతుంది. సేనాని కూడా మృతిచెందిన తదుపరి తను సేనాని పాత్రకూడా పోషిస్తూ సమరభూమిలో కాలిడతాడు. కేవలం యుద్ధాచారాలను తెలుసుకునేందుకే ఇక్కడ కొంత సమాచారం ఇవ్వవలసి వచ్చింది. అయితే పల్నాటి సమరాంగణంలో దాయాదులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఒకొక్కరుగా స్వర్గస్థులవుతుంటే పెదమలిదేవుడు తీవ్రంగా కలత చెందుతూ వస్తున్నాడు. సంధి కుదిరింది, శాంతి చేకూరుతుంది, తన రాజ్యం తిరిగి వస్తుంది, రక్తపాతం, జన నష్టం నివారణ అవుతుందని సంతృప్తితో, సంతోషంతో ఉన్న పెదమలిదేవుడు బాలచంద్రుని వికృత పోకడతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోయాడు. తొలి నుండీ బ్రహ్మన్న మాటకు ఎదురు చెప్పలేని తత్వాన్ని అలవరుచుకున్న పెదమలిదేవుడు అత్యధిక ప్రాముఖ్యత గలిగిన యుద్ధఘట్టంలో కూడా మౌనం దాల్చడమే అన్ని అనర్థాలకు హేతువైంది. ఈ భావనే ఆయనను వేధిస్తుంది. తనవైపు మరణిస్తే తోడబుట్టిన సోదరులు, అవతలివైపు మృతి చెందితే పిన్నమ్మల కుమారులు అనే రక్తబంధం ఆయన మనసును గట్టిగా తొలుస్తుంది. ఈ మానసిక వ్యధతో తల్లడిల్లుతున్న సందర్భంలోనే పిన్నమ్మ కుమారుడు నరసింగరాజును యుద్ధంలో హతమార్చి తలను తీసుకుని బాలచంద్రుడు మలిదేవాదుల గుడారాల వద్దకు వచ్చి బ్రహ్మన్న చేతికిస్తాడు. ఈ సంఘటనతో బ్రహ్మనాయుడు బాలచంద్రునిపై విరుచుకు పడతాడు. బాలచంద్రుడు కూడా తానేమీ తక్కువ తినలేదంటూ తండ్రి కుట్రలన్నింటినీ అక్కడికక్కడే అందరి ముందూ ఏకరువు పెడతాడు. నరసింగుని సిరస్సును బ్రహ్మన్న ఒక రత్నపీఠంపై ఉంచి నమస్కరించగా అందరూ ఆయనను అనుసరించి కైమోడ్పు లర్పిస్తారు. తన మౌనమే ఈ మొత్తం రక్తపాతానికి కారణమని కుమిలిపోతున్న పెదమలిదేవుడు ఈ దుర్ఘటనతో కకావికలయ్యాడు. తట్టుకోలేక పోయాడు. ఆ ప్రాంతం నుండి అందరూ నిష్క్రమించగానే ఆత్మాహుతికి పాల్పడి నేలకొరిగాడు. పెదమలిదేవుని సోదరులు యుద్ధంలో మరణిస్తారు. ఇటు నలగామరాజు సజీవుడే! మొత్తం అనుగురాజు వారసుల్లో నలగామరాజు ఒక్కడే మిగిలాడు. ఈ ప్రకారం నాయకురాలి పక్షానిదే విజయమని చరిత్రకారులు పరిష్కరించారు(41). మహావీరులని ప్రచారం జరిగిన బ్రహ్మన్న పక్షం వారంతా నాయకురాలి వీరుల చేతిలో మృతిచెందినవారేనన్న విషయం గుర్తించాలి.

## ‘నాయకురాలి’ చేతిలో ‘నాయుడు’పరాజితుడా?

ఒక ప్రగాఢమైన నమ్మకం సత్యదూరమని తేలుతున్నప్పుడు చిత్రమైన పరిస్థితిని అనుభవిస్తాము. ఆశ్చర్యానికి గురౌతాము. ఒకడోలాయమాన, సంక్షోభ, సంక్షుభిత, సంచాలనాలన్నీ ఏకమై మనని చుట్టుముడతాయి. నది మలుపు తిరుగుతున్న సమయంలో ఉత్పన్నమయ్యే నీటి అలజడి లాంటి సంఘర్షణకు లోనౌతాము. అలాంటిదే బ్రహ్మనాయుడి ఒఱుగు. తిరుపతి ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో గల “పల్నాటి వీరచరిత్ర”– 2వ భాగం వ్రాతప్రతిలో ఉన్న అంశం, అట్లాగే మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములో గల “పల్నాటి వీరాగాధావృత్తము” నందున్న భాగం ఇప్పటి వరకూ ప్రచారంలో గల ప్రగాఢ విశ్వాసాన్ని ధ్వంసం చేస్తున్నాయి. ఈ వ్రాత ప్రతుల్లో శీలం బ్రహ్మనాయుని విరుగు/ఒఱుగు అనే కథాంశముంది. పల్నాటి వీర కథాచక్రమున ఇది చివరి గాథ. విరుగు, ఒఱుగు, వొరుగు ఇవి సారూప్య పదాలు. ఒఱుగు అంటే మరణించడం. అలరాజు ఒఱుగు, గోపన్న ఒఱుగు, కల్లి ఒఱుగు అని పల్నాటి వీరగాధలో మరణించిన వారిగురించి చెపుతుంటారు. అలరాజు మరణాన్ని అలరాజు ఒఱుగు, గోపన్న(బాల/చెవుల గోపన్న) మరణాన్ని గోపన్న ఒఱుగు, లంకన్న మరణాన్ని లంకన్న ఒఱుగు, యుద్ధంలో బ్రహ్మనాయుని పక్ష వీరులు,సైనికుల మరణాన్ని కల్లి ఒఱుగు అని చెపుతుంటారు. వీరవిద్యావంతులు కూడా తమ కథాగానంలో పైవిధంగా పాడుతారు. ఈ సందర్భాలను అంచనా గట్టినప్పుడు బ్రహ్మనాయుడు యుద్ధంలో ఒరిగి పోయాడని (మరణించాడని) ధ్రువపడుతుంది(42). **(పల్నాటి యుద్ధం ముగింపులో నాయకురాలు బ్రహ్మనాయుడితో తలపడిందనిచెపుతారు. నాయుడు తను స్త్రీతో యుద్ధం చేయనన్నాడని, నాయకురాలిని క్షమించాడని, ఆమెకు ప్రాణ భిక్షపెట్టాడని తెలుపుతారు. నలగామునిపట్ల కరుణ జూపి తిరిగి ఆయనకే రాజ్యం అప్పగించి పట్టాభిషిక్తుని చేసి, తను లౌకిక వ్యామోహాలను వీడి ఆధ్యాత్మిక చింతనతో గుత్తికొండ బిలం వెళ్ళి అక్కడ తపస్సు చేసుకున్నాడన్న ప్రచారాలు రాజ్యమేలుతున్నాయి).** అయితే ఈ ప్రచారాలన్నింటినీ ప్రాచ్యలిఖిత పుటలలో ఉన్న అంశాలు తిప్పి కొడుతున్నాయి. వాటిని అసత్య ప్రచారాలుగా కొట్టిపారేస్తున్నాయి. బ్రహ్మనాయుడి ఇంటిపేరు శీలం. శీలం బ్రహ్మనాయుడి ఒఱుగు అని స్పష్టంగా కనపడుతున్న ఈ సత్యాలను తోసిపుచ్చుటానికి అవకాశమే లేదు. కొమ్మరాజు మరణం తరువాత బ్రహ్మనాయునిపై యుద్ధానికి నాయకురాలు పచకుల బ్రహ్మన్నను పంపగా అతనిని ఎదుర్కొనేందుకు బ్రహ్మనాయుడు అడపకేశవదాసిని పంపాడు. పచకుల కేశవదాసిని హతమార్చాడు. అనంతరం పచకుల బ్రహ్మనాయుడితో తలపడి ప్రాణాలు కోల్పోయాడు. తదుపరి కారంపూడి రాజు

బ్రహ్మనాయుడిని ఎదుర్కొని స్వర్గస్థుడయ్యాడు. తరువాత తనపై తారసిల్లిన చింతపల్లి కోటిరెడ్డిని మూర్ఛిల్లజేసిన బ్రహ్మనాయుడు భీమసింగుని పరలోకానికి పంపాడు. చివరగా నాయకురాలే స్వయంగా అశ్వరూఢయై బ్రహ్మనాయుడితో యుద్ధానికి వచ్చింది. వీరిద్దరి మధ్య జరిగిన పోరు ఫలితం ఏమిటి? ఎవరు మరణించారు? విజయం ఎవరిది? అనే ప్రశ్నలు మన ముందు నిలిచినపుడు "తిరుపతి, మద్రాసు ప్రాచ్యలిఖిత వ్రాతప్రతుల్లోని 'శీలం బ్రహ్మనాయుని' ఒఖుగు (విరుగు) కథాంశం సమాధానంగా నిలుస్తుంది. ఈ ప్రమాణంతో నాయకురాలు బ్రహ్మనాయునిపై విజయం సాధించిందని వెల్లడికావడం లేదా? బ్రహ్మనాయుడు ఒఱిగిపోయాడని స్పష్టం కావడం లేదా? నాయకురాలిని కురచపరచడానికి పల్నాటి చారిత్రిక రచనల్లో జరిగిన అనేక వక్రీకరణల్లో ముగింపు కూడా ఒక భాగమని భోధపడటం లేదా? బ్రహ్మనాయుడే విజయం సాధించి వుంటే తన మానస పుత్రుడైన కన్నమదాసుకు రాజ్యాన్ని ఎందుకు అప్పగించడు.? అతనికే పట్టాభిషేకం చేయడా? తనను వ్యతిరేకించి మంత్రి పదవి నుండి నెట్టి వేసిన నలగామరాజుకు రాజ్యాన్ని దక్కనిస్తాడా? ఈ మొత్తం వినాశనమంతా నడిచింది నలగాముని అంతం చేయడానికి కాదా? అన్న ప్రశ్నలు ఉదయించడం లేదా?

## పదవిపట్ల నిర్వ్యామోహమే!

నాయకురాలు పదవికోసం వెంపర్లాడినట్లు గోచరించదు. కేవలం అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే ఆమె నైజం. తలవని తలంపుగా తరలి వచ్చిన అనుగురాజు, ఆయన పరివారానికి ఆతిథ్యమిచ్చి తద్వారా ఆయన యిచ్చిన వరం ప్రకారం ఏడు ఘడియలు మంత్రి పదవి పొందడం మినహా, తనంత తానుగా ఆయనను వరమీయమని, పదవికావాలని అడిగిన సందర్భం లేదు. అనుగురాజు వరము కోరుకోమని అడగగానే అవకాశంరానే వచ్చిందనీ, పోతే తిరిగి లభించదనే దురాశకు పోకుండా తొలుత సున్నితంగా తిరస్కరించింది. రెండవమారు చేసిన వత్తిడి మేరకే నాయకురాలు మంత్రి పదవిని కాంక్షించింది. అంతేగాక యుద్ధానంతరం తన వర్గమే విజయం సాధించినా మంత్రి పదవిపై విరక్తే ప్రదర్శించింది. విరాగియై యుద్ధభూమిని, రాజ్యాన్ని విడిచి తిరిగి స్వగ్రామానికి తరలి వెళ్ళింది. శేష జీవితాన్ని ప్రజాసేవలో, దైవ చింతనలోనే గడిపింది. అక్కడ కూడా ప్రజలకు అండగా నిలిచింది. వారిలోని నిర్భీతిని మేల్కొల్పింది. తరచూ ఆగ్రామంపై దండయాత్ర జరిపి దోపిడీ చేసే బందిపోటు ముఠాపై ప్రజలతో ఎదురుదాడి చేయించింది. ప్రజలందరినీ సమాయత్తం చేసి, వెన్నుతట్టి ఆముఠా ఆటకట్టించి బందిపోట్లను మట్టు పెట్టించింది.

ఆమె జన్మ స్థలమైన 'అరవెల్లి' గ్రామంలో ఆనాటి నుండి నేటి వరకూ ఆమె ఆరాధ్యదేవత. గ్రామ ప్రజలేకాక ఆప్రాంత వాసులంతా ఆమెను దేవతలా పూజిస్తారు.'అరవెల్లిలో' ఆమెకు దేవాలయం కట్టించారు. 5 సంవత్సరాల కొకమారు కొలుపులు జరుపుతారు. గుడిలో ఇచ్చే తీర్థాన్ని ఆప్రాంత వాసులంతా పొలికలగాలని తమ పంటపొలాలపై చల్లుకుంటారు. ప్రతి బుధ, శుక్రవారాలు పూజలు జరుగుతాయి. దేవాలయానికి తూర్పువైపున ఉన్న వాగును నాయకురాలివాగు అని, సమీపంలో గల నీటి కొలనును నాయకురాలి మడుగని పిలుస్తారు. భూగర్భంలో ఉన్న "నాయకురాలి గుడి" ఉపరితలం ఎవరూ త్రొక్కకుండా పెంకుతో కుటీరం కట్టారు(43).

## నలగాముడే నష్టజాతకుడు

పల్నాటి చరిత్ర మొత్తం సింహావలోకనం చేస్తే అత్యధికంగా నష్టపోయిన వాడు నలగామరాజని బోధపడుతుంది. మొత్తం ఈ చరిత్రలో అనేక పాత్రలు కనిపిస్తున్నపటికీ ఇతరులకంటే నలగామునికి జరిగిన నష్టమే అపారం. చిన్నతనం నుండి ఆయన జీవితం సుడిగుండాల మధ్యే సాగింది. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయాడు. తండ్రికి ముగ్గురు భార్యలున్నప్పటికీ, తన తల్లి కంటే పెద్దవారు తమతమ సంతానం కోసం ప్రాణాలు నిలుపుకోగా తన తల్లి మైలమదేవి తండ్రితో సహగమనం చేసింది. ఆ విధంగా లోకం తెలియని వయసులోనే తల్లి ప్రేమనుకూడా కోల్పోయాడు. అనంతరం బ్రహ్మనాయుని దౌష్టీకానికి తలొగ్గి తల్లి అరణంగా తెచ్చుకున్న పల్నాడు రాజ్య భూభాగంలో సగభాగాన్ని సవతి తల్లి తనయులకు అప్పనంగా అర్పించాడు. ఆరకంగా తన రాజ్యంలో సగ భాగాన్ని కోల్పోయాడు. రాయబారానికి వచ్చిన అల్లుడు అకాల మృత్యువాత పడటంతో తన రాజ్య వారసుడు కుమారసమానుడు అయిన అలరాజును కోల్పోయాడు. అల్లునితో పాటు ఒక్కగానొక్క గారాల పట్టి, ప్రియాతి ప్రియమైన పుత్రిక పేరిందేవి సహగమనం చేయడంతో తన ఆరోప్రాణమే పోయినట్లు అయింది. ఈ సంఘటనలన్నింటినీ బేరీజు వేసినప్పుడు ఇతరుల కాంక్షలకు, కుట్రలకు నలగాముడు కొవ్వొత్తిలా కరిగినట్లుగా తెలుస్తుంది.

## "చాపకూడు" లో సత్యమెంత....?

చాపకూటి సిద్ధాంతకర్తగా బ్రహ్మనాయునికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు లభించాయి. చాపకూటితో సమతావాదిగా పేరు పొందాడు. గొప్ప సంస్కరణ వాదిగా ప్రచారం జరిగింది. అయితే పల్నాటి చరిత్రపై వచ్చిన పూర్వ ప్రామాణిక గ్రంథాలలో నాటి రచయితలు,కవులు ఎక్కడా చాపకూటి ప్రస్తావన చేసిన దాఖలాలు లేవు. జానపదుల

కథనాల్లో కూడా చోటు లభించలేదు. తొలి రచన అయిన శ్రీనాథుని పలనాటి వీర చరిత్రలోనూ తదనంతర కొండయ్య ద్విపదకావ్యంలోనూ వెల్లడి చేయలేదు. బ్రహ్మనాయుడిపై అభిమానంతో రచనలు సాగించిన తొలితరం కవులు, రచయితలు ఆయన శ్రీమహావిష్ణువు, శ్రీకృష్ణుని అవతారమని దివ్యత్వాన్ని, మహిమలను అంటగట్టి చెప్పుకొచ్చారు. కాలం నాగరికత సంతరించుకున్న కొద్దీ మహిమలు, మహత్యాలకు కాలం చెల్లుతున్నందున ఆ తరువాత వచ్చిన కవులు, రచయితలు ఆయనకు లౌకిక, సామాజిక అంశాలైన చాపకూడు, సంస్కరణ, సమతలాంటి పద కిరీటాలను అలంకరించారు. పల్నాడు చరిత్రపై వచ్చిన రచనలలో కేవలం రెండు సందర్భాలలో మాత్రమే భోజనాల ప్రస్తావన ఉంది. రెండింటిలో ఒకటి శ్రీశైలం రాజు ఏర్పాటు చేస్తే, ఒకటి బ్రహ్మనాయునిచే ఏర్పాటైంది. కోడి పందెంలో ఓడిన బ్రహ్మనాయుడు ప్రవాసానికి వెళతాడు. శ్రీశైలాన్ని పాలించే హోయిసల మాకరాజు వద్ద తన నృసింహకుంతాన్ని (ఆయుధాన్ని) కుదవ పెట్టి లక్షా ఎనభైవేల రామమాడలు అప్పుగా పుచ్చుకుంటాడు. తిరిగి ధనాన్ని ముట్టచెప్పి తన కుంతాన్ని కుదవ విడిపించుకుంటానని చెప్పుకుంటాడు. ఆ సమయంలో తాకట్టును నిర్ధారించుకోవటానికి మాకరాజు సామంత నృపతులను పిలుచుకున్నాడు. దువ్వలేరు సమీపంలో కుదవ పత్రాలు వ్రాసుకున్నారు. పత్రాలపై సామంత రాజులు సాక్షి సంతకాలు చేశారు. వీరందరికీ అక్కడే మాకరాజు చాపలపై భోజనాలు ఏర్పాటు చేశాడు(44). ఈ చాపలపై ఏర్పాటు చేసిన భోజనాలనే మన ఆధునికి రచయితలు చాపకూడని, ఈ విధానాన్ని బ్రహ్మనాయుడే ప్రారంభించాడని, చాపకూటి సిద్ధాంతకర్తని ప్రశంసించారు. వాగు వద్ద చాపలపై భోజనాలు చేసిన ఈ ప్రాంతంలో అనంతరం ఏర్పడిన గ్రామానికి చాపలమడుగని పేరు వచ్చింది. దీనినే వినుకొండ వల్లభరాయుడు తన క్రీఢాభిరామములో సామంత నృపతుల చాపకూడు అని వివరించాడు. ముదిగొండ వీర భద్రకవి పాలకూళ్ళబంతి అన్నాడు. ఇక కార్యమపూడి రణక్షేత్రంలో సంధి చేసుకున్న సందర్భంలో ఏర్పాటైన భోజనాలు. వీటిని శ్రీనాధుడు తన పలనాటి వీరచరిత్రలో విందుభోజనాలనే చెప్పాడు. దీనిని జానపదులు చాపలన్నాల బంతి అంటారు. చాపలమీద విస్తళ్ళలో వడ్డించిన బంతి అని కొందరు చెప్తారు. ఈ విందు భోజనం బ్రహ్మనాయుడే ఏర్పాటు చేశాడు. బంతిలో నెయ్యి వడ్డన జరుగుతున్నప్పుడు అనపోతు మరణ వార్త విన్న బాలచంద్రుడు చివాలున లేచి గొడవ సృష్టించి సంధి విచ్ఛిన్నానికి హేతువైనాడు. నెయ్యి వడ్డన జరగడమంటే బంతులుగా (వరసలుగా) కూర్చున్నారనే అర్థం వస్తుంది. ఈ సందర్భానికి కూడా చాపకూడు అన్వయించదు. ఈ రెండు ఘటనలు మినహా పల్నాటి చరిత్రలో భోజనాల ప్రస్తావన రాలేదు.

# పల్నాటి పొద్దు పొడుపు

పల్లవి : ఆత్మాభిమానమా
అరుణారుణ బింబమా
పలనాటి మోమున
పొద్దు పొడుపు నీవమ్మా

చ1 : మహిళా మణి దీపమా
నారీజన నాదమా
అమ్మదనం కమ్మదనం
కలసిన అపురూపమా

చ2 : సంధించిన అస్త్రమా
ఎగసిన కరవాలమా
సమరాంగణమ్ములో
సమరభేరి నీవమ్మా

చ3 : నీ పేరు వింటేనే
గుండెల్లో అలుకు
శత్రు వర్గాలకు
వెన్నులోన వణుకు

చ4 : కదనంలో పోరలేని
పిరికి పందలు
కలలో నిను కూల్చలేని
వేరు పురుగులు

చ5 : విజయమ్ము నీదెగా
వక్రభాష్య మిస్త్రారా
మలిదేవరాజులు
మరణమ్ము నొందగా

చ6 : మహిళాశక్తిని
మన్నించలేని వారి
సింహస్వప్నవైనావు
శిరసెత్తి నిలిచావు

చ7 : ధరిత్రిలో నీపై
చరిత్ర కారులు
వివక్ష రాతలతో
విషాన్ని చిమ్మారు

చ8 : నిందలెన్నో వేశారు
నిప్పునే తొక్కారు
నిగ్గులే తేలితే
నివురులై రాలుతారు

చ9 : మేరు నగము నీపై
దారుణాలు రాసి
కారుకూతలే కూసి
కక్ష తీర్చుకున్నారు

చ10 : అసత్యాలు చెప్పారు
అసలు నిజం దాచారు
అపచారం చేశారు
అపకారం జరిపారు

చ11 : రానున్న తరం వారు
నిగ్గు తేల్చు తారులే
మోసాల ద్వేషాలను
నిగ్గదీసి కడుగుతారు

చ12 : ఉషస్సు వెలిగితే
తమస్సు తొలుగులే
వేరుపురుగులన్నీ
నీరుగారి పోవులే !

చ13 : వేగు చుక్క నీవమ్మా
వెలుగురేఖ నీవమ్మ
నాయకురాలివై నీవు
కాంతిరేఖ వైనావు !

1. ***పల్నాడు రాజ్యంలో గ్రామాల సంఖ్య :-***

గీ. పల్లెనాటను నూట తొంబదియు నాల్గు
గ్రామముల నీడు గొనక యె కాకునూరి
వేంగనార్యుడు వేద వేదాంగములను
బ్రస్తుతికి నెక్కిమాఱుట బ్రహ్మయనగ

- అప్పకవీయము

2. ***శ్రీనాధుని పలనాటి వీరచరిత్ర ప్రధమ భూమికలో అనుగు రాజు ఉత్తర దేశం నుండి వచ్చి పల్నాడు రాజ్యస్థాపన చేసినట్లు కనిపిస్తుంది...***

"ఒగి నన్గ భూపుడయోధ్య పాలుండు
తమ తాత చేసిన తగు పాతకముల
పోగొట్టవలెనని పొందుగా తలచి
ఉత్తరాదిని నుండి ఉర్వీశుడపుడు
ఘన దక్షిణాదికి గదలెడు వేళ "

-"పలనాటి వీరచరిత్ర"- శ్రీనాధుడు

3. ***పాలమాచాపురిని జంభనా పురియని శ్రీనాధుడు, జబలాపురంబు అని ముదిగొండ వీరభద్ర కవిప్రయోగించారు. ఇవి పాలమాచాపురికి పర్యాయ నామాలు. ప్రస్తుత జబల్‌పురమేఈ జంభనాపురి.***

"కాశికి డెబ్బది యారామడ కనగ నయోధ్య
యచ్చటికి మరి యావల నున్న
యరువది యారామడ గలదా కనకాద్రి
కనక జంభనపురి ఘన మెట్ల టన్న"

-"పలనాటి వీరచరిత్ర"- శ్రీనాధుడు

4. ***అనుగురాజు సంతాన క్రమము :-***

"మైలమ దేవికి మరియు నలగాము
భూరమ దేవికి పుత్రులనంగ
కామరాజును బుట్టె కదు రమ్యముగను
నరసింగరాజును నంత పెరుమాలు
ఝుట్టిరాజనగను జయశీలు దతడు

ఈ తీరు జన్మించిరింతుల కపుడు
సంతాన మీరీతి చాల బుట్టుగను
వీర విజ్జలదేవి కిష్ట వేల్పునగ
చెన్నుని వ్రతముల చాల నోమగను
ఆ చెన్నుడప్పుడు ఆ సతిని మెచ్చ
ముగురు మల్దేవులు మోదమున నపుడు
జయశీలురనగను జన్మించి రపుడు"

"పలనాటి వీరచరిత్ర"- శ్రీనాధుడు

5. **18 సంవత్సరములు వచ్చునాటికి ఆమె (నాగమ్మ) పలనాటి సీమలో ప్రముఖ స్త్రీగా గుర్తించ బడింది. 12సంవత్సరాలకే భారత,భాగవతాలు చదివింది. సాముగరిడీలు, అస్త్రశస్త్ర ప్రయోగాలు, విలువిద్య, గుర్రపుస్వారి నేర్చింది. నాగమ్మకు గురువు శైవాన్ని బోధించాడు.**

**- "పల్నాటి మహాభారతం" - చిట్టిబాబు**

6. **పురుష సంతానం లేని సంపన్న కుటుంబాల్లో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కుమార్తెలకు యుద్ధ విద్యలు నేర్పే ఆచారమున్నట్టు కనిపిస్తుంది. ఆ ప్రకారమే నాయకురాలు యుద్ధవిద్యలు నేర్చిఉంటుంది. మాంచాల కూడా ఇదే విధంగా విలువిద్యలు, కత్తిసాము నేర్చి యుద్ధరంగాన పోరాడింది.**

"పంట రెడ్డీ వారి పడతియు మరియు
వీరజగ్గారెడ్డి వేడుక పుత్రి
మేకపోతుల రెడ్డి మేనకోడలును
నాగమ్మయను ఒక నారీలలామ"

**-"పల్నాటి వీర చరిత్ర" - పింగళ లక్ష్మీకాంతం.**

"పంటరెడ్డీ వారి పణతి యనంగ
ఎలమి జగ్గారెడ్డి వేడుక పుత్రి
మేకపోతుల రెడ్డి మేనకోడలును
అర్వెల్లి వారింటి అమరు కోడలును
తరుణి నాగమయను తక్షణ మందు"

**-"పలనాటి వీరచరిత్ర" - శ్రీనాధుడు.**

అనుగురాజు ఆస్థానంలో మంచి ప్రాపకం సంపాదించాడు (నాయకురాలు తండ్రి రామిరెడ్డి). పెంపుడు తండ్రితో బాటు నాగమ్మ కూడా రాచనగరుకు వస్తూ పోతూ ఉండేది. పసి వయస్సు నుండే అన్ని రంగాలలో ప్రముఖులను గుర్తించి వారి కౌశలాన్ని ఆకళించుకుంటూ ఉండేది. ఒకనాడు గోపన్న మంత్రి అనే నియోగి బ్రాహ్మణుడు రెడ్డి ఇంటికి వచ్చాడు. ఆయన నాగమ్మను చూచి "రెడ్డీ ! ఈమె కారణజన్మురాలు. కొంత కాలం ఈమె రాజ్యమేలుతుంది. ఈమెను పుత్రునిగా భావించి సమస్త విద్యలను నేర్పింపు" మని చెప్పాడు. అపుడు రెడ్డి "మంత్రి పుంగవా ! ఈ మా కుమార్తెను మీ కుమార్తెగా భావించి సమస్త విద్యలను నేర్పమని" కోరాడు. అందులకాయన సమ్మతించి నాగమ్మకు సంస్కృతాంధ్ర, కన్నడ, తమిళ భాషలందు పాండిత్యము, తత్వశాస్త్రము, రాజనీతి మర్మాలు, ధనుర్విద్య, సాముగరిడీలు, సంగీతము నేర్పాడు.

**– "నాయకురాలి దర్పము"– చిలుకూరి వీరభద్రకవి**

7. "నాగమాంబ (నాగమ్మ) నలగామరాజు కొలువులో ప్రవేశించింది. ఆమె ఎత్తరి మనిషి, బంగారు మేని ఛాయ, వెంద్రుకల్ని వెనుకకు మడిచి ముడిగా కట్టింది. ఆమె సభలోనికి రాగానే సభలోని వారంతా ఆమెను చూచి గౌరవంగా నిలబడ్డారు. నలగామరాజు ఆమెకు ప్రజలలో గల గౌరవాన్ని గమనించాడు"

**–"పల్నాటి మహాభారతం" – చిట్టిబాబు**

"బిరుదులందిన రాచబిడ్డల బొమ్మల
చాయ నాడించిన నాయకమ్మ" (నాగమ్మ)

**"ఆంధ్రనారీమణులు" – ఆంద్ర శేషగిరిరావు**

"తొలి మహా మంత్రిణి నాయకురాలు నాగమ్మ
తెలుగు వారికి మొదటి నాయకురాలు"

**"పల్నాటిప్రాభవం" – కపిలవాయి లింగమూర్తి**

"అగ్నిపునీత నాయకురాలు నాగమ్మ"

**"నాయకురాలు" – లల్లాదేవి**

"హైహయ వంశాన్ని (అనుగురాజు వంశాన్ని) రూపుమాపి తన వంశాన్ని నెలకొల్పడమే బ్రహ్మన్న ఆశయం. ఇది గ్రహించిన నాగమ్మ గురజాల – మాచర్ల (రాజ్యాల) సమైక్యానికి ప్రయత్నించింది.

**"ఆంధ్రులచరిత్ర"– డా.బి.యస్.యల్.హనుమంతరావు**

8. నాగమ్మ మిక్కిలి ప్రజ్ఞావంతురాలు. తన తెలివితేటలతో తన చుట్టుపక్క గొప్ప పేరు సంపాదించెను. న్యాయ విచారణ చేయుచూ ప్రజలకు తీర్పులిచ్చు చుండెను.

**–పిడుగు నరసిహం – పల్నాటి వీరాచార పీఠాధిపతి**

9. "నాయకురాలి పాత్రను ఆంధ్రులు సరిగా అర్ధము చేసికొనలేదని చెప్పవలసి యున్నది. నిజమునకు నాయకురాలు కొన్ని వీరగాథలలో చూపబడినంత దుష్టురాలు కాదు. రాజకీయ దృష్టితో చూచినచో బ్రహ్మనాయునికన్న ఈమె వేయి రెట్లు గొప్పది. చాణక్యుడు చెప్పిన రాజలక్షణములన్నియూ నీమెలో మూర్తీభవించి యున్నవి. ఇట్టి వారి వలననే రాజ్యమభివృద్ధి గాంచును.

**"తెలుగువీరగాథాకవిత్వము–పల్నాటివీరకథాచక్రము"**

**డా.తంగిరాల వెంకటసుబ్బారావు**

" In Galayya's version of the epic she (Nagamma) is often blamed but she seems far from being completely nagative in character, rich and politically shrewd, she is also ruthless in carrying out her designs ....!. She is more than a match for Brahmanayudu"

**"The epic of palnadu" - Gh.Rogheir.**

10. "చెరువు తవ్వించ వలయునని నిర్ణయించిన ఎక్కువ భాగము చౌదరి రామిరెడ్డికి చెందినదగుటచే బ్రహ్మనాయుడు రామిరెడ్డికి కబురు చేశాడు. రామిరెడ్డి కుమార్తెయగు నాగమ్మతో సంప్రదించాడు. బ్రహ్మన్న తన పలుకుబడిని పెంచుటకు ఈ కుటిల యత్నం చేస్తున్నాడని నాగమ్మ తండ్రితో చెప్పింది. రామిరెడ్డి చెరువు త్రవ్వుటకు తన పొలమునీయనని బ్రహ్మన్నతో చెప్పాడు. బ్రహ్మన్న రామిరెడ్డి శిరస్సును ఖండించాడు. తన తండ్రిని చంపిన బ్రహ్మనాయునిపై ప్రతీకారము తీర్చవలెనని నాగమ్మ నిర్ణయించుకున్నది."

**"పల్నాటి మహాభారతం" – చిట్టిబాబు**

"చెరువు తవ్వకానికి పొలము యివ్వడానికి నిరాకరించిన రామిరెడ్డిపై పగ బూనాడు. రాత్రి సమయంలో అనుచరులతో బ్రహ్మన్న జిట్టగామాలపాడు చేరి రామిరెడ్డిని మంచానికి కట్టి తీసుకెళ్ళి పొందుగుల అడవుల్లో చెట్టుకు ఉరితీశాడు"

**"పలనాటి చరిత్ర"–గుర్రంచెన్నారెడ్డి**

"తన కుటుంబానికి బ్రహ్మన్న వలన జరిగిన అన్యాయాన్ని సహించలేక నాయకురాలు రాచరిక పదవి కోసం ప్రయత్నించి ఉండవచ్చు. మామ,తండ్రుల మరణం ఆమెలో క్రోధం పెంచి ఉంటుంది. బ్రహ్మనాయుడిని ఎదుర్కొనడానికే మంత్రిపదవి కోరుకొని సాధించినట్లు భావించవచ్చు"

**"పల్నాటి వీర చరిత్ర"-పింగళి లక్ష్మీకాంతం.**

11. "Brahmanayudu killed both Dodda and , Alugu and then enthroned Nalakama"

**" I bid-see" sewell.**

**బ్రహ్మనాయుడితో మలిదేవుడన్నమాటలుః-**

"నాయుడా వినవయ్య నా విన్నపంబు
నీచేత మృతి బొందెనపుడు నా తండ్రి
అనుగురాజేంద్రుడు అతివేగమునను
మ్రొక్కు వేసిన ఘనత మిక్కుటంబాయె"

**"పలనాటి వీరచరిత్ర" - శ్రీనాథుడు**

12. All seven of them were like uniform, beauty, grace and perfection.

**"The Epic of Palnadu" - GH.Rogheir**

13. **బాలచంద్రుని బొంగరాలాట చూచేందుకు వెళదామని బ్రాహ్మణ వనిత వైశ్య వనితతో అన్నపుడు సాగే వ్యాఖ్యానంః-**

"ఓయమ్మ బాలుండు ఉరుమని పిడుగు
పాప పుణ్యంబుల భావింపడతడు
శకట సమూహంబు చనియెడు వేళ
చీలలూడగదీయు జేతులు బట్టి
ఆడెడు పాపల అదరంట గొట్టు
వెంగలి దుష్టుండు వీత ధర్ముండు
వాని జూడగనేల వాంఛ జనించె"

**"పలనాటి వీరచరిత్ర"-శ్రీనాథుడు**

14. "ఏడేండ్లనుండి తానేమారనట్టి
వేశ్యపై మోహంబు విడువ నొనర్తు" **"పలనాటి వీరచరిత్ర"-శ్రీనాథుడు**

"బాలచంద్రుడు యుక్త వయస్కుడైన పిమ్మట మాంచాలతో శోభనము ఏర్పాటు చేసిననూ ఆ మూడు దినములు కూడా భార్యను చూడక వేశ్యాగృహమునకేగి గడిపెను"

**"హైహయరాజుల పాలనలో పల్నాటి చరిత్ర" -డా.స్వర్ణ వాచస్పతి**

"ఐతమ్మ పెద్ద మొత్తంలో ధనము, చీరెలు,బంగారు ఆభరణాలు ఇచ్చి బాలచంద్రుని మాంచాల గృహమునకు బంపెను. బాలచంద్రుడు మిత్రులతో సాని యింటికేగి తన తల్లి యిచ్చిన ధనము, చీరెలు, ఆభరణములన్నియు సానికిచ్చి అత్తవారింటికేగెను".

**"హైహయరాజుల పాలనలో పల్నాటి వీరచరిత్ర" -డా. స్వర్ణ వాచస్పతి**

**ఐతమ్మ ఇదే విషయం మాంచాలతో చెప్పి బాలచంద్రుని యుద్ధానికి పోకుండా నిలువరింపమన్న సందర్భంలో :-**

**మాంచాల :** "తెరవరో వీడు మదిని సందియమును
వదిలింపు బాలుని పగతీర్చుటకును
పోయడు పయనంబుబుద్ధి మాన్పింత
ఏడేండ్లకైన తానేమారనట్టి
వేశ్యపై మోహంబు విడవ నొనర్తు"

15. "ఒక జూదగాడి కడుపున పుట్టిన నాకు రణధర్మా లెలా తెలుస్తాయి. తండ్రిగా పెంచని వాడికి కొడుకును దూషించే హక్కు లేదు. నీ మూలానే నేను ఆలోచనా హీనుడను, యుక్తాయుక్త విచక్షణ జ్ఞాన హీనుడను అయ్యాను. మంత్రి బ్రహ్మన్నా ఒకసారి ఆలోచించుకో! నీలో ఎన్ని తప్పులున్నాయో. పెత్తనం నిలుపుకోవడ మంటే ఇతరులను దూషించడం కాదు. నీవు నాకు తండ్రి వేనా అని నాకు ఎప్పుడూ అనుమానమొస్తుంది. కోడి పందానికి కాలుదువ్వింది నువ్వు, రాజ్యాన్ని చీల్చింది నువ్వు , నన్ను తల్లి ప్రేమకు దూరం చేసింది నువ్వు. యుద్ధం అని రెచ్చగొట్టడం, శాంతి అని సంప్రదింపులు చేయటం నీకు తెలుసు. నీ కడుపున పుట్టిన నేరానికి నే చరిత్ర హీనుడయ్యాను. నా తప్పులు తెలుసుకుని మనిషినయ్యాను. నీ తప్పులు తెలుసుకొనలేవు. ఇకపై నేను చచ్చినా, బ్రతికినా నీ ముఖం చూడను" అని తండ్రితో పలికి రణక్షేత్రానికెళ్ళాడు.

**"పల్నాటి మహాభారతం" - చిట్టిబాబు**

16. "Brahmanayudu killed both Dodda and Alugu and then enthroned Nalakama"

**" I bid-see" sewell.**

"The Chronicle says that Dodda was bothered about his son Brahmanayudu who killed both Dodda (Doddanayudu) and Alugu"(Alugu Raju)

**"I bid" - Robert Sewell.**

17. “నాగమ్మ మంత్రిణి అయిన వెంటనే భటులను పంపి బ్రహ్మన్న స్నేహితుల గృహములలో గల ధనమునంతయు తెప్పించి రాజు ముందుంచి ‘బ్రహ్మన్న’ ఈ విధముగా ప్రభుత్వ ధనమును తనవారి ఇండ్లకు జేర్చి స్వామి ద్రోహము చేయుచున్నాడని”

**“పల్నాటి వీరచరిత్ర” – పింగళ లక్ష్మీకాంతం.**

“గురజాల నగరుకు కొలువు కూటముకు
వచ్చుచు పోవుచు వనిత నాగమ్మ
జాడ లెరుంగుచు జాణయై మసల
నమ్రు లై యుండిరి నాయకు లెల్ల
స్త్రీయని తలపోసి శీలమ బ్రహ్మ
చులకన చేయగా చూచి రోషించి”

**“పల్నాటి వీర చరిత్ర” – పింగళి లక్ష్మీకాంతం.**

18. “రవి తిరుగ లేనంత రాజ్యాన సత్కీర్తి
గేల గీలించిన గేస్తురాలు
పలనాటి పసిడి కోటల గావు లెత్తించి
సారె భూపులకంపు ధీరురాలు
నాయని పక్కలో నాగుబామై నాండు
మంత్రిగా నెగడిన మాన్యురాలు
కనుల జేవురు నిప్పులను రాల్చి కనుమల
వలస బంపిన బలవంతురాలు
..................
..................

కాలమా! మాదు నాయకురాలి వంటి
బిడ్డ నేదేశ మందైన బెంచినావె?!"

**– రాయప్రోలు సుబ్బారావు**

19. "కన్నమ లాంటి అనుయాయుల బలగాలతో బ్రహ్మనాయుడు బలప్రదర్శన చేశాడు. వయస్సు, అనుభవంలో పరిపూర్ణత లేని నలగాముని బలహీనత, నిలదొక్కుకోని నాయకురాలి మంత్రి స్థానం నాయుడికి కలిసి వచ్చాయి."

20. కారంపూడి వీరాచార పీఠం ఈ గాథను గానం చేయడానికి వీరిని మాత్రమే అనుమతించింది. ఈ శాఖను పల్నాడు విడిపోయిన తరువాతనే మాచర్ల స్థాపన అనంతరం బ్రహ్మన్న ఏర్పరచాడు. కన్నమదాసు కులస్థులే వీరవిద్యావంతులు, ఇప్పటికీ పల్నాటి వీరగాథను వీరే గానం చేస్తారు.

**– "పల్నాటి వీరచరిత్ర" – పి.వి.ఆచారి**

"నాయకురాలి తండ్రిని హతమార్చే సమయానికి బ్రహ్మనాయుడు యువకుడు. పాలనానుభవం తక్కువ. అలరాజు హత్యనాటికి అపారమైన అనుభవం సంపాదించాడు. అంతేకాక తన వర్గంలోని ఒక బలమైన సమూహానికి చెందిన అలరాజు హత్య రహస్యంగానే ముగించాలి. బహిరంగమైతే అటు మలిదేవాదులు, ఇటు నలగాముడు ఇద్దరూ ఏకమై తన ఉనికికే ప్రమాదంగా మారవచ్చు. మలిదేవులకు మేనల్లుడు, నలగామునికి అల్లుడు కావడమే ఇందుకు కారణం. ఈ సందర్భ ఫలితంగానే బ్రహ్మన్న రహస్య కావ్యం రచించాడు. మనసులోనే కుట్రను దాచుకుని తన కుమారుడైన కన్నమతో అమలుపరిచాడు. వయస్సు, అనుభవం కుటిలత్వాన్ని నేర్పాయి."

21. "శివసింగు శైవుడే. కుటుంబాల మధ్య భేదాభిప్రాయాలు శివసింగు నాగులాదేవి వివాహానికి అడ్డునిలిచాయి. మహాంకాళి పీఠం (శక్తి పీఠం) శైవానికి చెందినదే కదా! శివశింగు నందిసోమునికి చెందిన మహంకాళీ పీఠం ఎత్తుకెళ్ళి తన కోటకు చేర్చి ఆరాధించాడు. 'శివ'సింగు నామము యందుగల తొలిపదం శైవమే అన్న విషయం చెప్పకనే వెల్లడిస్తుంది"

22. గురజాలలో నాగమ్మ త్రవ్వించుచున్న దూపచెరువు కూలీలను చంపుటకు బ్రహ్మనాయుడు తన ఆధీనములోనున్న కొమ్మరాజు మనుష్యులను

పంపాడు. అయితే నాగమ్మ కొమ్మరాజు మనుష్యుల కుట్ర తెలుసుకుని తానే మట్టుపెట్టింది. ఈ సంఘటనను నలగామునిపైకి మళ్ళించి కొమ్మరాజుతో నలగామునికి విరోధము కలిగించెను.

**"పలనాటి చరిత్ర"–గుర్రం చెన్నారెడ్డి**

23. అలరాజు మహాశూరుడు. నూర్గురు రాజులను జయించి"రాచమల్లు" అను బీరుదు వహించెను.

**మూడవ ప్రతి – మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక బాండాగారం.**

**మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున 'రాచమల్లు రాయబారము' పేరుతో నాలుగు ప్రతులున్నవి. వాటిలో :–**

"పలనాటి వీరులందరిలోనూ అలరాజు మిక్కిలి గొప్పవాడు. ఈ గాథలో వచ్చు నేవీరుడైననూ నితనికి దక్కువవాడే. పెద్దన్న ,బ్రహ్మన్న మున్నగు మహావీరులు సైతం ఇతని తరువాత జెప్పదగిన వారే. కాని తెలుగు విమర్శకలోక మీతని గొప్పదనమును గుర్తించినట్లు లేదు. బ్రహ్మనాయునికి లేని ప్రాముఖ్యము నంటగట్టిరి. అలరాజునకు వీరగాథలలోనే గాక, కీర్తి ప్రతిష్ఠల యందు నన్యాయము జరిగినది. ఈతని దుర్మరణమునకు బ్రహ్మనాయుడే ముఖ్యకారకుడు.

**నాలుగో ప్రతి – మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం**

24. **బాలచంద్రుడు :** "నాయకురాలు చెరువు త్రవ్విస్తుంటే నీవు(బ్రహ్మనాయుడు) జత్తిందమల్లరాజును,గట్టింద మల్లరాజును పంపావు. నీద్రోహము వలన వారిరువురూ చంపబడ్డారు".

**"హైహయ రాజుల పాలనలో పల్నాటి చరిత్ర"– డా. స్వర్ణ వాచస్పతి.**

25. "బాదరాజుతో యుద్ధ ఉపసంహరణకు అలరాజు సూర్య భేతాళమను ఖడ్గమునకు బ్రహ్మన్న ఏడు దున్నపోతులు, ఏడు బద్దెగొర్లు, ఏడు గాణక్కణిజులు ఆహుతిగా బెట్టెను."

**"గురజాల రాయబారము" – వ్రాతప్రతి**

26. "He (Brahmanayudu) was very pleased at the thought of sending Ala Rachamallu (AlaRaju) going to his death

**" The Epic of Palnadu" - GH. Rogheir**

"He (Brahmanayudu) was overjoyed at the thought of Ala Rachamallu (AlaRaju) going to his death

**" The Epic of palnadu" - GH.Rogheir.**

27. బ్రహ్మనాయుడు గురజాల పోతూ ఆ పట్టణ సమీపంలోని రేయంతబయళ్ళలో జరుగుతున్న కోడి పందాన్ని చూస్తూ ఆగిపోయాడు. అంతలో పందెమాడుతున్న ఒక కోడి పారిపోయింది." అదిగో బ్రహ్మనాయుడి కోడి పారిపోయిందని" ఒక తుంటరి అన్నాడు. ఆ మాటలు బ్రహ్మనాయుడిని స్థంభింపజేశాయి. కోడి పందెంలో నలగామ రాజును ఓడించి గురజాల సీమను స్వాధీనం చేసుకోవాలనే కోరిక కలిగింది"

**"పలనాటి చరిత్ర" - గుర్రం చెన్నారెడ్డి**

"స్త్రీలు పందాలను ప్రోత్సహించిన వైనాలు చరిత్రలో లేవు. పురుషులే జూదవ్యసనపరులు. నాయుడు ఇదివరలో కూడా గుత్తికొండ బిలం వద్ద పందెమాడాడు."

**"హైహయరాజులపాలనలోపల్నాటి చరిత్ర" –డా. స్వర్ణ వాచస్పతి.**

"వెరపిడి మాటల వెరవంగ నేల
ఇంతి నేనిచ్చెద నేపందెమైన
పెట్టుము నీకింత ప్రియమయ్యె నేని"

**"పలనాటి వీరచరిత్ర"– పింగళి లక్ష్మీకాంతం**

"బ్రహ్మనాయుడు నామెతో పణమేదియో చెప్ప పందెమాడెదననెను. రాజ్యములు పణముగా పెట్టి పందెమాడుటకు ఇరువురు అంగీకరించిరి"

**"పలనాటి వీరచరిత్ర"– పింగళి లక్ష్మీకాంతం**

"మలిదేవుని సభలోని రాజు లాడుదానితో
కోడి పందెమొప్పినందులకు నాయుని గరిహించిరి".

**"పలనాటి వీరచరిత్ర" – శ్రీనాథుడు.**

28. "గురజాల ప్రజలు , ప్రభువులు ఒకవైపు, మాచర్ల ప్రజలు, ప్రభువులు మరోవైపు కూర్చున్నారు. అలరాజు గోదా ఎక్కి కూర్చున్నారు. గోపన్న పుంజును పట్టుకొని బ్రహ్మనాయుని ముందుపెట్టాడు. చింతపల్లి రెడ్డి తన పుంజు'నల్ల మల్లును'

పట్టుకొచ్చాడు. రెండు జాతిపుంజులే. అలరాజు అనుజ్ఞతో ఇద్దరు పందెగాళ్ళు ఎదురు పక్షం పుంజుల ఈకల్ని, రెక్కల్ని పరీక్షించారు. (అది కోడిపందాలకు ఆనవాయితి. రెక్కల్లో విషపుకత్తుల అవీ పెట్టకుండా చూచేపరీక్షయిది. అలాగే కోళ్ళకాళ్ళకు చుట్టబడిన కత్తుల్ని కూడా పరీక్షిస్తారు). సిద్ధమేనా అని అడిగాడు అలరాజు. బ్రహ్మన్న ముఖం చూచి పెదమలిదేవుడు నాగమ్మను చూచి నలగామ రాజు సిద్ధమే అన్నారు. అలరాజు పుంజుల్ని వదలండి అన్నాడు. ఇరువైపుల పందెగాళ్ళు ముక్కుల్తో పొడిపించి పుంజుల్ని పోరుకు వదిలారు”

**“పల్నాటి మహాభారతం”– చిట్టిబాబు**

29. **మంద పోరుకు ప్రతిగా బ్రహ్మానాయుడు గురజాలపై దండ యాత్రకు వెళుతున్నాని మలిదేవునితో చెప్పినపుడు వారిద్దరి మధ్య జరిగిన సంభాషణః**

“మసలక గురజాల మరువక పొడుత
సెలవియ్యి రాజేంద్ర సెలవియ్యి రాజ
ఆ మాటవిన్న మలిదేవ రాజు
నాయుడా వినవయ్య నా విన్నపంబు
నీ చేత మృతి పొందెనపుడు నా తండ్రి
అనుగు రాజేంద్రుడు అతి వేగమునను
మ్రొక్కు వేసిన ఘనత మిక్కుటంబాయె”

**“పలనాటి వీరచరిత్ర” – శ్రీనాధుడు**

30. “తరుణి మాయత్తకు తనయు లేడుగురు
ఏడుగురికొక్కడే యెలమి నాసుతుడు
కళ్యాణ మేలుచూ ఘనుడు మా మామ
లింగైక్య మందగా లీలతోరాజు
మీలోకి వచ్చెను మిగుల మెరుగాయె
నమ్మి వచ్చిన వారి సడుప వలెగాక
మహిలోన కూల్చెడి మహిపతుల్ గలరే
ఏగురికొక సుతునేమని యిచ్చి
ఏ దేశ యేభూమి కేగదమయ్య
నాకుమారుని పంప న్యాయమా నీకు”

**“పలనాటి వీరచరిత్ర”–పింగళి లక్ష్మీకాంతం**

31. **వనమాల(తులసీమాల)కోసం బాల చంద్రుని పంపుతూ బ్రహ్మనాయుడు :**

మ. "అలరాజేగిన నాయుడాత్మజుని యుద్యత్ర్పీతి వీక్షించి'యో
లలనా మన్మథ! సత్కుమారవర ! యుల్లాసంబునన్ గొమ్మ భూ
వలయాధీశ్వరు సూతి జేరజని నీవై దగ్గిచేదద్గళ
స్థలి నొప్పారెడి మామకీయ తులసీదామమ్ము దే జూచెదన్"

**'వీరభాగవతం'– ముదిగొండ వీరభద్రకవి.**

నరసింగరాజు నాగమ్మ ప్రోద్బలంతో అలరాజును చంపించాడని మేడపిలో అందర్నీ ఒప్పించాడు కన్నమ. గురజాలలో బ్రహ్మనాయుడే కన్నమ ద్వారా అలరాజుకు విషప్రయోగం చేయించాడనే వార్తలు మిక్కుటమయ్యాయి.

**"హైహయరాజులపాలనలోపల్నాటిచరిత్ర" ____.డా.స్వర్ణవాచస్పతి.**

**కారంపూడి యుద్ధభుమిలో బ్రహ్మనాయుడు – బాల చంద్రుని సంవాదముః**

32. **బ్రహ్మనాయుడు :** "రమ్మని నిను పిల్వరాజంపలేదు
వచ్చి యూరక యున్న వాడవుకావు
చూరగొంటివి సేన శూరుడ వగుచు
చెల్లెబోనీవిట్లు చేసిన క్రమము
విభునకు సేనకు విధివైతివకట"

**బాలచంద్రుడు :** "అని పల్క విని బాలుడతుల రౌద్రమున
పలికె నందరు విన బ్రహ్మన్నతోడ
వెడవెడ యేడ్పులు వేగ చాలింపు
కొలువులో మామామ కొమ్మ భూపతికి
అలరాజు పగకయి అప్పగించితివి
నీ స్వభావంబింక నే వివరింత
పోగొట్టితివి కోడి పోరున భూమి
నిను నమ్మి వచ్చిన నీ మేన మరది
ప్రాణంబు గొన్నట్టి పాపాత్మకుడవు
చెలువు చూడగ బంప చెవులరాయనను
చండ కర్ముడవయి చంపించి తీవు
ఘను వేంక జోదును కలనికి బంపి

మందలో చంపితి మాయ మొనర్చి
యిటువంటి నీ చేష్టలెన్ని వర్ణింతు"

**"పలనాటి వీరచరిత్ర"– శ్రీనాధుడు**

**బ్రహ్మనాయుడు :** "పిలువకయే వచ్చి, ఊరకుండక
నరసింగరాజును చంపినావ"ని నిందించ

**బాలచంద్రుడు :** **బాలచంద్రుడు రోషాన పలికెనిట్లు :**
"ఇంటి కగ్గిపెట్టిన వాడె యేడ్చినట్లు
వగలమారి యేడ్పులు నీకు తగదు సుమ్ము
పెద్ద వాడవు నీవంచు విశ్వసించి
యల్ల మల్లుని (అలరాజు) నీ చేతి కప్పగింప
రాయబారంపు నెపమున మాయజేసి
యచటికంపించి చంపింప న్యాయమగునె
కోడిపోరున రాజ్యము కోలుపోయి
బంధు జనముల నడవుల పాలుజేసి
చెప్పు చుంటివి నీతులు సిగ్గులేక
వెలగ బెట్టకు మింక నీ పెద్దరికము"

**"పల్నాటి భారతము"– డా.కోడూరి ప్రభాకరరెడ్డి**

33. **నలగామునికి సహకరించిన మిత్ర రాజుల వివరాలుః–**
"మానుగుండముకోట మనుజేశునకును
ధరణికోట పురికి దక్షుడైనట్టి
భీమ దేవుండను పృధ్వీశునకును
గోలంకి భర్తకు ఘూర్జరపతికి
ఉరగ సేనుండను ఉర్వీశునకును
ఏడు గూడెము లేలు ఎరుక కామునికి
దేవాద్రి నేలెడు తెలుగు బిడ్డలకు
పెద బాహు భూపతి భీమ సేనులకు
సూర్యకుమారాఖ్య చోళరాజునకు
సంగ్రామ విజయుడౌ జయదేవునకును

జయసింగు నృపతికి చంద్రాద్రిపతికి
ధీర విక్రముడైన తిరునాళ్ళపతికి
ప్రాభవాఢ్యుడు వీరభల్లాణునకును
అరవసింగాళ్ళన కర్ణమాపతికి
బంగళా పతికిని పాండ్యేశునకును
మళయాళ కర్ణాట మాన వేంద్రులకు
వ్రాయించి పంపిన"

**"పలనాటి వీరచరిత్ర"– శ్రీనాధుడు**

**సంధికి పంపుతూ రాయబారులతో నాయకురాలు జరిపిన సంభాషణః–**

34. "నలగాము కొల్వులో నాయకురాలు
తలపోసి మదిలోన తగిన వారలను
వాసిగా బ్రహ్మన్న వద్దకు బంపి
బవరంబు గాకుండ పట్టుట కార్య
మని పెద్దలనదగు ఆప్తవర్గమును
కొండ అన్నమరాజు కోట కేతుడును
కూరిమిహితుడు మాడ్గుల వీరరెడ్డి
పరమాప్తుడౌ చింతపల్లిరెడ్డియును
మొదలైన సువిచార ముఖ్యులైనట్టి
చనవర్ల బిలిపించి సమబుద్ధి ననియె
బహు పరాక్రములును ప్రాభవులైన
వీరులురాజులు వెలయ శోభిల్లు
కొల్వులోనికి పోయి కూరిమి మీర
సమరంబు గాకుండ సంధి యౌనట్లు
మాటాడి అట మీద మాచర్ల భాగ
మేలుకొమ్మని చెప్పు మింకొక మాట
నాయుని వద్దకు నరసింగు దెచ్చి
కులవైర మడుతుము కోరిమీరంద
రొక్కటి కమ్మని యొప్పించిరండు."

35. **కోట కేతుడు బ్రహ్మానాదులతో చేసిన సంధి విన్నపం:-**

"వినవయ్య నాయుడా విన్నపం బొకటి
అతి వివేకులు మీరలఖిల రాజ్యముల
మీ దృశులయినట్టి మేటి విక్రములు
నీతి మంతులు మీరు నిశ్చయంబిదియు
గొంతు గోయగ మీరు కోరిన యట్టి
నరసింగ రాజును నయమున దెచ్చి
యిచ్చెద మీమీద నెపమైన లెస్స
సరవి రక్షించిన సంహరించినను
భారంబు మీపయిన పాదుకయుండు
మును పటి రీతిని ముదమొప్ప మీరు
మాచర్ల భాగంబు మక్కువ నేలి
సంరక్షణము జేయ జనముల నెల్ల"

**"పలనాటి వీరచరిత్ర"- శ్రీనాథుడు**

36. "బొంగరం కాలికి తగిలి గాయపడిన అన్నమ్మ ఆగ్రహంతో దూషించే సందర్భంలోనే కారంపూడి యుద్ధం గురించి బాలచంద్రునికి తెలిసింది." తల్లి ఐతమ్మ వద్దకు వెళ్ళి ధ్రువపరచుకుని యుద్ధానికి వెళతానని తెలిపాడు. బ్రహ్మనాయుడు చెప్పలేదు. ఇతరుల ద్వారా తెలియనీయలేదు. బాలచంద్రుని పై బ్రహ్మనాయుడి వాత్సల్యం, ఐతమ్మకడుపు తీపి కారంపూడిలో యుద్ధం విషయాన్ని గోప్యపరచాయి".

"సబ్బాయి (సబ్బసాని) అనే వేశ్యతో సంబంధం ఏర్పరచుకొన్నాడని (బాల చంద్రుడు) తెలిసి బ్రహ్మనాయునితో చెప్పి మందలించవలసిందిగా (ఐతమ్మ) కోరగా! ఏదో ఒక వ్యసనమునకు లోనైనపుడే అతడు రాజకీయాలవైపు దృష్టిపెట్టడని, అందువలన అతనిని మందలించడం తగదని చెప్పగా, ఐతమ్మ ఆశ్చర్యపోయి తండ్రిగా అలాంటివిషయము తెలిసి అలా మిన్నకుండుట యేమిటని ప్రశ్నించగా! నీ కొడుకు (బాలచంద్రుడు) నీకు దక్కాలంటే ఇంతకంటే మార్గము లేదు. ఆవేశముతో చిందులు త్రొక్కే బాలచంద్రుడు రాజకీయాలపై అవగాహన చేసుకుంటే, యుద్ధమే జరిగితే మనకు దక్కడనీ

చెబుతాడు." "దాంతో ఐతమ్మ తన ముద్దుల తనయుడు తనకు దక్కితే చాలునని ఆమెకూడా మౌనంగా ఉండేది." "రాత్రివేళల్లో సబ్బాయి కొలువు, పగటి పూట అంతఃపురంలోనే స్నేహితులతో ఆటపాటలు".

**కారంపూడి వీరాచార పీఠం సాధికారిక రచనగా ప్రకటించిన**
**"పల్నాటి వీరుల చరిత్ర"- పి.వి.ఆచారి**

**బాలచంద్రుని యుద్ధ కాంక్షను నిలువరించమని తల్లి ఐతమ్మ మాంచాలను కరినపుడు :**

**మాంచాల** : "తెరవరో వీడు మదిని సందియము
వదిలింపు బాలుని పగతీర్చుటకును
పోయెడు పయనంపు బుద్ధి మాన్పింతు"

**"పలనాటి వీరచరిత్ర"- శ్రీనాధుడు**

**బాలచంద్రుని యుద్ధ సన్నాహాలు ఎలా విరమింపజేతు అని తల్లి ఐతమ్మ తన అత్త శీలమ్మను సలహా కోరినపుడుః-**

**శీలమ్మ :** "బాలచంద్రుడు పదునేను
దినముల పరిణామ మొందు
కాలమెవ్వరికైన గడువగారాదు
కన్నకడుపు గాన కాంతరోనీవు
పడవలసిన పాట్లు పడవలెగాని
ఊరగ యుండుట ఉచితంబు గాదు."

**"శ్రీనాథభట్టకృత పలనాటి వీరచరిత్ర"**
**పండితశ్రీ ఉమాకాన్త విద్యాశేఖరుడు.**

"రమ్మని నిను పిల్వరాజంపలేదు"

**"పలనాటి వీరచరిత్ర"- శ్రీనాధుడు**

యద్ధరంగాన ఆగ్రహంతో బ్రహ్మనాయుడు బాలచంద్రునిపై విసిరిన వాగ్బాణాలు..... యుద్ధం గురించి బాలచంద్రునికి చెప్పలేదని తెలుపుతున్నాయి.

**37. పాదంలో బొంగరం మేకు దిగబడిన అగ్రహార వైశ్య మహిళ అన్నమ్మ బాలుని దూషించిన వైనంః-**

"ఓరి దురాత్ముడ, ఓరి దుర్మార్గ
క్రింది మీదెరుగక కెరలు చున్నావు
గర్వ మేటికి నీకు కాంతల యెడను
కలిగిన దినవలె గట్టుంగ వలయు
ఎరుక మాలిన చేష్టలేల చేసితివి
మురియంగనేల నీ పొంగెల్ల నణగ
ముదిరె మదంబు నీ మురిపెంబు క్రుంగ
తగ మల్ల భూపతి ధన మెల్ల నీదు
సదనంబు జేరిన సత్తువ నుండి
త్రుళ్ళుచు నున్నావు దుష్ట చిత్తుండ
సమరంబులో నిన్ను శత్రులుగుమ్మ
నడిచెడు పదముల నారసాలేయ
చూచెడు కనులకు సూదులు గ్రుచ్చ
పోతు సింహము రీతి పొదలు చున్నావు
మదము పట్టిన గిత్త మాడ్కి మేదపిని
ఉన్నావు కావర ముడిగెడు గాక"

**"పలనాటి వీరచరిత్ర"-శ్రీనాధుడు.**

38. **మాచర్ల - గురజాల రాజులకు సంధికుదిరి అందరూ కలసి భోజనములు చేయబోవుచుండగాః-**

"బాలచంద్రుడు చివ్వన లేచి
తమకించి నరసింగు తలను ఖండించి
కొమ్మ భూపతికిచ్చి కుల విరోధంబు
తీరిచి పంతంబు దీర్చెదననిన"
"వీరులు దొరలును వేగమె లేచి
సంధికార్యము మాని సాపాటునంత
గంగమడుగులో వేసి,వారించ వీరులు."

**"శ్రీనాథభట్టకృతపలనాటి వీరచరిత్ర" - పండితశ్రీ. ఉమాకాన్త విద్యాశేఖరుడు.**

"వీరులు సమావేశమై బాలచంద్రుడే ఈ యుద్ధానికి కారణం" అని చెప్పుకోసాగారు.

**"పలనాటి మహాభారతము"–చిట్టిబాబు.**

"బాలచంద్రుడు యుద్ధమే నా నిర్ణయమంటూ అన్నంవడ్డించిన విస్తరిని నాగులేటి నీళ్ళలో పడవేసి రణభూమికి వెళ్ళాడు"

**"హైహయరాజులపాలనలోపల్నాటిచరిత్ర"– డా. స్వర్ణ వాచస్పతి.**

"బాలచంద్రుడు కత్తిమొనతో రొమ్మున పొడిచినట్లు మెలికలు తిరిగి పొయ్యాడు. ఒక్క సారిగా పెద్ద కేక వేశాడు."ఉభయపక్షాలు ఒకటైనా సరే శత్రు సైన్యాలపై పడతాను. అందరినీ హతమారుస్తాను. నరసింగరాజు తలనరికి తెచ్చి కొమ్మరాజుకు కాన్కగా యిస్తాను" అంటూ అన్నం ముట్టకుండా లేచాడు. వడ్డించిన సిద్ధాన్నాన్ని విస్తరితోసహా పట్టుకుపోయి నాగులేటిలోని గంగధార మడుగులో కలిపి చేతులు కడుక్కున్నాడు"

"వడ్డించిన సిద్ధాన్నాన్ని సైతం నాగులేటిలోని గంగధార మడుగులో కలిపిన బాలచంద్రుడు వీరావేశంతో ఉప్పొంగి పొయ్యాడు. తన సంగడీలను ఆరుగురినీ పేరు పేరునా పిలిచాడు. సందేహాలు విడనాడి, బ్రతుకుపై ఆశలు వదులుకుని, శౌర్యశూరులై శత్రు సంహారం చేయండని,వారిలో ఉత్సాహాన్ని రేకెత్తించాడు. యుద్ధం చేయవద్దని బ్రతిమాలిన వీరుల మాటలను త్రోసిపుచ్చాడు. పిన తండ్రుల బోధనలను తిరస్కరించాడు."

**"పలనాటి చరిత్ర" - గుజ్జుం చెన్నారెడ్డి.**

39. "గోసంగులు (మాదిగలు) యుద్ధమునకు కారణము లేదని యుద్ధమును పరిత్యజించి వెళ్ళారు. దీనిని బట్టి వారు నాగమ్మ సంధిని ప్రశంసించి బ్రహ్మనాయుని, బాలచంద్రుని దోషులుగా నిర్ణయించినట్లు తెలియుచున్నది".

**హైహయ రాజుల పాలనలో పల్నాటి చరిత్ర - డా.స్వర్ణ వాచస్పతి.**

40. **నాయకురాలు యుద్ధప్రణాళికలో భాగంగా కారంపూడి చుట్టుప్రక్కల పన్నెండు గ్రామాలకు నిండుగా వ్యాపించి యుండునంత మహా సైన్యమును సమకూర్చినది. వీర విద్యావంతుల గానంలో ఈ విధంగా :–**

"సన్నిగళ్ళ,సాతి జూలకల్లు
చెట్లలో ఉన్న జానపాడు
చిన్ని నెమిలిపురి, పెద్ద నెమిలిపురి
గుత్తికొండ,గుట్ట బోళ్ల, గుళ్ళేపల్లి
నగిరికంటి కనుమ నాగమ్మ హద్దు

**ఇవి కాక ఒప్పిచర్ల,కొదమగుండ్ల,అడిగొప్పలలో కూడా సైన్యాన్ని ఉంచినట్లు ప్రమాణాలు ఉన్నాయి.**

41. "According to veera charithra Brahmanna and his partisans were victorious.Nayakuralu Fled and Brahmanna enthroned Nalagama once again.But tradition records that Nalagama was victorious"

**"Chalukya Cholulu Telugu Vignana sarvaswam"____.**
**Mallampalli Soma Sekhara Sarma.**

42. "శీలం బ్రహ్మనాయుడి ఒఱుగు"

**"పల్నాటి వీరచరిత్ర"– తిరుపతి ప్రాచ్యలిఖిత గ్రంధాలయము.**

"బ్రహ్మనాయుని విరుగు"

**"పల్నాటి వీర గాధా వృత్తము"– మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము.**

43. "ఈ నాటికీ ఆమె (నాయకురాలు నాగమ్మ) అరవెల్లి గ్రామంలో గ్రామ దేవతవలే పూజలందుకుంటూంది. ఆమెకు గుడి కట్టించారు. 5సం. కొకసారి కొలుపులు జరుపుతుంటారు. ఆ గుడిలో ఇచ్చే తీర్థం తీసుకుని వెళ్ళి ఆ ప్రాంత వాసులంతా పంట పొలాలపై పోలి కలగాలని చల్లుకుంటారు. ఆ గుడికి తూర్పువైపున ఉన్న వాగును నాయకురాలి వాగు అని, ఆ ప్రాంతానికి దగ్గరలో గల నీటి కొలనును నాయకురాలి మడుగని చెపుతారు. భూగర్భంలోని "నాయకురాలి గుడి" ఉపరితలం ఎవరూ త్రొక్కకుండా పెంకుతో కుటీరం కట్టించారు. ప్రతి బుధ – శుక్ర వారాలు పూజ జరుగుతుంది.

**"పలనాటి చరిత్ర"– గుర్రం చెన్నారెడ్డి**

44. సీ॥ ఇచ్చోట భుజియించి రేక కార్యస్థులై
సామంత నృపతులు చాపకూడు
ఇచ్చోట జింతించె నిచ్చనుపాయంబు
నళినాక్షి యార్వెల్లి నాయురాలు
నిజమున శుద్ధికై నిప్పుల యేటిలో
నోలాడె నిచ్చోట జీలసాని
ఇచ్చోట బోరిరి యిలపణంబుగ గొనగ
సవతి తల్లుల బిడ్డలవని పతులు

**తే॥** ధీరులగు వారలేవురు వీరపురుషు
లై, మదోద్ధతి నిచ్చోట నాజి బడిరి
అనుచు జెప్పదు రైతిహ్యా మచట నచట
జనుల పెద్దలు పల్లె దేశముల యందు

**"క్రీఢాభిరామము"– వినుకొండ వల్లభరాయుడు**

## నవ పరిశోధన

– డా॥ రాధశ్రీ

కం॥ నాయకురాలిని నిజమగు
నాయకిగా నిలుపబూని నవశోధనతో
పాయక వెలయించిన కృతి
ధ్యేయము సాధించి నిలచె తేజోమయమై !!

కం॥ యమరాజైనను, మన 'నా
గమ'కడతన శిరము వంచి గౌరవకైవా
రము చేయవలయునను విష
యము వివరణ చేసినావు యశమొప్పంగన్!!

కం॥ కుజనులు చూడగనేరని
నిజమును చూపించి నావు నేర్పుదలిర్పన్
ఋజువుల నుల్లేఖించుచు
ప్రజలందరు మెచ్చురీతి పదికాలంబుల్!!

కం॥ రాబోవు కాలమందున
ప్రాబల్యము చూపగలుగు పరిశోధనయై
"జాబిల్లికి పుడమినగల
శాబక" మై నీ రచనము సంతసమొసగున్!!

కం॥ లుకలుకలు గల చరిత్రను
సకలమ్ము సమీక్షచేసి – సంప్రోక్షణతో
నకలంకము చేసిన నిను
సకలాత్ముడు బ్రోచుగాత సత్కీర్తులతో!!




రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మాజీ మంత్రి శ్రీ మండలి బుద్ధ ప్రసాద్,
మాజీ ఎం.పి. శ్రీ గద్దె రామ్మోహనరావు నుండి అవార్డు అందుకుంటున్న రచయిత